ఆదివారం
12-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 112
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మూడో వ్యక్తి మెదడులో న్యూరాలింక్ చిప్

వాషింగ్టన్: మానవ మెదడులో ఎలక్ట్రానిక్ చిప్‌ను అమర్చే ప్రయోగాలు వేగవంతంగా జరుగుతున్నాయి. తాజాగా మరో వ్యక్తికి చిప్‌ను అమర్చినట్లు న్యూరాలింక్ సీఈఓ ఎలాన్ మస్క్ ప్రకటించారు. దాంతో ఈ చిప్ అమర్చిన వారి సంఖ్య మూడుకు చేరింది. వారందరిలో మంచి పనితీరు కనిపిస్తోందని తెలిపారు. 2025లో 20-30 మందిలో వాటిని అమర్చేలా ముందుకువెళ్తున్నామని చెప్పారు. ఈ మేరకు అమెరికాలోని లాస్‌వెగాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మస్క్ వెల్లడించారు.

దళిత అథ్లెట్‌పై 60 మంది లైంగిక దాడి

తిరువనంతపురం: కేరళలో అమానవీయ ఘటన వెలుగుచూసింది. 18 ఏళ్ల అథ్లెట్‌పై దాదాపు 60 మందికి పైగా వ్యక్తులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఐదేళ్లుగా ఈ దారుణాలు అనుభవిస్తూ వచ్చిన ఆ యువతి... చివరకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు తన ఆవేదనను పంచుకోవడంతో ఈ అమానుషం బయటికొచ్చింది. దీంతో పతనంతిట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 13 ఏళ్ల ప్రాయంలోనే

- మిగతా 2 లో



గుజరాత్‌లో మరో చిన్నారికి హెచ్‌ఎంపీవీ

అహ్మదాబాద్ : గుజరాత్‌లో మరో చిన్నారికి హ్యూమన్ మెటాప్న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) సోకింది. వైద్య పరీక్షలో పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో ఆ రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ వైరస్ కేసుల సంఖ్య నాలుగుకు పెరిగింది. జనవరి 6న అహ్మదాబాద్‌కు చెందిన తొమ్మిది నెలల చిన్నారికి జలుబు, దగ్గుతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురైంది. దీంతో నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో ఆ చిన్నారిని

- మిగతా 2 లో

డ్యామ్‌లో పడి ఐదుగురు యువకుల మృతి

విశాలాంధ్ర-హైదరాబాద్: ఈత సరదా ప్రాణంమీదికి తెచ్చింది. నీటిలో మునిగి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పండుగ వేళలో తమ కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని కొండపోచమ్మ సాగర్ డ్యామ్‌లో ఈతకు దిగి హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు మృతి చెందారు. నగరానికి చెందిన ఏడుగురు యువకులు శనివారం కొండపోచమ్మ సాగర్‌కు ఈతకు వెళ్లారు. ప్రమాదవశాత్తు వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగి ప్రాణాలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఊళ్లకు బారులు

ఏపీకి భారీగా తరలివస్తున్న ప్రజలు

- కిక్కిరిసిన రైళ్లు, బస్సులు, విమానాలు
- జాతీయరహదారులపై స్తంభించిన రవాణా
- టోల్‌గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు
- స్కూళ్లు, కాలేజీ బస్సులు వినియోగించాలని సీఎం ఆదేశం

రాష్ట్రంలో ఊరూరా సంక్రాంతి సందడి నెలకొంది. తెలుగు ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకునే ఈ పండుగకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో నివసించేవారితో పాటు విదేశాల నుంచి కూడా పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో పల్లెలు, పట్టణాలు కళకళలాడుతున్నాయి. బస్సులు, రైళ్లు, విమానాలు అన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. జాతీయ రహదారులను వాహనాల వరద ముంచెత్తుతోంది.

2లో

ఎన్నికల వేళ కాగ్ లీకేజీ

ఢిల్లీ సర్కారుకు రూ.2,026 కోట్లు నష్టమని ప్రచారం

మద్యం పాలసీపై బీజేపీ సరికొత్త డ్రామా

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేజ్రీవాల్ ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీ మరోసారి తెరపైకి వచ్చింది. ఈ పాలసీ కారణంగా ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల నష్టం వాటిల్లినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక పేర్కొంది. తన నివేదికను కాగ్ బహిర్గతం చేయనప్పటికీ ఎన్నికల ప్రచారం ఊపందుకున్న వేళ ఇది ప్రచారంలోకి రావడం అనుమానాలకు తావిస్తోంది. మద్యం పాలసీపై కాగ్ రూపొందించిన నివేదిక లీకైనట్లు జాతీయ మీడియా కథనాలు ప్రచురించింది. ఢిల్లీ మద్యం పాలసీ నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవడంలో ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) విఫలమైనట్లు కాగ్ పేర్కొంది. దీనిపై నిపుణుల కమిటీ సిఫార్సులను నాటి డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా నేతృత్వంలోని మంత్రుల బృందం విస్మరించిందని తెలిపింది. ఈ పాలసీపై కీలక నిర్ణయాలు తీసుకునే విషయంలో మంత్రిమండలి, లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం తీసుకోలేదని వెల్లడించింది. లైసెన్సుల జారీ, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు పేర్కొంది. ఈ వ్యవహారంలో అనేక ఫిర్యాదులు ఉన్నప్పటికీ అన్ని సంస్థలను వేలం వేసేందుకు అనుమతించినట్లు తెలిపింది. వేలం వేసిన సంస్థల ఆర్థికస్థితిగతులపై ఎలాంటి పరిశీలనలు జరపలేదని, నష్టాల్లో ఉన్న కంపెనీలకూ అవకాశం కల్పించినట్లు వెల్లడించింది. వారికి లైసెన్సులు పునరుద్ధరించినట్లు నివేదిక పేర్కొంది. కాగా... ఢిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న మద్యం పాలసీ తీసుకొచ్చింది. 2022 సెప్టెంబరు చివరికి దానిని వెనక్కి

- మిగతా 2 లో

కార్పొరేట్‌కు దీటుగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం

- భవిష్యత్ అవసరాలతో డిజైన్లు
- నెలాఖరులోగా శంకుస్థాపనకు చర్యలు
- అధికారులతో సీఎం సమీక్ష

విశాలాంధ్ర - హైదరాబాద్ : నూతన ఉస్మానియా ఆసుపత్రికి ఈ నెలాఖరులోగా శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆసుపత్రి నిర్మాణంపై శనివారం తన నివాసంలో సీఎం అధికారులతో సమీక్షించారు. గోషామహల్‌లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని ఆదేశించారు. నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్ గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీఎం... మార్పులు, చేర్పులను సూచించారు. ఆధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ నిర్మాణంతో ఇబ్బందులు తలెత్తకుండా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

పోలవరం పనులపై సంతృప్తి

ప్రాజెక్టును సందర్శించిన జలశక్తి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

విశాలాంధ్ర-పోలవరం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు అధ్యయనం చేసేందుకు కేంద్ర జలశక్తి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ శనివారం ఇక్కడికి వచ్చింది. ముందుగా ప్రాజెక్టులోని స్పిల్‌వేని కమిటీ పరిశీలించింది. అనంతరం ఎగువ, దిగువ కాఫర్ డ్యాం పనులు, జలవిద్యుత్ ప్రాజెక్టు పనులను పరిశీలించింది. అక్కడి నుంచి డయాఫ్రమ్ వాల్ పనులు పరిశీలించి... జనవనరులశాఖ అధికారులను, ప్రాజెక్టు ఇంజినీర్లను కలిసింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన పనుల వివరాలు అడిగి తెలుసుకుంది. ప్రాజెక్టు ప్రగతిపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించింది. క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిటీకి ఆయా ప్రాంతాలలో ప్రాజెక్టు పనులకు సంబంధించిన వివరాలను జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ వివరించారు. అంతకుముందు కమిటీ

- మిగతా 2 లో

బీజేపీ నియంత పాలనకు చరమగీతం పాడదాం

- పార్టీ శ్రేణులు ప్రజలకు చేరువకావాలి
- సెప్టెంబరులో చండీగఢ్‌లో జాతీయ మహాసభలు
- సయ్యద్ అజీజ్ పాషా

విశాలాంధ్ర-హైదరాబాద్: ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానాన్ని తీసుకురావడం ద్వారా దేశంలో నియంతపాలన తీసుకువచ్చేందుకు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాలకు సంసిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బండ్లగూడ గిరిప్రసాద్ భవన్‌లో శనివారం సీపీఐ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. అజీజ్ మాట్లాడుతూ ధనబలంతో పాటు, ఇండియా ఐక్య సంఘటన అనైక్యత తోడు కావడంతో వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సులభమైందని చెప్పారు. దేశానికి వెన్నెముక అయిన రైతుల ఉద్యమం ఢిల్లీ వేదికగా నేటికి కొనసాగుతోందన్నారు. దీనికి సంఘీభావంగా రాష్ట్రంలో సైతం పెద్ద ఎత్తున పోరాటాలను నిర్వర్తించాలని సూచించారు. సీపీఐ శతాబ్ది వసంతాల్లోకి అడుగిడుతున్న సందర్భంలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. దీనికి జిల్లా సమితి కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. పట్టణ ప్రాంత మధ్యతరగతి ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత క్రియాశీలకంగా పని చేయడం ద్వారా పార్టీని వారికి చేరువ చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సమరశీల పోరాటాలను నిర్వహించాలన్నారు. సమ సమాజమే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజల సమస్యలపై నిర్వర్తిస్తున్న పోరాటాలు, ఉద్యమాలకు విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లి వారి మద్దతును కూడగట్టాలని కోరారు. సీపీఐ 25 వ జాతీయ మహాసభలు చండీగఢ్‌లో సెప్టెంబరు 21 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు అజీజ్ పాషా తెలిపారు. మేలో దేశంలోని నలు మూలాల నుంచి నాలుగు జాతాలు ప్రారంభమై మహాసభల వేదికైన చండీగఢ్‌కు చేరుకుంటాయన్నారు. అగస్టు 31 నాటికి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని మహాసభలను పూర్తి చేసుకోవాలని చెప్పారు. అనంతరం కార్యదర్శి నివేదికను రాష్ట్ర సమితిలో ప్రవేశపెడుతూ పార్టీ రాష్ట్ర

- మిగతా 2 లో

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు బాధ్యత నాదే

ఆదివాసీ, గిరిజనుల శిక్షణ ముగింపులో భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం సంపూర్ణ అమలు బాధ్యతలు తానే తీసుకుంటానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. నాగార్జునసాగర్‌లో శనివారం ఆదివాసీలు, గిరిజనుల శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో మాట్లాడుతూ... తాను చీఫ్‌విప్‌గా ఉన్న సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సమావేశపరిచి అధిష్టానానికి నివేదిక ఇచ్చి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు చేయాలని కోరామని, డిప్యూటీ స్పీకర్ గా ఉన్నప్పుడు చట్టం ఆమోదం పొందిందని వివరించారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా అమలు చేసే బాధ్యత తనపై ఉందన్నారు. సబ్ ప్లాన్ చట్టం సర్వరోగ నివారిణిగా అభివర్ణించారు. నిధుల కేటాయింపులపై నివేదికలు తెప్పించి త్వరలో సమీక్ష సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద 10 శాతం నిధులు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఐటీడీఏలను పునర్జీవింప చేస్తాం, వాటికి కావాల్సిన బడ్జెట్ కేటాయించి నిరుద్యోగులకు శిక్షణ కల్పించి స్వయం ఉపాధిని కల్పిస్తాం అన్నారు. ఈ దేశ

- మిగతా 2 లో

భారత్‌పై పాక్ పరోక్ష యుద్ధం!

2లో

కొత్త చట్టం... సీఈసీ నియామకం?

సుప్రీం కోర్టు పరిశీలనపైనే అందరి దృష్టి

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) సభ్యుల నియామకంపై చట్టాన్ని పరిశీలించే సుప్రీం కోర్టు పైనే ఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఎందుకంటే భారత ప్రధాన న్యాయమూర్తి ఎంపిక ప్యానెల్ సభ్యుడిగా లేకపోవడం వల్ల దాని చెల్లుబాటును సవాలు చేయడం జరిగింది. డిసెంబరు 2023లో అమలులోకి వచ్చిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టాన్ని మొదటిసారిగా 2024 మార్చిలో అరుణ్ గోయెల్ రాజీనామా, అనుప్ చంద్ర పాండే పదవీ విరమణ తర్వాత ఏర్పడిన ఖాళీలు భర్తీ చేయడానికి జ్ఞానేశ్ కుమార్, ఎస్‌ఎస్ సంధును ఎన్నికల కమిషనర్లుగా నియమించడానికి ఉపయోగించారు. ఫిబ్రవరి 18న 65 ఏళ్ల వయస్సు వచ్చిన తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ పదవీ విరమణ చేయడంతో సీఈసీ నియామకానికి ఈ చట్టం మొదటిసారిగా అమలులోకి వస్తుంది. సీఈసీ, ఈసీల నియామకంపై కొత్త చట్టం అమల్లోకి రాకముందు... ప్రభుత్వ సిఫార్సుపై రాష్ట్రపతి ఎన్నికల కమిషనర్లను నియమించారు. సంప్రదాయం ప్రకారం అత్యంత సీనియర్ అయిన ఎన్నికల కమిషనర్‌ను సీఈసీగా నియమించారు. కానీ ఈసారి ప్రధాన మంత్రి నేతృత్వంలోని ప్యానెల్ కొత్త సీఈసీని నిర్ణయిస్తుంది. జ్ఞానేశ్ కుమార్‌కు జనవరి 26, 2029 వరకు పదవీకాలం ఉంటుంది. ప్రధానమంత్రి నేతృత్వంలోని ఈ ఎంపిక కమిటీలో ప్రధాన మంత్రి

- మిగతా 2 లో



ఆంధ్రలో తొలితరం కమ్యూనిస్టులు - 3

అగ్ర కులాల్లో జన్మించిన వారందరూ సంపన్నులు కానక్కర్లేదు. దేశంలోనే మొట్ట మొదటి రాజకీయ ఖైదీ అయిన దరిశి చెంచయ్య పేద వైశ్య కుటుంబంలో జన్మించారు. ఆయన విప్లవవాదిగా ప్రసిద్ధి పొందిన స్వాతంత్ర్య సమరయోధుడు. వృత్తి రీత్యా ఆయన వ్యవసాయ శాస్త్రవేత్త. వ్యవసాయం మీద ఆసక్తి ఉన్నందువల్ల పై చదువులకు అమెరికా వెళ్లారు. 1912లో లోగోస్ కళాశాల నుంచి బి.ఎస్సీ పూర్తి చేశారు. అమెరికాలో ఉండగానే ఆయన గదర్ పార్టీలో పని చేశారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

భారత్‌పై పాక్ పరోక్ష యుద్ధం!

ఇస్లామాబాద్: భారత్‌ను దెబ్బ తీయడమే పాకిస్థాన్ లక్ష్యంగా కనిపిస్తోంది. అభివృద్ధిని పక్కనపెట్టి...భారత్‌ను దెబ్బతీయడం కోసం ఎదురు చూస్తోంది. అందులో భాగంగా సమయం దొరికినప్పుడల్లా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టిస్తోంది. తాజాగా భారత్, పీవోకే (పాక్ ఆక్రమిత కశ్మీర్) సరిహద్దు నియంత్రణ రేఖ వెంబడి రక్షణ సామర్థ్యాన్ని అనూహ్యంగా పెంచుతోంది. కంచె వెంబడి పెద్ద సంఖ్యలో యాంటీ పర్సనల్ మైన్స్ ఏర్పాటు చేయడంతో పాటు స్పెషల్ సర్వీస్ గ్రూప్ కమాండోలు, మాక్ ఫైరింగ్ యూనిట్లను సిద్ధం చేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం. నియంత్రణ రేఖ వెంబడి ఓ పక్క సైనిక బలగాలను బలోపేతం చేసుకుంటున్న పాకిస్థాన్... స్థానిక ఉగ్రవాద సంస్థలను క్రియాశీలం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో భారత సైనిక వాహనాలే లక్ష్యంగా జరిగిన దాడుల్లో హిజ్బుల్ ఉగ్రవాదుల ప్రమేయం ఉన్నట్లు భారత రక్షణ వర్గాలు బలంగా విశ్వసిస్తున్నాయి. మందుపాతరలు పెట్టి సైనిక వాహనాలు పేల్చేయడం, వారు అప్రమత్తమయ్యేలోపే మాటువేసి కాల్పులు జరపడం హిజ్బుల్ వ్యూహంలో భాగం. ఈ తరహా ఘటనలు జమ్మూకశ్మీర్‌లో ఇటీవల కాలంలో ఎక్కువవుతున్నాయి. గత కొన్నాళ్లుగా స్తబ్దుగా ఉన్న హిజ్బుల్ ముజాహిదీన్ తన కార్యకలాపాలను మళ్లీ ప్రారంభించినట్లు ఈ ఘటనలు రుజువు చేస్తున్నాయి. దీని వెనక పాక్ హస్తం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. సైన్యంతో భారత్‌ను ఎదుర్కొనే బలంలేని పాకిస్థాన్... దొంగదెబ్బ తీయాలని ప్రయత్నిస్తోంది. నేరుగా యుద్ధానికి దిగకుండా ఉగ్రవాదులను పావులుగా వాడుకుంటోంది. వారికి ఆశ్రయం కల్పిస్తూ మారణహోమాలకు పురిగొల్పుతోంది. ఒకవేళ భారత్ ఎదురు తిరిగితే... పాకిస్థాన్‌పై దాడికి పాల్పడుతోందంటూ అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను దోషిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే తెహ్రీక్ ఇ- తాలిబన్ పాకిస్థాన్, హిజ్బుల్ తదితర ఉగ్ర సంస్థలకు పాలుపోసి పెంచుతోంది. కశ్మీర్‌లోయలో ఉండే స్థానిక ఉగ్రవాదులనే తమకు అనుకూలంగా మార్చుకుంటూ భారత్‌పై దాడులకు సిద్ధం చేస్తోంది. నేరుగా సైన్యంతో భారత్‌పై దాడి చేసినా, ఇతర ప్రాంతాల్లోని ఉగ్రవాదులకు ఆయా సంస్థలతో శిక్షణ ఇప్పించినా... దాడికి పురిగొల్పినా పాక్ దుర్బుద్ధి ప్రపంచానికి తెలిసిపోతుంది. అందుకే స్థానికంగా కశ్మీర్‌లోయలో స్థానిక ఉగ్రవాదులను పాక్ పావులుగా వాడుకుంటోంది. స్థానిక పరిస్థితులపై వారికి పూర్తి అవగాహన ఉండటంతో... దాడులు చేయడం సులువవుతోంది. ఇటీవల జరిగిన దాడులను పరిశీలిస్తే... ఉగ్రవాదులు అత్యంత కఠినమైన, దట్టమైన అడవులను ఆసరాగా చేసుకుంటున్నారు. దాడులు చేసి సులువుగా తప్పించుకుంటున్నారు.

రూ.10 వేల కోట్ల విలాస భవనం అగ్నికి ఆహుతి

లాస్‌ఏంజెలెస్: అమెరికాలోని లాస్ ఏంజెలెస్ ప్రాంతంలో కార్చిచ్చు చాలా ఇళ్లను బుగ్గి చేసింది. ఈ విలయం పసిఫిక్ పాలిసేడ్స్ ప్రాంతంలో అత్యంత ఖరీదైన భవనాన్ని శిథిలంగా మార్చింది. ఆ మాన్షన్ విలువ సుమారు 125 మిలియన్ డాలర్లు (అక్షరాలా రూ.10,375 కోట్లు). ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 18 పడక గదుల ఈ విలాస భవనం లుమినార్ టెక్నాలజీస్ సీఈఓ ఆస్టిన్ రస్సెల్‌కు చెందినది దీనిని అద్దెకు ఇస్తే... రూ.3 కోట్లపైనే వస్తోంది. సక్సెషన్ అనే టీవీ సిరీస్‌లో ఈ ఇల్లు కనిపిస్తుంది. దాంతోనే ఇది అందరి దృష్టిని ఆకర్షించింది. కానీ అబ్బురపరిచే ఫర్నీచర్, సుందరమైన గార్డెన్స్ అన్నీ బూడిదగా మారిపోయాయి. ఈ ఇంటి గురించిన కథనాల్లో పూర్తిస్థాయి ధ్రువీకరణ లేదు. కార్చిచ్చుతో సంపదలతో తులతూగిన లాస్ ఏంజెలెస్ నగరం మరుభూమిని తలపిస్తోంది. ఇక్కడ ఎగసిపడుతున్న పొగ, మంటలు అంతరిక్షంలోని ఉపగ్రహాలకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎటు చూసినా పూర్తిగా కాలిపోయి బూడిదగా మారిన గృహాలు దర్శనమిస్తున్నాయి. మరోవైపు ధనవంతులు, హాలీవుడ్ స్టార్లు వదిలేసి వెళ్లిపోయిన ఇళ్లల్లో విలువైన వస్తువులను దొంగలు దోచుకుంటున్నారు. ఆస్తి నష్టం 150 బిలియన్ డాలర్ల(రూ.12.9 లక్షల కోట్లు)కు పెరగొచ్చని ఆక్యూవెదర్ సంస్థ అంచనా వేసింది. అమెరికా బీమా రంగం కూడా ఈ కార్చిచ్చు దెబ్బకు కుదేలయ్యే పరిస్థితి నెలకొంది. జేపీ మోర్గాన్, మార్నింగ్ స్టార్ అంచనాల ప్రకారం 20 బిలియన్ డాలర్ల వరకు బీమా సంస్థలకు నష్టం రావచ్చని పేర్కొంది. కాలిఫోర్నియాలోని అతిపెద్ద బీమా సంస్థ స్టేట్ ఫామ్ కొన్ని నెలల కిందటే పాలిసాడ్స్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఇళ్లకు కార్చిచ్చు ముప్పు ఉందని గ్రహించి పాలసీలు ఇవ్వడం నిలిపివేసింది.

కొత్త చట్టం... సీఈసీ నియామకం?

(మొదటిపేజీ తరువాయి)

నియమించిన కేంద్ర మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఉంటారు. ఈ కమిటీ సీఈసీ లేదా ఎన్నికల కమిషనర్‌గా నియామకం కోసం రాష్ట్రపతికి పేరును సిఫార్సు చేస్తుంది. చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం, న్యాయ మంత్రి నేతృత్వంలోని సెర్చ్ కమిటీ షార్ట్‌లిస్ట్ చేయని వారిని కూడా పరిగణనలోకి తీసుకునే అధికారం ఎంపిక ప్యానెల్‌కు ఉంది. సీఈసీ, ఎన్నికల కమిషనర్లపై 1991 చట్టం వారి జీతాలు, సర్వీస్ పరిస్థితులను పరిష్కరించిందిన కానీ నియామక పద్ధతిని కాదు. మార్చి 2, 2023న ఇచ్చిన తీర్పులో, న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం సీఈసీ, ఎన్నికల కమిషనర్లను నియమించడానికి ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సీజేఐతో కూడిన ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. నియామకాలపై చట్టం రూపొందించే వరకు, ప్యానెల్ నిర్ణయించిన కొలీజియం చెల్లుబాటు అవుతుందని పేర్కొంది. తరువాత, ప్రభుత్వం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) బిల్లును తీసుకువచ్చినప్పుడు... సీజేఐ స్థానంలో ఎంపిక ప్యానెల్‌లో ప్రధాన మంత్రి నామినేషన్ చేసే కేంద్ర మంత్రిని నియమించింది. అయితే ఎంపిక కమిటీ కూర్పులో మార్పును సవాలు చేశారు. ఈ విషయాన్ని ఫిబ్రవరి 4వ తేదీకి వాయిదా వేస్తూ, ఎవరి అభిప్రాయాలు చెల్లుబాటు అవుతాయో చూస్తామని సుప్రీం కోర్టు ధర్మాసనం తెలిపింది. 'చట్టాన్ని రూపొందించడం ఆర్టికల్ 141 కింద కోర్టు అభిప్రాయం, శాసన అధికారం ఉంటుంది' అని నొక్కి చెప్పింది.

డెమోక్రాట్ల నీచమైన ఆట: ట్రంప్

వాషింగ్టన్: హష్ మనీ వ్యవహారంలో అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు న్యూయార్క్ జడ్జి బేషరతు విడుదలను అమలుచేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై ట్రంప్ స్పందించారు. ఇది డెమోక్రట్ల 'నీచమైన ఆట' అని ఆయన పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా ఆయన ఓ పోస్ట్ చేశారు. 'నాకు బేషరతు విడుదలను ఇచ్చారు. ఇలాంటి కేసు ముందెన్నడూ లేదని లీగల్ స్కాలర్లు, నిపుణులు చెబుతున్నారు. ఈ స్కామ్ మొత్తం కొట్టివేయడానికి అర్హమైనది. ఈ బూటకపు కేసుపై మేము అప్పీల్ చేస్తాం. ఒకప్పటి మన గొప్ప న్యాయవస్థపై అమెరికన్లు పెట్టుకున్న నమ్మకాన్ని పునరుద్ధరిస్తాం' అని ట్రంప్ రాసుకొచ్చారు. హష్ మనీకేసులో ట్రంప్ ఇప్పటికే దోషిగా తేలారు. అయితే... గత నవంబరులోనే న్యూయార్క్ కోర్టు ఆయనకు శిక్ష ఖరారు చేయాల్సిఉంది. అదే సమయంలో అమెరికా నూతన అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యారు.

దాంతో తాను క్రిమినల్ విచారణ ఎదుర్కోకుండా రక్షణ ఉంటుందని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ ట్రంప్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు తొలుత శిక్షను నిరవధికంగా వాయిదా వేయగా... అనంతరం రక్షణ కల్పించే అవకాశాలు లేవని తేల్చింది. ఈ క్రమంలోనే శుక్రవారం న్యూయార్క్ జడ్జి తీర్పు వెలువరించారు. దోషిగానే నిర్ధారిస్తూ ఎలాంటి శిక్ష, జరిమానా లేకుండా బేషరతు విడుదలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో దోషిగా నిర్ధారణ అయిన తొలి అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ నిలవనున్నారు. జనవరి 20న ఆయన నూతన అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించనున్న విషయం తెలిసిందే.

దళిత అథ్లెట్‌పై 60 మంది లైంగిక దాడి

(మొదటిపేజీ తరువాయి)

తనపై అత్యాచారం జరిగిందని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఆ సమయంలో తన పొరుగింట్లో ఉన్న ఓ వ్యక్తి తనను కొండల ప్రాంతానికి తీసుకెళ్లాడని, అక్కడ స్నేహితులతో కలిసి అత్యాచారానికి ఒడిగట్టాడని వాపోయింది. ఆ తర్వాత కొంతమంది కోచ్‌లు, తోటి ఆటగాళ్లు కూడా తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని తెలిపింది. భయంతోనే ఇన్నాళ్లూ ఈ విషయం బయటపెట్టలేదని పేర్కొంది. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టి... 62 మంది అనుమానితులను గుర్తించారు. వీరిలో 40 మందిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలిని షెల్టర్ హోంకు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, బాధితురాలికి అన్నివిధాలా అండగా ఉంటామని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వెల్లడించింది.

ఊళ్లకు బారులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఊరూరా సంక్రాంతి సందడి నెలకొంది. తెలుగు ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకునే ఈ పండుగకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో నివసించేవారితో పాటు విదేశాల నుంచి కూడా పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో పల్లెలు, పట్టణాలు కళకళలాడుతున్నాయి. బస్సులు, రైళ్లు, విమానాలు అన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. జాతీయ రహదారులను వాహనాల వరద ముంచెత్తుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ - విజయవాడ, చెన్నై-విశాఖ జాతీయ రహదారుల్లో కార్లు వేల సంఖ్యలో చీమలదండులా పరుగెడుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరం నుంచి లక్షల సంఖ్యలో తమ సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. ఈసారి పండుగ సెలవులతో పాటు శనివారం, ఆదివారం కలిసి వచ్చాయి. దీంతో సోమవారం సెలవు పెట్టుకుని దాదాపు ఆరు రోజుల సెలవు దినాలను ఆనందంగా గడిపేందుకు ఇతర ప్రాంతాల్లో నివసించే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఇతరులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. జాతీయ రహదారుల్లో టోల్‌గేట్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినప్పటికీ కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరుతున్నాయి. సంక్రాంతిని దృష్టిలో పెట్టుకుని టోల్ గేట్ల వద్ద ఏపీకి వచ్చే మార్గం వైపు అదనపు ద్వారాలు ఏర్పాటు చేశారు. పంతంగి టోల్‌గేట్ వద్ద 10 టోల్‌బూత్‌ల ద్వారా ఏపీ వైపు వస్తున్న వారిని పంపిస్తున్నారు. హైదరాబాద్ వైపు వెళ్లే వారిని 6 గేట్ల ద్వారా పంపిస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఉండేందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రత్యేకంగా కీలకమైన ప్రాంతాల్లో పోలీస్ బలగాలను ఏర్పాటు చేశాయి. అయినప్పటికీ జాతీయ రహదారులపై అనేకచోట్ల ట్రాఫిక్ స్థంభించిన పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం ఒక్కరోజే కీసర టోల్‌గేట్ నుంచి 25 వేల వాహనాలు విజయవాడ వైపు వచ్చినట్లు చెపుతున్నారంటే రద్దీ ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కీసర వద్ద కేవలం నాలుగు టోల్ బూత్‌లకే ద్వారాలు ఉండటంతో ట్రాఫిక్ కిలోమీటర్ల మేర నిల్చిపోయింది. ఇక సంక్రాంతికి భారీ రద్దీని అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ నగర సమీపంలో నిర్మించిన పశ్చిమ బైపాస్ రహదారిని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏలూరు, రాజమండ్రి, విశాఖ, కాకినాడ ప్రాంతం వెళ్లే వాహనాలను విజయవాడ నగరంలో ప్రవేశించకుండా గొల్లపూడి నుంచి బైపాస్ రోడ్ మీదుగా నేరుగా చినఅవుటపల్లికి మళ్లించారు. ఫలితంగా విజయవాడ మీదుగా వాహనాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు కొంత మేర తగ్గాయి. కీసర నుంచి ఏలూరు వైపు జాతీయ రహదారి మీదుగా వెళ్లే రద్దీని ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ ద్వారా డ్రోన్ కెమెరాల సహాయంతో పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ పరిస్థితి, పర్యవేక్షణ స్థితిగతులపై విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

స్కూళ్లు, కాలేజీ బస్సులు వినియోగించాలని సీఎం ఆదేశం

సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో ఏపీ, తెలంగాణ ఆర్టీసీ వేల సంఖ్యలో ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నప్పటికీ సరిపోవడం లేదు. తెలంగాణ సహా ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి ఏపీకి పెద్ద ఎత్తున ప్రజలు వస్తున్నారు. ప్రయాణికుల రద్దీతో ఏపీలోని ప్రధాన నగరాలైన విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం సహా అన్ని నగరాల్లోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. నగరాలు, పట్టణాల నుంచి సొంత గ్రామాలకు వెళ్లేందుకు వస్తున్న లక్షలాదిమంది ప్రయాణికులకు ఆర్టీసీ బస్సులు, ప్రత్యేక రైళ్లు సరిపోవడం లేదు. ప్రైవేటు వాహనాలు ఈ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు తీసుకొని ప్రయాణికులను ప్రధాన పట్టణాల నుంచి పల్లెలకు పంపేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, రవాణా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిట్‌నెస్ ఉన్న బస్సులను ఎంపిక చేసి వాటి ద్వారా ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు పంపే ఏర్పాట్లు చేయాలని సూచించారు. రద్దీ తీవ్రంగా ఉన్న మార్గాల్లో ఈ తరహా ఏర్పాట్లతో ప్రజలకు కొంత మేర ఇబ్బందులేకుండా చూడాలని ఆదేశించారు.

వీపు విమానం మోత

వీపు విమానం మోత మోగుతుందన్న పెద్దల సామెత తరహాలో విమాన సర్వీసుల చార్జీలు ప్రయాణికులకు మోత మోగిస్తున్నాయి. రైళ్లు, బస్సులు, కార్లకు తీవ్ర రద్దీ నెలకొన్న నేపథ్యంలో బెంగళూరు, చెన్నై, ముంబై, హైదరాబాద్ లాంటి నగరాల్లో ఉండే ఉద్యోగులు విమాన సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా విమాన సర్వీసులు భారీగా వసూలు చేస్తున్నాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్, బెంగళూరు నుంచి విశాఖ, విజయవాడ నగరాలకు కనీస ధర రూ.3,400 నుంచి రూ.4 వేలు ఉండగా... ప్రస్తుతం మూడు నాలుగు రెట్లు పెరిగిపోయింది. టికెట్ ధర రూ.17 నుంచి రూ.23 వేలు పలుకుతోంది.

కాగ్ లీకేజీ

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంది. ఈ మధ్యలో మద్యం విధానంలో అనేక అవకతవకలు జరిగాయని, ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ పాలసీని సవరించేటప్పుడు సిసోదియా అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఈడీ ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేసి, ప్రతిఫలంగా కొంత మొత్తాన్ని పొందినట్లు దర్యాప్తు సంస్థలు చెప్పాయి. ఈ కుంభకోణంలో భాగంగా సిసోదియా, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఇతర ఆప్ నేతలను అధికారులు అరెస్టు చేశారు. కొంతకాలం క్రితం నేతలు బెయిల్‌పై విడుదలయ్యారు. ఫిబ్రవర్ 5న డిసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సమయంలో కాగ్ నివేదిక లీక్ కావడం చర్చనీయాంశంగా మారింది. ఎలాగైనా దిల్లీలో ఆప్‌ను ఓడించటానికి బీజేపీ ఈ చర్చను తెరపైకి తీసుకొచ్చినట్లు విమర్శలు వచ్చాయి. కాగ్‌ను అడ్డుపెట్టుకొని నివేదికను లీక్ చేసి...ఆప్ అధినేత కేజ్రీవాల్‌ను బద్నాం చేయాలని బీజేపీ చూస్తున్నట్లు విశ్లేషకులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు.

గుజరాత్‌లో మరో చిన్నారికి హెచ్‌ఎంపీవీ

(మొదటిపేజీ తరువాయి)

అడ్మిట్ చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించగా హెచ్‌ఎంపీవీ వైరస్ సోకినట్లు శనివారం నిర్ధారణ అయ్యిందని అధికారులు తెలిపారు. ఆ చిన్నారి విదేశాల్లో ప్రయాణించలేదని అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పేర్కొంది. గుజరాత్‌లో వారం రోజుల్లో ఈ వైరస్ కేసుల సంఖ్య నాలుగుకు చేరిందని వైద్యాధికారులు తెలిపారు. జనవరి 10న సబర్కాంత జిల్లాకు చెందిన ఎనిమిదేళ్ల బాలుడికి హెచ్‌ఎమ్‌పీవీ సోకిందని తెలిపారు. రాష్ట్రంలో మూడవ కేసుగా అధికారులు పేర్కొన్నారు. జనవరి 9న అహ్మదాబాద్‌లో 80 ఏళ్ల వృద్ధుడికి ఈ వైరల్ ఇన్ఫెక్షన్ పాజిటివ్‌గా తేలింది. ఆస్తమాతో బాధపడుతున్న ఆ రోగి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరోవైపు, జనవరి 6న గుజరాత్‌లో హెచ్‌ఎమ్‌పీవీ తొలి కేసు నమోదయింది. రాజస్థాన్‌కు చెందిన రెండు నెలల బాలుడు జ్వరం, ముక్కు దిబ్బడ, ముక్కు కారటం, దగ్గు వంటి లక్షణాలతో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాడు. చికిత్స తర్వాత ఆ బాలుడిని డిశార్చ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు బాధ్యత నాదే

(మొదటిపేజీ తరువాయి)

సంపద కార్పోరేట్ శక్తులకు కాదు అన్నారు. భారత రాజ్యాంగాన్ని బలహీనపరచాలని కుట్ర జరుగుతుందని, రాజ్యాంగాన్ని రక్షించేందుకు రాహుల్ గాంధీ నడుం బిగించారన్నారు. సంవిధాన్ సమ్మేళన్ పేరిట ఆయన దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పీసా చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని 100శాతం అమలు చేస్తాం అన్నారు. ఇచ్చిన హామీలు అన్ని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇల్లు లేని పేదలకు రూ.22,500 కోట్లతో మొదటి దశలో నాలుగున్నర లక్షల మందికి ఐదు లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇల్లు , ఎస్సీ, ఎస్టీలకు అదనంగా రూ.లక్ష జత చేసి ఆరు లక్షలతో నిర్మిస్తామన్నారు. భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఈ నెల 26 నుంచి అందించబోతున్నామని చెప్పారు. కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం ఇవ్వబోతున్నామని వివరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం రాంజీ గోండు, కొమురం భీం, బిర్సా ముండా పెద్ద ఎత్తున పోరాటం చేశారని, ప్రాణాలు సైతం ఇచ్చేందుకు వెనుకాడని ధీరోదాత్తులు ఆదివాసీలు, గిరిజనులు అన్నారు. అటవీ భూముల్లో విద్యుత్ సౌకర్యానికి ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో సోలార్ పవర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి, మోటార్ల ద్వారా ఆటవీ భూములు సాగులోకి తెస్తామన్నారు.

డ్యామ్‌లో పడి ఐదుగురు యువకుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోయారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. మృతులను హైదరాబాద్‌కు చెందిన ధనుష్ (20), లోహిత్ (17), దినేశ్వర్ (17), జతిన్ (17), శ్రీనివాస్ (17)గా గుర్తించారు. ధనుష్, లోహిత్ ఇద్దరూ సొంత అన్నదమ్ములు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పండగకు ముందు చేతికందివచ్చిన బిడ్డలు మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులు కన్నీమున్నీరుగా విలపిస్తున్నాయి. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సీపీఐ రాష్ట్ర సమితి సంతాపం

సాగర్ డ్యామ్‌లో ఈతకు వెళ్లి ఐదుగురు విద్యార్థులు మృత్యువాత పడడంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు హైదరాబాదు బండ్లగూడ గిరి ప్రసాద్ భవన్‌లో జరుగుతున్న పార్టీ రాష్ట్ర సమితి... మృతులకు సంతాపాన్ని తెలిపింది

బీజేపీ నియంత పాలనకు చరమగీతం పాడదాం

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రసంగించారు.

ప్రముఖులకు సంతాపం

తొలుత ఇటీవల మరణించిన రాజకీయ, వివిధ రంగాల ప్రముఖులకు సంతాపం ప్రకటిస్తూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ సంతాప తీర్మానం ప్రవేశ పెట్టారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి, సీతారాం ఏచూరి, దిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా, క్యూబా విప్లవకారుడు గోంజాల్వెజ్ పెరెజ్, పారిశ్రామికవేత్త రతన్‌టాటా, ప్రముఖ చలనచిత్ర దర్శకుడు శ్యామ్ బెనెగల్, తబలా విద్వాంసుడు జాకీర్ హూస్సేన్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు ఏపూరి బ్రహ్మం, తెలంగాణ సాయుధ పోరాట యోధులు పాటిబండ్ల రాధమ్మ, దుర్గ్యా నాయక్, అఖిల భారత దళిత హక్కుల ఉద్యమ నాయకులు టి.ఆర్.బిజ్జు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మంగళంపల్లి జనార్ధన్, జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండల మాజీ కార్యదర్శి చల్లా శశి రేఖమ్మ, మహబూబాబాద్ జిల్లా నాయకులు నెల్లూరి సత్యనారాయణ రావు, మానవ హక్కుల కార్యకర్త, కర్నాటక మాజీ సీఎం ఎస్.ఎం.కృష్ణ, హర్యానా మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలా, కలవేణ సమ్మయ్య, బెజవాడ పిచ్చమ్మ, చంద్ జనార్దన్, దార లక్ష్మయ్యకు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సమావేశంలో సీపీఐ శతాబ్ది వేడుకలు, జాతీయ మహాసభలు, స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రజా సమస్యలు, ఉద్యమాలు, తాజా రాజకీయ తాజా పరిణామాలపై చర్చించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ పాల్గొన్నారు.

పోలవరం పనులపై సంతృప్తి

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులతో కలిసి ప్రాజెక్టు సమావేశపు హాలులో పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై కాంట్రాక్టు ఏజెన్సీ, ప్రాజెక్టు ఇంజినీర్లు, అధికారులతో కమిటీ చైర్మన్ రాజీవ్ ప్రతాప్ రూఢీ సమీక్షించారు. ప్రాజెక్టు ప్రయోజనాలు, పనుల పురోగతిని జలవనరుల శాఖ అధికారులు వివరించారు. అదేవిధంగా రాజీవ్ ప్రతాప్ రూఢీ లేవనెత్తిన అనేక అంశాలకు అధికారులు సమాధానం చెప్పారు. ప్రాజెక్టు పనులు, పురోగతిపై కమిటీ సంతృప్తి వ్యక్తంచేసింది. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నిర్వాసితుల కోసం నిర్మిస్తున్న గృహనిర్మాణ వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ సభ్యులు ఖిరు మహ్తో, ధర్మశీల గుప్తా, రిషేర్ సింగ్ ఘుబాయా, రోడ్మల్ నగర్, జోయంత బసుమతరి, నారాయణ్ దాస్ అహిర్వార్, సంజ్ఞ జాతవ్, సాగర్ ఈశ్వర్ ఖండ్రే, విశాల్ (దాదా) ప్రకాశ్ బాపు పాటిల్, మోహితే పాటిల్, ధైర్యసీల్ రాజ్‌సిన్హా ఉన్నారు. కమిటీ వెంట ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు నరసింహమూర్తి, బి.రాంబాబు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ మెంబర్ సెక్రటరీ ఎం.రఘురాం, ఏపీ జెన్కో ఎండీ కేవీఎన్ చంద్రశేఖర్, కేంద్ర జలసంఘం సభ్యుడు గోపాల్ సింగ్, మెగా ఇంజినీరింగ్ కంపెనీ ఎండీ సీహెచ్‌వీ సుబ్బయ్య, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీఓ ఎంవీ రమణ ప్రభృతులు ఉన్నారు.

మావోయిస్టు అగ్రనేత సోమయ్య లొంగుబాటు

విశాలాంధ్ర-హైదరాబాద్: మావోయిస్టు అగ్రనేత మత్స్య సోమయ్య శనివారం పోలీసులకు లొంగిపోయారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పంబాపూర్‌కు చెందిన సోమయ్య 1990లో పీపుల్స్ వార్‌లో చేరారు. 1992లో భూపాలపల్లి పోలీసులు అరెస్టు చేయగా తిరిగి 1993లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. సోమయ్య అలియాస్ సమ్మయ్య అలియాస్ సురేందర్ అలియాస్ సతీష్ ప్రస్తుతం డీసీఎస్, సౌత్ బస్తర్ వ్యవసాయ విభాగం ఇంచార్జిగా పని చేస్తున్నాడు. అనారోగ్య కారణాలతో ఎస్పీ కిరణ్ కరే ముందు లొంగిపోయాడు. సోమయ్యపై రూ.8 లక్షల రివార్డు కూడా ఉంది.

మైలవరం ఎరుపుమయం

సీపీఐ శత వసంత భారీ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర- విజయవాడ: సీపీఐ శత వసంతాల వేడుకల నేపథ్యంలో ఎర్రజెండాలతో మైలవరం ఎరుపుమయమైంది. మార్క్సిజం, లెనినిజమే ఆయుధాలుగా... సమసమాజ స్థాపనే లక్ష్యంగా 99 సంవత్సరాలుగా ఎన్నో త్యాగాలు... సమరశీల పోరాటాలు... ఎన్నెన్నో విజయాలు సాధిస్తూ గత నెల 26న సీపీఐ శత వసంతంలోకి అడుగిపెట్టిన సందర్భం చరిత్రాత్మకమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ కోటేశ్వరరావు కొనియాడారు. సీపీఐ శతవార్షికోత్సవాలను పురస్కరించుకుని సీపీఐ మైలవరం నియోజకవర్గ సమితి అధ్వర్యంలో మైలవరం సెంటర్ అమరవీరుల స్మాకర స్థూపం వద్ద నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేశ్ అధ్యక్షతన శనివారం సభ జరిగింది. కోటేశ్వరరావు మాట్లాడుతూ 1917లో ప్రపంచ గమనాన్నే మలుపు తిప్పిన మహోన్నత రష్యా విప్లవ స్ఫూర్తితో తొలిసారిగా కాన్పూర్‌లో భారత్ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని వివరించారు. స్వాతంత్ర్యం తర్వాత జమిందారీ, దోపిడీదారులకు వ్యతిరేకంగా సీపీఐ ఉద్యామాలు సాగించిందన్నారు. రైతాంగం, శ్రామికవర్గాలు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిందని, పేదల హక్కుల సాధనం కోసం ఎనలేని కృషి చేసి విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. ఘన చరిత్ర గల సీపీఐ, ప్రజాసంఘాలను మరింత బలోపేతం చేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మతోన్మాదుల పాలనలో దేశం నలిగిపోతోందని విమర్శించారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం...

ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం నుండి మైలవరం ప్రధాన రహదారుల మీదుగా భారీ బైక్ ర్యాలీ జరిగింది. పూలతో, ఎరుపు జెండాలతో అలంకరించిన మైలవరం స్మారక స్థూపం వరకు ర్యాలీ కొనసాగింది. సీపీఐ జిందాబాద్... రాజ్యాంగాన్ని రక్షించుంకుందా అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు జి రాము, బాబురావు, సురేశ్, ప్రసాద్, టి.మధుసూదనరావు, సుబ్బారావు, నరసింహారావు, బి.వెంకటేశ్వరావు, బి.పెదబాబునాయక్, కె.రత్నకుమారి, సందిపాము నాగేశు, అజ్మీర యేసు, పిన్నబోయిన చిన నరసింహం, రాబోయిన రాఘవులు, యస్.శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి గెస్ట్ హౌస్ నిర్వహణపై మంత్రి పొంగులేటి అసంతృప్తి

రికార్డులతో తన స్వగ్రామం నారాయణపురానికి రావాలని ఆదేశం

విశాలాంధ్ర - కొత్తగూడెం : పాల్వంచలోని సింగరేణి గెస్ట్ హౌస్ నిర్వహణపై రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాల్వంచ పర్యటనకు శనివారం వచ్చిన ఆయన కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు ఎమ్మెల్యేలతో కలిసి గెస్ట్ హౌస్‌కు వచ్చారు. ఈ సందర్భంలో అక్కడ సిబ్బంది చేసిన ఏర్పాట్లను చూసి అసహనం వ్యక్తం చేశారు. గదులు శుభ్రంగా లేకపోవడం, నిర్వహణలో లోపాలు ఉండటంతో అక్కడ ఉన్న సిబ్బందిని పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయాన్నే తన స్వగ్రామం కల్లూరు మండలంలోని నారాయణపురం రావాలని సింగరేణి గెస్ట్ హౌస్ నిర్వహణ అధికారులు, సిబ్బందిని ఆదేశించడంతో సర్వత్ర చర్చనియాంశం అయింది. అందరూ రికార్డ్స్ తీసుకుని హాజరు కావాలని ఆదేశించారు. కొత్తగూడెంలోని సింగరేణి గెస్ట్ హౌస్‌లోను గత కొంతకాలంగా అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయాన్ని కూడా కొందరు మంత్రి దృష్టికి తీసుకెళ్లారని తెలుస్తుంది.

పెరల్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర - హుజూర్ నగర్ : విద్యార్థులు చిన్నతనం నుండి భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలని పెరల్ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ డిసి ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎంపి మురుగన్‌లు అన్నారు. శనివారం హుజూర్ నగర్ పట్టణంలోని పెరల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ పాఠశాల్లో సంక్రాంతి వేడుకలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో వచ్చి పతంగులను ఎగరవేయడం, భోగి మంటలు, పొంగళ్ళు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, పండగల గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

విశాలాంధ్ర (మహబూబాబాద్) తొర్రూరు: నిజాన్ని నిర్భయంగా రాసే జర్నలిస్టులపై అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్, డాక్టర్ సోమేశ్వరరావు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, మాజీ ఎంపీపీ అంజయ్య, పెద్ద వంగర మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్యలు డిమాండ్ చేశారు. శనివారం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి తొర్రూర్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని వార్తలు వ్రాసిన విలేకరులపై కేసు పెట్టడం సమంజసం కాదన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఇప్పటికే ముగ్గురు గిరిజనులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై సోషల్ మీడియాలో అభ్యంతరకర రీతిలో పోస్టులు చేసినట్లు ఆరోపణలపై రాజ్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని, ఆయన్ని తక్షణమే విడుదల చేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎన్నమనేని శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్, తూర్పాటి రవి, గుగులోతు శంకర్, నాయకులు ప్రదీప్ రెడ్డి, మణిరాజ్, కాల్ నాయక్, మంగళపల్లి ఆశయ్య, వినయ్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమి పూజ

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : 24 కోట్ల రూపాయలతో సింగరేణి నిర్మించబోయే షాపింగ్ కాంప్లెక్స్‌కు శనివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌రాజ్ ఠాగూర్ ఆర్జీ వన్ జిఎం లలిత్ కుమార్‌తో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సింగరేణి సహకారంతో ఊహించని రీతిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి, నగర సుందరీకరణలో భాగంగా ఒక్కొక్కటిగా నిర్ణయాలు తీసుకుంటున్నామని వివరించారు. ఏడాదిలోపు కాంప్లెక్స్ పూర్తి చేస్తామని, అభివృద్ధి విషయంలో సింగరేణి సంస్థను అడిగిన వెంటనే సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీపీసీతో పాటు జెన్కో పవర్ ప్లాంట్‌ను నిర్మించి పారిశ్రామిక అభివృద్ధితోపాటు అర్హత కలిగిన యువతకు ఉద్యోగ భృతి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసిపి రమేశ్ కుమార్, కాంగ్రేసు నాయకులు మహంకాలి స్వామి, సింగరేణి సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

అక్రమ ఇసుక రవాణా అడ్డుకట్టలో ప్రాణభయంతో పరుగులు తీసిన ఆర్ఐ

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా ఖానాపూర్ : ఖానాపూర్ పరిసర ప్రాంతమైన రెంకొని వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక త్రవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో వెంటనే ఖానాపూర్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవి తన సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు. అక్రమ ఇసుక రవాణా మాఫియా అనుమతులు లేని ఇసుక తవ్వకాలు జరపడమే కాకుండా అడ్డుకట్ట వేసేందుకు వచ్చిన రెవెన్యూ శాఖ అధికారులను భయభ్రాంతులకు గురి చేయగా ప్రాణభయంతో వెనుదిరిగి పరుగులు తీశారు. ఈ విషయమై పోలీస్‌శాఖ వారికి సమాచారం అందించడంతో ఈ లోగా అక్రమ తవ్వకదారులు పారిపోయారు.

నాయకులు, అధికారులు పాత్రికేయులు

సమన్వయంతో పనిచేయాలి : మంత్రి తుమ్మల

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఈ విశ్వంలో మనిషి జీవితం చాలా చిన్నదని, రాగద్వేషాలు, నిరుస్థాహంతో కాలం గడపకుండా సమాజ హితం కోసం పనిచేస్తూ చిరస్థాయిలో గుర్తుండి పోయేలా బ్రతకాలని అప్పుడే ఈ జీవితానికి సార్థకత చేపడుతుందని రాష్ట్ర వ్యవసాయ, చేనేత జౌళి, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అడవుల్లో బతికె ఆదివాసీలు, కొండరెడ్ల గ్రామాలలోని గిరిజన జీవితాలను పరిశీలిస్తే చాలా బాధగా, మన బాధ్యత గుర్తు చేస్తుందన్నారు. మనం వారికోసం ఎంత పాటుపడాల్సి ఉందో అర్థమవుతుందన్నారు. అధికార యంత్రాంగం, రాజకీయ నాయకుల తోపాటుపాత్రికేయులు ఒకటైతే సమాజాన్ని చాలా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని మంత్రి స్పష్టం చేశారు. కొండరెడ్లు ప్రత్యేకంగా యువకులు బాధ్యతతో ముందుకు వస్తే జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఓ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో కొండరెడ్ల కుటుంబాలలో వెలుగు రేఖలు నిండేలా కృషి చేస్తారని చెప్పారు. ఈ గిరిజన కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి సహకారాలు కూడా అందించి వారి జీవనోపాధికి కృషి చేస్తారని మంత్రి హామీ ఇచ్చారు. శనివారం జిల్లాలోని దమ్మపేట మండలం మారుమూల పూసకుంట గ్రామంలోని కొండరేడ్ల గిరిజన కుటుంబాల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురామిరెడ్డితో కలిసి జిల్లా అధికారులు, గ్రామస్తులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని నమ్ముకొని జీవించే ఆదివాసి గిరిజనుల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు ముఖ్యంగా కొండ రెడ్ల కుటుంబాలను భాహ్య ప్రపంచంలో జీవించే విధంగా వ్యవసాయాభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్లు, పిల్లల చదువు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. గత మాసంలో కొండ రెడ్ల గిరిజనులు కోరిన ప్రకారము ఈ గ్రామానికి రహదారి సౌకర్యం కొరకు రాచన గూడెం పుసుకుంట మీదుగా ములకలపల్లి వెళ్లడానికి రూ. 4 కోట్ల 18 లక్షలతో మూడు కలవర్ట్‌ల నిర్మాణం ప్రారంభం చేయడం జరిగిందన్నారు. పుసుకుంటా - కట్టుకూరు గ్రామములలో రైతుల వ్యవసాయం కొసం రూ.20 లక్షల 11 వేలతో మూడు బోర్ వెల్స్, మూడు ఆయిల్ ప్లాంటేషన్ ప్రారంభించామన్నారు. పుసుకుంట గ్రామంలోని 376 మంది గిరిజనులకు గాను రూ.4 లక్షల విలువగల చీరలు, జాకెట్లు 220 మంది మహిళలు, పురుషులు 217 మందికి లుంగీలు, టవల్స్‌తో పాటు జిపిఎస్ పాఠశాలలో చదువుకునే చిన్నారులకు ఒక్కొక్కరికి రూ.868 విలువగల యూనిఫామ్, స్లిప్పర్స్, టీషర్ట్స్, బూట్లు రెండు జతల చొప్పున అందించడం జరిగిందని మంత్రి వివరించారు. 40 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని ఈ జిల్లాలోని మారుమూల గిరిజనుల అభివృద్ధి కోసం అధికారులు మనసుపెట్టి పని చేయాలని కోరారు. అనంతరం అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఈ గ్రామాలకు 40 ఏళ్లలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మంత్రి తుమ్మల చొరవతో పుసుకుంట గ్రామానికి రహదారి సౌకర్యం, కల్వర్టులు, కొండ రెడ్ల కుటుంబాలు జీవనోపాధికి అనేక సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేశారన్నారు. గిరిజన యువకులకు హైదరాబాదులో ఐఏఎస్ కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు తమ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

సీపీఐ నేత శ్రీనివాస్

విశాలాంధ్ర - గార్ల : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని నల్లమల గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సిపిఐ కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ సక్రమంగా జరగలేదన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షలు రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాంపురం, మద్దివంచ గ్రామాల రైతుల పొలాలు మూడవ రైల్వే లైన్ కింద కేటాయించినప్పటికీ ఇంత వరకు పరిహారం చెల్లించలేదన్నారు. రాంపురం పాకాల ఏటిపై హై లెవెల్ వంతెన నిర్మాణం కొసం సీపీఐ పార్టీ అలుపెరుగని పోరు సల్పిందని గుర్తు చేసారు. హామీలను అమలు చేయకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ది చెబుతామని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమలో జంపాల వెంకన్న, రాగం రమేష్, ధూపాటి జనార్ధన్, పిల్లి వీరయ్య, కట్టెబోయిన బిక్షమయ్య, దారావత్ వీరన్న, సర్వర్ మియా, బిక్షం, ఇల్లుటూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్ : కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచారని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం కొరివి మండలం సిపిఐ పార్టీ నిర్వహించిన గ్రామ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ ఇండ్లు, ఆసరా పెన్షన్లు మంజూరు చేయకపోవడం శోచనీయమని ఆయన అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన పేదలకు రేషన్ కార్డ్స్, ఆసరా పెన్షన్లు సంవత్సరాల తరబడి ఇవ్వకుండా తాత్పర్యం చేయడంతో అనేకమంది పేదలు ఇబ్బందులు పడ్డారని, నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు చెబుతుందే తప్ప ఆచరణలో లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గ్రామ సభల ద్వారా ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టాలని, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రైతాంగానికి రైతు భరోసా, రెండు లక్షల రుణమాఫీని పరిపూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, గ్రామ కార్యదర్శి తురక రమేష్, కన్నె వెంకన్న, బొల్లం ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయి మెరిట్ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - ముదిగొండలి : ముదిగొండ మండల పరిధిలో కమలాపురం సాయి మెరిట్ హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భోగిమంటలు, రంగుల రంగవల్లులు, గొబ్బెమ్మలతో పాఠశాల ముంగిట పండగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వివిధ రకాల వేషధారణలో అలరించారు. విద్యార్థినులు వేసిన రంగవల్లులు మరింత ఆకట్టుకున్నాయి. విద్యార్థులంతా పండగ వాతావరణంలో ఉల్లాసంగా, ఉత్సాహంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ కందుల శంకరయ్య మాట్లాడుతూ ప్రస్తుత తరానికి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేందుకే వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థినీ విద్యార్థులకు వారి కుటుంబాలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూరంపల్లి వెంకటేశ్వర్లు, తల్లితండ్రులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న ఆదర్శప్రాయుడు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - వనపర్తి : ఆంగ్లేయులతో అలుపెరుగని పోరాటం చేసిన స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న అందరికీ ఆదర్శప్రాయుడని ఆయన ధైర్య సహసాలు అందరికీ ఆదర్శం అవ్వాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఓబన్న 209వ జయంతి సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడ్డెర జాతి బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి పరిష్కార చర్యలు చేపడతారని ఎమ్మెల్యే సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు.

మహనీయుల చరిత్ర భావితరాలకు అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : మహనీయుల చరిత్రను భావితరాలకు అందించే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒడ్డే ఓబన్న జయంతి వేడుకలలో పాల్గొని వడ్డెర కుల సంఘ నాయకులు, ప్రముఖులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒడ్డే ఓబన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమలో రేనాడు ప్రాంతంలో 1816 సంవత్సరం జనవరి 11వ తేదీన జన్మించి, 18 వ శతాబ్దంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఆనాడు సంచార జాతులైన వడ్డెరలు, బోయలు, చెంచులు వంటి జాతులకు నాయకత్వం వహిస్తూ నల్లమల ప్రాంతంలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ దౌర్జన్యాలను ఎదుర్కొని తన జాతులను కాపాడుకున్న మహనీయుడు అని కొనియాడారు. ఓబన్న దేశంలోని బహుజనులందరికీ గర్వకారణమని, ప్రభుత్వం ఓబన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, వడ్డెర కుల సంక్షేమం కొరకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

ఫిబ్రవరి 9న మహాసభకు రావాలని మంత్రికి ఆహ్వానం

విశాలాంధ్ర - కారేపల్లి : ఫిబ్రవరి 9న ఖమ్మంలో జరిగే గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం మహాసభకు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆహ్వానపత్రం అందించినట్లు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఖమ్మం పట్టణంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలసి ఫిబ్రవరి 9వ తేదీన జరిగే మహాసభకు ముఖ్యఅతిథిగా రావాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటికి గ్రామీణ వైద్యులకు గుర్తింపునిచ్చి శిక్షణ పూర్తి చేయించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇప్పించాలని పిట్టల సూచించారు.స్పందించిన మంత్రి పొంగులేటి త్వరలోనే గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించి పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. తన వంతు సహకారం గ్రామీణ వైద్యులకు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారని పిట్టల తెలిపారు. ఫిబ్రవరి 9వ తేదీన ఖమ్మంలోని కృష్ణ ఫంక్షన్ హాల్‌లో జరిగే జిల్లా మహాసభ జరుగుతుందని ఆ మహాసభలో 2025 క్యాలెండర్ ఆవిష్కరణ కూడా చేయడం జరుగుతుంది అన్నారు. ఈ మహాసభకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాల గ్రామీణ వైద్యులు కూడా భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు నారపోగు సుదర్శన్ ఉన్నారు.

పాఠశాల సైన్స్ ల్యాబ్‌కి శంకుస్థాపన

విశాలాంధ్ర - ముదిగొండ : ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ శాసన సభ్యులు, తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు మంజూరైన నిధులతో శుక్రవారం ముదిగొండ మండల పరిధిలోని ముత్తారం గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ గదికి కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొదిలి తిరపయ్య జిల్లా కాంగ్రెస్ నాయకులు మల్లెల అజయ్, మాజీ ఎంపీటీసీ ఏటుకూరి వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పనితి పాపారావు,మాజీ ఎస్ఎంసి చైర్మన్ బత్తిన పుల్లయ్య, దేవాలయ కమిటీ సభ్యులు చెన్ను అమ్మయ్య, కాకి వీరభద్రం, షేక్ నూరు సాహెబ్, పొదిలి నారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తుళ్ళూరు బోస్, సేవాదళ్ అధ్యక్షుడు పర్షకొల నరేష్, ఏటుకూరి నాగయ్య, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రాల సతీష్,మాజీ ఎంపీటీసీ సరస్వతి, బోసు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే తొలిసారిగా 286 కిలోమీటర్ల రిమోట్ రోబోటిక్ కార్డియాక్ సర్జరీ

హైదరాబాద్: మన దేశంలో తొలిసారిగా స్వదేశీ సర్జికల్ రోబోటిక్ టెక్నాలజీ డెవలపర్ ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ కేవలం రెండు రోజుల్లో రెండు ప్రపంచ మొదటి రోబోటిక్ కార్డియాక్ టెలిసర్జరీలను విజయవంతంగా నిర్వహించింది. గురుగ్రామ్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయాన్ని రాజస్థాన్‌లోని జైపూర్‌లోని మణిపాల్ ఆసుపత్రితో 286 కిలోమీటర్ల దూరం అనుసంధానం చేసి, ఈ విజయాన్ని సాధించింది. రిమోట్ ద్వారా నిర్వహించిన టెలీరోబోటిక్ అసిస్టెడ్ ఇంటర్నల్ మమ్మరీ ఆర్టెరీ హార్వెస్టింగ్ ప్రక్రియ 58 నిమిషాల్లో విజయవంతంగా పూర్తయింది. గురుగ్రామ్‌లోని ఎస్ఎస్ఐ ప్రధాన కార్యాలయం నుండి ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్.ఇంక్ వ్యవస్థాపకుడు, చైర్మన్, సీఈఓ డాక్టర్ సుధీర్ శ్రీవాస్తవ నేతృత్వంలో, జైపూర్‌లోని మణిపాల్ ఆసుపత్రి కార్డియాక్ సర్జరీ చీఫ్ డాక్టర్ లలిత్ మాలిక్, జైపూర్‌లోని మారుమూల ప్రదేశంలో తన నిపుణుల బృందంతో ఈ శస్త్రచికిత్స చేశారు. కేవలం 35-40 మిల్లీసెకన్ల (సెకనులో 1/20వ వంతు) తక్కువ లేటెన్సీతో అసాధారణ ఖచ్చితత్వాన్ని ప్రదర్శించింది. ఆ తర్వాత దాని వెంటనే రోబోటిక్ బీటింగ్ హార్ట్ టోటల్ ఎండోస్కోపిక్ కరోనరీ ఆర్టరీ బైపాస్ (టీఈసీఏబీ) సర్జరీ చేయడం విశేషం.

13 నుండి అమెజాన్ 'గ్రేట్ రిపబ్లిక్ డే సేల్'తో బిగ్ సేవింగ్స్

బెంగళూరు: ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న షాపింగ్ ఫెస్టివల్, అమెజాన్ ఇండియా 'గ్రేట్ రిపబ్లిక్ డే సేల్', జనవరి 13, 2025న మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రత్యక్ష ప్రసారం కానుంది. ప్రత్యేకంగా ప్రైమ్ సభ్యుల కోసం 12 గంటల ముందస్తు యాక్సెస్ ఉంటుంది. స్మార్ట్‌ఫోన్‌లు, ఫ్యాషన్ అండ్ బ్యూటీ, హోమ్ అండ్ కిచెన్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, పెద్ద ఉపకరణాలు, కిరాణా సామాగ్రి, రోజువారీ అవసరాలు, మరిన్ని వంటి వర్గాలలో విక్రేతలు అందించే మిలియన్ల కొద్దీ ఉత్పత్తుల కోసం వినియోగదారులు తమ నూతన సంవత్సర షాపింగ్‌ను ప్రారంభించవచ్చు. వన్‌ప్లస్, యాపిల్, బోట్, శామ్‌సంగ్, సోనీ, ఎల్‌జీ, క్రాక్స్, టైటాన్, లోరియల్, లక్మే, పాంపర్స్, మరిన్ని వంటి ప్రముఖ బ్రాండ్‌ల నుండి విభిన్న శ్రేణి ఉత్పత్తులను దుకాణదారులు అన్వేషించవచ్చు. ఎస్‌బీఐ, క్రెడిట్ కార్డ్, ఈఎంఐ లావాదేవీలపై 10% తక్షణ డిస్కౌంట్‌తో మరిన్ని ఆదా చేసుకోవచ్చు. అమెజాన్‌పే లేటర్‌తో, రూ.60,000 వరకు తక్షణ క్రెడిట్, రూ.600 వరకు విలువైన స్వాగత రివార్డ్‌లు పొందవచ్చు.

మిరె అసెట్ స్మాల్ క్యాప్ ఫండ్‌ను విడుదల

ముంబై: మిరె అసెట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ 'మిరె అసెట్ స్మాల్ క్యాప్ ఫండ్'ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇది ప్రధానంగా స్మాల్ క్యాప్ స్టాక్‌లలో పెట్టుబడి పెట్టే ఓపెన్-ఎండెడ్ ఈక్విటీ పథకం. పరిశోధన ఆధారిత, క్రమశిక్షణ కలిగిన పెట్టుబడి విధానం ద్వారా ప్రాథమికంగా బలమైన స్మాల్ క్యాప్ కంపెనీల సంభావ్య వృద్ధిలో పాల్గొనే అవకాశాన్ని పెట్టుబడిదారులకు అందించడం ఈ నిధి లక్ష్యం. ఈ నిధి నిఫ్టీ స్మాల్ క్యాప్ 250 టోటల్ రిటర్న్ ఇండెక్స్‌తో బెంచ్‌మార్క్ చేయబడుతుంది. దీనిని సీనియర్ ఫండ్ మేనేజర్-ఈక్విటీ, వరుణ్ గోయెల్ నిర్వహిస్తారు. మిరె అసెట్ స్మాల్ క్యాప్ ఫండ్ అనేది ఆర్థిక వ్యవస్థలో అధిక వృద్ధి చెందుతున్న విభాగాలలో పాల్గొనడం ద్వారా సంపద సృష్టిని కోరుకునే అధిక-రిస్క్ స్వీకరణ స్వభావం ఉన్న పెట్టుబడిదారుల కోసం రూపొందించబడింది.

సామ్‌సంగ్ విండ్‌ఫ్రీ ఎయిర్ కండిషనర్లలో 'గుడ్‌స్లీప్' మోడ్

గురుగ్రామ్: నిద్ర దశల ప్రకారం ఉష్ణోగ్రతను సర్దుబాటు చేయడం ద్వారా రాత్రంతా ఆహ్లాదకరమైన నిద్రను ప్రోత్సహించడానికి సామ్‌సంగ్ 'గుడ్ స్లీప్' మోడ్‌ను ప్రవేశపెట్టింది. వినియోగదారులు తమ ఎయిర్ కండిషనర్‌లను వారి గెలాక్సీ వాచ్ సిరీస్‌తో కనెక్ట్ చేయడానికి, వారు నిద్రలోకి జారుకున్నప్పుడు 'గుడ్ స్లీప్' స్వయంచాలకంగా పనిచేయటానికి వీలు కల్పిస్తుంది. 'గుడ్ స్లీప్' మోడ్ ఒక వ్యక్తి నిద్ర పోతున్నప్పుడు ఇండోర్ ఉష్ణోగ్రతను హెచ్చుతగ్గులకు గురి చేస్తుంది. నిద్రలో 5 దశలు ఉంటాయి. మేల్కొలుపు, ఆర్ఈఎం (రాపిడ్ ఐ మూవ్‌మెంట్), ఎన్ఆర్ఈఎం (నాన్ రాపిడ్ ఐ మూవ్‌మెంట్ స్లీప్) 3 దశలు. నిద్రలోని ప్రతి దశలో మెదడు తరంగ నమూనాలు, కంటి కదలికలు, శరీర ఉష్ణోగ్రతలో వైవిధ్యాలు ఉంటాయి. ఈ ఐదు దశలు ఒక పూర్తి నిద్ర చక్రాన్ని ఏర్పరుస్తాయి. ఇది సాధారణంగా 90 నిమిషాలు ఉంటుంది. రాత్రంతా, ఈ చక్రం దాదాపు నాలుగు నుండి ఆరు సార్లు పునరావృతమవుతుంది.

'పీజీ డిప్లొమా ఇన్ ఫైనాన్షియల్ ఎకనామిక్స్ అండ్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్ ప్రారంభం

హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ముంబయి, టాలెంట్‌స్ప్రింట్ భాగస్వామ్యంతో 'పీజీ డిప్లొమా ఇన్ ఫైనాన్షియల్ ఎకనామిక్స్ అండ్ మేనేజ్‌మెంట్'లో ఆధునిక పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టింది. ఐఐఎం ముంబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) 2024లో 6వ ర్యాంకు సాధించింది. టాలెంట్‌స్ప్రింట్ ఆన్‌లైన్ ప్రోగ్రామ్ నైపుణ్యాన్ని వినియోగించుకుంటూ ప్రొఫెషనల్స్‌కు ఆధునిక నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయి. ఒక ఏడాది వ్యవధితో కూడిన ఈ పీజీ డిప్లొమా కోసం అభ్యర్థులు ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఎకనామిక్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లో కనీసం 50 శాతం మార్కులు లేదా సమానమైన సీజీపీఏ (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థుల కోసం 45 శాతం)తో బ్యాచిలర్ డిగ్రీ కలిగి ఉండాలి. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం లేదా విద్యా సంస్థ నుంచి ఈ డిగ్రీ ఉండాలి. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశం రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది. అభ్యర్థులు 2025 జనవరి 12న జరిగే ఐఐఎం ముంబాయి ఐఎంఏటీ పరీక్ష రాయాలి.

వాసవి ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్

విశాలాంధ్ర - ఖమ్మం : వాసవి క్లబ్ ఇంటర్నేషనల్‌కు అంతర్జాతీయ ఆడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా వాసవి యన్ కడవెండి శ్రీనివాస్ నియమించిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. డిస్ట్రిక్ట్ వి 106 ఏ జాయింట్ సెక్రటరి వాసవియన్ తెలుకుంట్ల ధనుంజయ్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ అధ్యక్షులు వాసవియన్ సుగ్గుల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి కోదుమూరు భద్రయ్య, కోశాధికారి వల్లాల యుగంధర్, కడవెండి శ్రీనివాస్‌ని ఘనంగా సన్మానించారు.

ఆశా వర్కర్లకు చీరల పంపిణీ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు ప్రముఖ వ్యాపారవేత్త రావులపల్లి ప్రసాద్ అరుణ దంపతులు అందజేసిన చీరలను శనివారం మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ వైస్ చైర్మన్ అలకసరితలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఆశా వర్కర్ల సేవలను గుర్తించి చీరలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డ్ కౌన్సిలర్ వేమూరి నాగవేణి మాజీ సర్పంచ్ కొనతం సత్యనారాయణ రెడ్డి న్యాయవాది సుంకరి ప్రదీప్తి సుబ్బారావు పూర్ణ తిరుపతమ్మ ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

కార్మికుల రక్తం పీల్చే పథకం

ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నారాయణ మూర్తి కొద్ది నెలల కింద వారానికి 70 గంటలు పని చేయాలని సూచించారు. 70 గంటలు పని చేయడంవల్ల జాతీయాభివృద్ధి సాధ్యం అవుతుందని ఆ "దేశభక్తుడు" సెలవిచ్చారు. ఎల్ అండ్ టి ప్రధాన కార్యనిర్వహణాధికారి ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యం మరో అడుగు ముందుకేసి వారానికి 90 గంటలు పని చేయాలన్నారు. ఆయన దేశాభివృద్ధి లాంటి ఐహిక విషయాల గురించి ప్రస్తావించలేదు కానీ ఆదివారాలు కూడా పని చేయాలని, ఇంటిదగ్గర కూర్చుని భార్య ముఖం ఎంత సేపు చూస్తారు, దాని బదులు వచ్చి పనిచేయవచ్చు కదా అన్నారు. ఆయన తన వేతనం గురించి కానీ లాభాలలో పెరుగుదల గురించి కానీ, పై అధికారులకూ కింది స్థాయి సిబ్బందికి మధ్య ఉన్న వేతనాల అంతరాన్ని గురించి కానీ ప్రస్తావించలేదు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు అవతరించిన తరవాత పని పరిస్థితుల గురించి మాట్లాడే కార్మిక సంఘాలు దాదాపుగా మాయమై పోయాయి. ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీలలో కార్మిక సంఘాల ఊసే ఉండదు. సాఫ్ట్‌వేర్ కంపెనీలలో పనిచేసేవారికి మిగతా వారికన్నా నాలుగు డబ్బులు ఎక్కువ వస్తూ ఉండవచ్చు. వారికి ఇప్పటికే పని గంటల మీద పరిమితి చెరిగి పోయింది. ఒక ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి గడువు విధిస్తారు తప్ప ఆ పని చేయడానికి ఎన్ని గంటలు అవసరం, రోజుకు ఎన్ని గంటలు పనిచేస్తే అది పూర్తి అవుతుందన్న ధ్యాస యాజమాన్యాలకు ఉండదు. తమ శ్రమవల్ల ఎంత అదనపు విలువ పోగు పడ్తోందో, తమ కుటుంబం కోసం సమయం ఇవ్వకుండా ఆ కంపెనీలలో కుర్చీలో చేరగిలపడి పనిచేసి నడుం నొప్పి తెచ్చుకునే వారికి ఎంత డబ్బు సంపాదిస్తున్నాం అన్న దాని మీద తప్ప మరి దేని గురించిన ఆలోచనా ఉండదు. తాము లక్షల్లో వేతనాలు సంపాదిస్తున్నాం కనక ఈ సమాజం తమను గౌరవించాలని కూడా భావిస్తూ ఉంటారు. ప్రపంచంలోకెల్లా మనం ఆర్థికంగా అగ్రస్థానంలోకి వెళ్తే మోదీ ఆశ నెరవేరుతుంది. ఆయనకు మద్దతిచ్చే పారిశ్రామికవేత్తల, సాఫ్ట్‌వేర్ కంపెనీల లాభాలూ ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతాయి. మరి వారానికి 70 గంటలు, 90 గంటలు పనిచేస్తే సిబ్బందికి ఏం ఇస్తారో మాత్రం వీరు చెప్పరు. సిబ్బంది చేత ఆదివారం కూడా పని చేయించలేకపోవడం తనకు ఆశ్చర్యం కలిగిస్తోందని సుబ్రహ్మణ్యం సెలవిచ్చారు. ఇన్ఫోసిస్ లాంటి కంపెనీలలో ఎక్కువ సమయం పని చేసినందుకు ఎక్కువ డబ్బులు కూడా ఇవ్వరు. కూలి చేసుకోవడం, కార్పొరేట్ సంస్థల్లో పనిచేయడం మధ్య అంతరం గురించి మాట్లాడడం మచ్చుకైనా లేదు. ఎక్కువ పని గంటలు, ఇచ్చిన ప్రాజెక్టులను సమయానికి పూర్తి చేయడం లాంటివాటి మీదే దృష్టి పెట్టే కార్పొరేట్ సంస్థలు ఈ అంశాలను ప్రస్తావించనే ప్రస్తావించవు. ప్రైవేటు రంగ సంస్థల లాభాలు గత 15 ఏళ్లల్లో ఎన్నడూ లేనంతగా పెరిగాయి తప్ప సిబ్బంది వేతనాలలో మాత్రం ఎదుగూ బొదుగూ లేదు. ఇది చాలదన్నట్టు 2016లో ప్రభుత్వం కార్పొరేట్ పన్ను తగ్గించింది. కూడినవాడికే కూడుతుంది కుంటి లక్ష్మి అంటే ఇదే మరి. ఇంకోవేపు సామాన్యులు ఆదాయపన్ను చెల్లించే పరిధిలోకి రాకపోయినా కొనే, తినే ప్రతి వస్తువుపైనా అధిక మొత్తంలో జి.ఎస్.టి.చెల్లిస్తూనే ఉన్నారు. సామాన్యులందరి దగ్గరా వసూలు చేసే మొత్తం కన్నా కార్పొరేట్ రంగం నుంచి వచ్చే పన్ను చాలా తక్కువ. గత 15 ఏళ్ల కాలంలో కార్పొరేట్ సంస్థల లాభాలు నాలుగింతలు పెరిగాయని, వాటిలో పని చేసే సిబ్బంది వేతనాలు మాత్రం ఒక అంకె స్థాయిలోనే పెరిగాయని పారిశ్రామికవేత్తల సంఘం ఫిక్కీ ఒక సర్వేలో తేల్చింది. జనం చేతిలో డబ్బులు ఆడనందువల్ల కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. ఇది అంతిమంగా మాంద్యానికి దారి తీస్తుంది. ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా కొనే వారు ఉండరు. గత పదేళ్ల కాలంలో కార్పొరేట్ సంస్థలకు కల్పించిన పన్ను రాయితీలు సామాన్యులకు దక్కనే లేదు. పెరుగుతున్న ధరలను, ద్రవ్యోల్బణాన్ని పరిగణిస్తే ప్రస్తుతం నెలకు లక్ష రూపాయల వేతనం అందుకుంటున్నవారు 2008 నాటి పరిస్థితితో పోల్చి చూస్తే నిజానికి రూ. 38 వేలు మాత్రమే సంపాదించగలుగుతున్నారు. పన్నుల భారం మోపడం, వేతనాలు స్వల్పంగానే పెంచడం, దానికి తోడు ఇప్పుడు పని గంటలు పెంచాలనడం మధ్యతరగతి జీవులను పీల్చి పిప్పి చేయడమే. శుక్రవారం గుర్గావ్‌లో మారుతి కంపెనీలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు వేల సంఖ్యలో నిరసన వ్యక్తం చేసిన ఉదంతానికి సంబంధించిన వార్త మోది మీడియాలో ఎక్కడైనా కనిపించిందా? లేదు ఇలాంటివి ఈ రోజుల్లో వార్తలు కావు.

కంపెనీ ప్రధాన కార్యనిర్వహణాధికారుల వేతనాలు కోట్లల్లో ఉంటూ ఉంటే సిబ్బంది వేతనాలలో పెరుగుదల నత్తకు నడకలు నేర్పుతోంది. ఎల్.అండ్. టి. ప్రధాన కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం వార్షిక వేతనం 51 కోట్ల రూపాయలు. అదే కంపెనీలో మామూలు ఉద్యోగి జీవిత కాలంలో ఇంత డబ్బు సంపాదించే పరిస్థితి ఉండదు. సుబ్రహ్మణ్యం తీసుకునే వేతనం సగటు ఉద్యోగి తీసుకునే వేతనం కన్నా 535 రెట్లు ఎక్కువ. అంటే సుబ్రహ్మణ్యం ప్రతి రోజూ 14 లక్షల వేతనం తీసుకుంటారు. ఆయన ఇప్పటికే 2-3వందల కోట్లు సంపాదించే ఉంటారు. దానితో శేష జీవితం హాయిగా గడుపుతూ ఇక మీదట వేతనం లేకుండా ఆయన పని చేయరుగా! ఆయన లెక్క ప్రకారం సిబ్బంది వారానికి 90 గంటలు పని చేయాలి. ఆదివారం కూడా పని చేసి తమ భార్యా బిడ్డల ముఖాలు చూస్తూ కూర్చోకూడదు. వాదన వింతగా లేదూ! ఉంది కానీ వాస్తవం ఇదే. భారత్‌లో చాలామంది సిబ్బందికి తాము చేస్తున్న ఉద్యోగం నచ్చడం లేదని బాంబే షేవింగ్ కంపెనీ ప్రధాన కార్యనిర్వహణాధికారి శంతను దేశ్ పాండే అంటున్నారు. ఈ దేశంలో సిబ్బందికి ఆర్థిక భద్రత, వెసులుబాటు ఉంటే వారిలో 99 శాతం మంది మరుసటి రోజు నుంచి పనే చేయరు అని కూడా దేశ్ పాండే అంటున్నారు. దేశంలోని 2000 కుటుంబాల గుప్పెట్లో దేశ సంపదలో 18 శాతం ఉంది. ఈ పరిస్థితి ఎందుకో ఎవరు జవాబు చెప్తారు! సంపద కొద్ది మంది చేతుల్లో పోగుపడకూడదన్న రాజ్యాంగ నిర్దేశం ఎలా విస్మరణకు గురైందో సమాధానం చెప్పేవారే కనిపించరు. మధ్య తరగతి వారికి వారి కష్టాలు వారికి ఉండొచ్చు. కానీ వారు సగటు కార్మికుల సంగతి ఇసుమంత కూడా పట్టించుకోరు. మధ్యతరగతివారు తమ బాధలు పైకి చెప్పుకోలేక మతం ఇత్యాది వ్యవహారాలలో మునిగి తేలుతున్నారు. రోడ్డు మీద బండ్ల మీద కూరగాయలో, పండ్లో అమ్ముకునే వారు ఎప్పుడైనా సెలవు తీసుకున్నారో లేదో కనుక్కోవాలన్న ఆలోచన సహజంగానే నారాయణ మూర్తికి, సుబ్రహ్మణ్యానికి రానే రాదు.

కార్మిక సంఘాలను నిరుత్సాహపరిచిన ఆర్థిక మంత్రి

డా.జ్ఞాన్‌పాఠక్

ఉద్యోగ కల్పన, ఉపాధిహామీ ఈ పథకాలకు నిధులు పెంచాలని పది కేంద్ర ట్రేడ్ యూనియన్లు ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌ను డిమాండ్ చేశాయి. 2025-26 కేంద్ర బడ్జెట్‌ను రూపొందించడానికి ముందుగా కేంద్ర ట్రేడ్‌యూనియన్లతో మంత్రి సంప్రదింపులు జరిపారు. కేంద్ర ట్రేడ్‌యూనియన్లతోపాటు ఇతర సంఘాలుకూడా ఈ డిమాండ్ చేశాయి. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కూడా జాతీయ ఉద్యోగవిధానంలో ఉద్యోగాల సృష్టికి ప్రాధాన్యత నివ్వాలని వివిధ మంత్రిత్వశాఖల పరిధిలో అత్యధిక ఉద్యోగాల సృష్టిపై శ్రద్ధ వహించాలని అలాగే రాష్ట్ర ప్రభుత్వాలను కోరాలని యూనియన్లు మంత్రిని కోరాయి. 2024-25 బడ్జెట్‌లో ఉద్యోగ అనుబంధ చొరవ (ఈఎల్ఐ) పథకాన్ని సైతం కేంద్రం ప్రకటించలేదు. ఈ ఆర్థిక సంవత్సరం అంతా ఉద్యోగులకు ప్రయోజనం లేకుండా గడిచిపోయింది. ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యుఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూపీయూసీ కార్మిక సమస్యలపై మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చించాయి. అయితే ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే భారతీయ మజ్దూర్‌సంఘ్(బీఎంఎస్) కూడా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కనీస

వేతనాలను ఇవ్వాలని, కార్మికుల పనిదినాలను 200కు పెంచాలని సూచించింది. మరోవైపు ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌లో పనిదినాలను, వేతనాలకు కేటాయింపును తగ్గించివేసింది. బీజేపీ నాయకత్వంలో నరేంద్రమోదీ ప్రధానిగా అధికారానికి వచ్చిన తర్వాత నుంచి గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను తగ్గిస్తూనే ఉన్నారు.

వేతనాలను పొందే ఉద్యోగులకు ఆదాయంపన్ను రిబేటును పెంచాలని కూడా ట్రేడ్ యూనియన్లు కోరాయి. అలాగే వివాదాస్పదమైన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కూడా యూనియన్లు డిమాండ్ చేశాయి. ఈ నాలుగు లేబర్‌కోడ్‌లను 2025-26 ఆర్థిక సంవత్సరంలో అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కొత్త పెన్షన్ పథకాన్నికూడా రద్దుచేయాలని యూనియన్లు డిమాండ్ చేశాయి. మంత్రి సీతారామన్ యూనియన్లు కోరిన వాటన్నింటినీ తిరస్కరించారు. యూనియన్లు సూచించిన విధానాలకు భిన్నంగా ప్రభుత్వం రూపొందించిన విధానాలనే అమలుచేయడానికి సిద్ధంగాఉంది. అన్ని త్రైపాక్షిక, ద్వైపాక్షిక, సమావేశాలలో ప్రజాస్వామ్య యంత్రాంగాలు, సంస్థలు చేసిన సూచనలను మంత్రి దాటవేశారు. అన్ని యూనియన్లు, బీఎంఎస్ వారసత్వ పన్ను విధించడం ద్వారా వనరులను పెంచుకోవాలని సూచన చేశాయి. ఈ విధానం ద్వారా సాధారణ ప్రజలపై భారం తగ్గుతుందని సూచించాయి. ఈ సూచన అమలుచేస్తే వస్తు సేవల(జీఎస్‌టీ) పన్ను తగ్గించవచ్చునని యూనియన్లు సూచించాయి. మంత్రి సీతారామన్ సమాధానాలు యూనియన్లను తీవ్ర అసంతృప్తికి గురిచేశాయి. కేంద్ర ట్రేడ్‌యూనియన్లు, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్(ఐఎల్‌సీ)లను కూడా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించాయి. గత దశాబ్దికాలంగా ఎన్‌డీఏ ప్రభుత్వంతో ఉన్నతస్థాయి త్రైపాక్షిక వేదికమీద ఈ డిమాండ్లన్నంటినీ ఉంచినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు. అసంఘటిత రంగ కార్మికులతో సహా సార్వత్రిక, సామాజిక భద్రతా పథకాలను అమలు జరిపేందుకు సామాజిక భద్రతా నిధులను సమీకరించాలని కేంద్ర ట్రేడ్‌యూనియన్లు పిలుపునిచ్చాయి. డీఏ, ఇతర వైద్య, విద్యారంగాలకు ప్రయోజనాలను కల్పించడంతోపాటు కనీస పెన్షన్‌ను నెలకు రూ.9000పెంచాలని యూనియన్లు కోరాయి. ప్రభుత్వానికి మద్దతునిచ్చే బీఎంఎస్ కూడా కనీస పెన్షన్‌ను రూ.5000 ఇవ్వాలని కోరింది. ప్రస్తుతం ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం(ఈపీఎఫ్) కింద కనీస పెన్షన్ రూ.1000 మాత్రమే ఇస్తున్నారు. మరో వైపు ఉద్యోగాల సృష్టికి, కార్మికుల సంస్కరణలకు, మహిళా ఉద్యోగుల పెంపుదలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సీఐఐ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసింది. అత్యధిక ఉత్పాదకతకు ఉద్యోగాల సృష్టి ఎంతగానో సంబంధం ఉందని సీఐఐ వక్కాణించింది. ఉత్పత్తి అంశంపై విశ్లేషించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటుచేయాలని సీఐఐ కోరింది. జాతీయ కెరియర్ సర్వీసెస్(ఎన్‌సీఎస్) కోసం ఒకే సమగ్రమైన ఎంప్లాయ్‌మెంట్ పోర్టల్‌ను ఏర్పాటుచేయాలని సీఐఐ కోరింది. కార్మికులకు సామాజిక భద్రత, గౌరవనీయమైన ఉద్యోగాల సృష్టి, కార్మిక కోడ్‌ల అమలు విషయాలలో సమతుల్యతను పాటించాలని సీఐఐ సిఫారసు చేసింది.

వికృత మేళాగా మిగిలిన కుంభమేళా!

డాక్టర్ దేవరాజు మహారాజు

ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి మన భారతదేశంలో పూర్ణ కుంభమేళా జరుగుతుంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ (అలహాబాద్), ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో గంగా- మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో గంగా, యమునల సంగమం, నాసిక్‌లో కుంభమేళా జరుగుతుంది. అయితే, అది తన మూల ఉద్దేశాన్ని మరిచిపోయి, మూఢ నమ్మకాలకు కేంద్ర బిందువుగా మారిపోయింది. ఈ నాలుగు ప్రదేశాల్లో లక్షల జనం అక్కడి నదుల్లో స్నానాలు చేస్తుంటారు. తమ పాపాలు శుభ్రపడతాయనీ, తమకు స్వర్గ ద్వారాలు తెరుచు కుంటాయనీ, భవిష్యత్తులో తమకు, తమ కుటుంబానికి అంతా మంచే జరుగుతుం దనీ ఆశపడుతుంటారు. ఆశ పడడంలో తప్పులేదుగాని- మంచి జరుగుతుం దన్న దానికి ఆధారాలు లేవు. కుంభమేళా శతాబ్దాలుగా కొనసాగుతున్నా ఆధారాలు మాత్రం ఇప్పటికీ కనిపించడం లేదు. కాలమెంత గడిచినా, అంధ విశ్వాసాలకు ఆధారాలు దొరకవు కదా. నదీ జలాల్ని కలుషితంచేసి, లక్షల మంది నీటిలో మునుగుతున్నందు వల్ల తప్పక అంటువ్యాధులు వ్యాపిస్తాయి తప్ప, ఒనగూరే మంచి - అంటూ ఏదీ ఉండదు. అసలు ఈ కుంభమేళాకు మూలాలు ఎక్కడ ? అది ఎలా ప్రారంభమైంది? కాలక్రమంలో మార్పులు చేర్పులతో, వక్రీకరణలతో అంధ విశ్వాసాలకు ఎలా ఆలవాలమైందీ? తెలుసుకో వాలంటే సాధారణ శకం ఏడవ శతాబ్దంలోకి వెళ్లాలి. ఆ కాలంలో ఉత్తర భారతదేశాన్ని ఏక రాజ్యాధికారంలోకి తెచ్చిన చక్రవర్తి హర్షుడి గూర్చి తెలుసుకోవాలి. ఆయన "దాన వీరుడి"గా ఎలా గుర్తింపు తెచ్చుకున్నాడో...తెలుసుకోవాలి!

చక్రవర్తి హర్షుడి పేరు మనకు కొత్తేమీ కాదు. చరిత్ర పాఠాల్లో చదువుకున్నదే! సాధారణ శకం 590-647 మధ్య జీవించాడు. 606 నుంచి 647 వరకు పరిపాలించాడు. ఒకవైపు యుద్ధాలు చేస్తూ సామ్రాజ్యాన్ని విస్తరించడంలోను, ప్రజలను శాంతియుతంగా పరిపాలించడంలోనూ ఆయన తనకు తానే సాటి అని అనిపించుకున్నవాడు. కుంభమేళా ఈ బౌద్ధ చక్రవర్తి హర్షుడు రూపొందించుకున్న సంప్రదాయం. దాన్ని ధ్వంసంచేసి- వైదికులు మరో రకంగా ప్రచారం చేశారు. హర్షుడికి 'శిలాదిత్య' అనే బిరుదు ఉండేది. ఏడవ శతాబ్దంలో భారతదేశంలో పర్యటించిన చీనీ యాత్రికుడు హ్యూన్‌త్సాంగ్ రచనల్లో ఈ విషయాలు స్పష్టంగా ఉన్నాయి. ఆయన రచనకు తర్వాత కాలంలో హిందీ అనువాదం కూడా అందుబాటులో కొచ్చింది. అందువల్ల ఏ మాత్రం అనుమానం లేకుండా, మనం ఈ విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. బౌద్ధ వారసత్వాన్ని నాశనంచేసి కుట్ర పూరితంగా కుంభమేళా ఆశయాన్ని భ్రష్టు పట్టించారు. అందుకు బలం చేకూర్చడానికి కల్పిత కథలు, అభూత కల్పనలూ జోడించారు. హర్షుడికి యుద్ధ వీరుడిగా ఎంత పేరుందో దానవీరుడిగా అంతకన్నా ఎక్కువ పేరుంది. దయార్ద్ర హృదయుడు కాబట్టే, ప్రజలు ఆయనను కోరుకుని రాజును చేశారు. తమ ప్రియ బాంధవుడిగా భావించారు. ఆ రోజుల్లో ఆయన చేపట్టిన దానధర్మాలకు- ఇప్పుడు మనం చూస్తున్న కుంభమేళాకు కొంత సంబంధముంది. ఇప్పుడు మనం చూస్తున్నది వైదిక ధర్మ ప్రబోధకులు వికృతంగా తయారుచేసిన మేళా! హర్షుడు ప్రారంభించినపుడు దాని ఉద్దేశం వేరు.

హర్షుడి రాజధాని కనౌజ్ (ఉత్తరప్రదేశ్). ఆయన త్రివేణి సంగమానికి వెళ్లి, అక్కడి నుంచి అందరికీ దానాలు చేసేవాడు. ఆయన ఇచ్చే దానాలు స్వీకరించాలని జనం దూర దూర ప్రాంతాల నుంచి తరలివచ్చేవారు. ఆ ప్రదేశాన్ని 'మహాదాన భూమి' అని అనేవారు. మొదటిరోజు ఆయన బుద్ధుడి విగ్రహాన్ని కడిగి, వైభవోపేతంగా పూలతో అలంకరిచేవాడు. తరువాత స్థానికంగా ఉన్న భిక్షులను, మేధావులను, పండితులను గౌరవించి వారికి కానుకలు ఇచ్చి సాగనంపేవాడు. నలంద, తక్షశిల విశ్వవిద్యాలయ అధ్యాపకుల్ని సత్కరించి కానుకలిచ్చేవాడు. ఆ తర్వాత ఇతర మతాలు పాటించేవారిని కూడా పిలిచి, మర్యాదపూర్వకంగా కానుకలు సమర్పించేవాడు. తరువాత వరుసలో విధవరాండ్రు, దుఃఖితులు, దరిద్రులు, రోగులు, అంగవైకల్యం ఉన్నవారు, ప్రార్థనా స్థలాల్లో పనిచేసే మహంతులు, పాండాలు, పూజారుల వంటి వారందరికీ వరుసగా దానాలు చేసేవాడు. తన చేతివేళ్లకు ఉన్న ఉంగరాలు, మెడలోని రత్నాల హారాలు మొదలైనవాటిని కూడా దానం చేసేవాడు. అలా చేస్తున్నందుకు అమితానందం పొందేవాడు. మహాదాన భూమిలో ఈ కార్యక్రమమంతా పూర్తి చేసుకుని, చక్రవర్తి శిలాదిత్య ఇలా అనేవాడు- "నా దగ్గరున్నదంతా ప్రజా కోశాగారానికి చేరింది. ఒక మహోపకార్యానికి ఉపయోగ పడింది. అక్కడ- అది దుర్వినియోగం కావడానికి ఆస్కారంలేదు. ప్రజాధనం ప్రజలకు చేరిందంటే అంతకన్నా సార్థకత ఏముంది?" అని ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునేవాడు. హర్ష చక్రవర్తి దానగుణం ఏ స్థాయిలో ఉండేదో తెలుసుకోవడానికి ప్రచారంలో ఉన్న ఒక కథను పరిశీలిద్దాం- ఒకసారి ఆయన త్రివేణి సంగమం చేరుకుని మహాదాన భూమి నుంచి దానాలు చేశాడు. ఒంటి మీది ఆభరణాలు, చేతి ఉంగరాలు పైన ఉన్న వస్త్రాలు అన్నీ దానం చేశాడు. మొలకు ధోవతి తప్ప ఏమీ మిగలలేదు. అప్పుడు ఒకడు వచ్చి 'రాజా' అని చేయి చాపాడు. అప్పుడు ఇక ఏం చేయాలో తోచక, హర్షుడు పక్కన ఉన్న మహిళను అభ్యర్థించి ఓ కండువా తీసుకున్నాడు. ఆ కండువా తను చుట్టుకుని, తన విలువైన ధోవతిని- ఆ చేయిచాపి నిలుచున్న వాడికి అందించాడు. ఒంటి మీద ఉన్న గుడ్డలతో సహా ఆయన ప్రజలకు దానంచేసే వాడని ఆ కథ చెపుతోంది. దాని ఆధారంగా వైదిక ప్రబోధకులు నగ్న సన్యాసుల్ని, నాగబాబాల్ని, అఘోరాల్ని కుంభమేళాలో చేర్చారు. ఉన్నదంతా ప్రజలకు, సమాజానికి దానమివ్వాలని శిలాదిత్య హర్ష చక్రవర్తి చెపితే, దాన్ని కుంభమేళాగా మార్చి- నీటిలో మునిగితే చాలు సర్వ పాపహరణ జరుగుతుందని మనువాదులు ఊదరగొట్టారు. ఎక్కడా ఏమీలేని దిగంబర సన్యాసులు ఈ సమాజానికి ఏమివ్వగలరూ? ఏ రకంగా ఆదర్శప్రాయులు కాగలరూ? ఆలోచించే పనిలేదా? హర్షుడు ప్రారంభించిన ఆ సంప్రదాయం ఆయన తర్వాత కూడా కొంతకాలం కొనసాగింది. జమీందారులు, ధనవంతులూ కొందరు ఆ మహాదాన భూమికి వచ్చి, నదీ స్నానాలు చేసి తమ దగ్గరున్న ధనం, బంగారం, దానం చేసి వెళ్లేవారు. కాలక్రమంలో దానాలు ఆగిపోయి ఒట్టి స్నానాలు మిగిలాయి. చక్రవర్తి శిలాదిత్య తన కోశాగారంలో ఉన్నదంతా సమాజానికి వివిధ వర్గాల వారికి దానం చేశాడేగానీ, గుడ్డలిప్పి నగ్నంగా ఊరేగలేదు. ఊరేగాలనీ చెప్పలేదు. నదీ స్నానాల వల్ల పుణ్యం వస్తుందనిగానీ, పాపాలు పోతాయనిగానీ, కోర్కెలు తీరతాయనిగానీ హర్షుడు తన ప్రజలకు చెప్పలేదు. అదే సమయంలో ఇతర మతస్థుల్ని కూడా సమానంగా ఆదరించాడు. కుల, మత, లింగ, ప్రాంత భేదాలు ఉండకూడదని, అందరూ కలిసిమెలిసి ఉండాలని ఆయన భావించాడు. నదీ స్నానం పేరుతో అందరినీ ఒక్కచోట చేర్చి, ఒక్కటిగా చూడాలని అనుకున్నాడు. తన నుంచి దానం స్వీకరించడానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించేవాడు. రాజు- అంటే తండ్రి లాంటి వాడని ఆయనకు తెలుసు. అందుకే ప్రజలెవరూ ఆకలికి అలమటించకుండా ఆ మహా మానవ సమూహానికి అన్నం పెట్టే బాధ్యత హర్షుడే తీసుకునేవాడు. ఉన్నవన్నీ ఇతరులకోసం త్యజించి, సమాజానికి మహోపకారం చేయడమన్నది బౌద్ధ చక్రవర్తి ఇచ్చిన సందేశం. అయితే ఇవ్వడానికి ఏమీలేని సన్యాసులంతా నగ్నంగా తిరుగుతూ కుంభమేళాకు వక్రభాష్యం చెప్పారు. ఇదంతా 8 వ శతాబ్దపువాడైన శంకరాచార్య ఘనత! బహుశా ఆయన సమాజానికి అందించిన మహా ప్రసాదం- అదే!

వీర శైవుల దేవుడు శంకరుడు. ఒంటి నిండా బూడిద పూసుకుని, మొలకు చిన్న జంతు చర్మం చుట్టుకుని ఉండేవాడు. ఆయనను అనుసరించే ఈ ఆధునిక శంకరులు విభూతి, బూడిద పూసుకున్నారేగాని, చిన్న గోచీ అయినా పెట్టుకోలేకపోయారు. సమకాలీనంలో మనమేం చూస్తున్నాం? వేల సంఖ్యలో సన్యాసులు వీధుల వెంట నగ్నంగా అనాగరికంగా తిరుగుతూ ఉంటే- అదేదో పుణ్య కార్యమైనట్టు కొందరు వ్యాఖ్యానాలు చేస్తుంటారు. నాగరిక సమాజాన్ని అపహాస్యంచేస్తూ అంతమంది నగ్నంగా వీధుల్లో నడుస్తూ ఉంటే- ప్రభుత్వాలు ఇప్పటికీ చర్యలు తీసుకోవు. మూఢ భక్తులు వంగి వంగి దండాలు పెడుతుంటారు. అధికారంలో ఉన్న రాజకీయ ప్రముఖులు కోట్ల విలువ గల సూట్లు వేసుకుని తిరుగుతుంటారు. కానీ, నైతికత, జీవన విలువలు- అనే వలువలు వదిలేసి నగ్నంగానే తిరుగుతున్నారు.

మేధావులు మౌనం వహించినపుడు
మూర్ఖుల సంఖ్య రెట్టింపవుతుంది.
ఇది ఎదిగే సమాజ ఉనికికే ప్రమాదం!
-అని అన్నారు నెల్సన్ మండేలా

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత

ఆంధ్రలో తొలితరం కమ్యూనిస్టులు - 3

ఆర్వీ రామారావ్

అగ్ర కులాల్లో జన్మించిన వారందరూ సంపన్నులు కానక్కర్లేదు. దేశంలోనే మొట్ట మొదటి రాజకీయ ఖైదీ అయిన దరిశి చెంచయ్య పేద వైశ్య కుటుంబంలో జన్మించారు. ఆయన విప్లవవాదిగా ప్రసిద్ధి పొందిన స్వాతంత్ర్య సమరయోధుడు. వృత్తి రీత్యా ఆయన వ్యవసాయ శాస్త్రవేత్త. వ్యవసాయం మీద ఆసక్తి ఉన్నందువల్ల పై చదువులకు అమెరికా వెళ్లారు. 1912లో లోగోస్ కళాశాల నుంచి బి.ఎస్సీ పూర్తి చేశారు. అమెరికాలో ఉండగానే ఆయన గదర్ పార్టీలో పని చేశారు. పాతికేళ్ల వయసున్నప్పుడే కెనడా నుంచి అమెరికాకు బాంబులు చేరవేశారు. సముద్ర తీరం ద్వారా వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు. బ్రిటీష్ ప్రభుత్వం ఆయన మీద కేసులు మోపి దిల్లీ, కలకత్తా, లాహోర్, కన్ననూరు, అలీగఢ్, కోయంబత్తూరు జైళ్లలో పెట్టింది. మొత్తం 36 ఏళ్ల ప్రజా జీవనంలో చెంచయ్య ఎనిమిదేళ్లు జైళ్లలోనే గడిపారు. ఆయన మీద మోపిన ఏ కేసూ రుజువు కానందువల్ల 1949లో విడుదల చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత పదవుల కోసం వెంపర్లాడకుండా సంఘ సంస్కరణోద్యమంలో నిమగ్నమయ్యారు. కందుకూరి వీరేశలింగం రచనలు చెంచయ్యకు స్ఫూర్తి కలిగించాయి. అందువల్ల చిన్ననాటి నుంచే మూఢ నమ్మకాల మీద తిరగబడ్డారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించే వారు. కార్మిక హక్కుల కోసం కూడా ఆయన విస్తారమైన కృషి చేశారు. గదర్ ఉద్యమం పశ్చిమ దేశాలలో జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సాగించేది. మన దేశంలో స్వాతంత్ర్య సాధనకు మొదటి రాజకీయ ఉద్యమమైన గదర్ ఉద్యమంలో చెంచయ్య భాగస్వామి బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలవల్ల ప్రభావితులైన చెంచయ్య విప్లవం ద్వారానే స్వాతంత్ర్య పోరాటం సఫలమవుతుందని భావించేవారు. ఉన్నత చదువుకోసం అమెరికా వెళ్లినప్పుడు

ఆయనకు కాలిఫోర్నియా యూనివర్సిటీలో భారత విప్లవకారుడు లాలా హర దయాళ్‌తో పరిచయమైంది. జితేంద్రనాథ్ లహరితో కలిసి గదర్ పార్టీ స్థాపించారు. గదర్ పార్టీలో చెంచయ్యకు ఆ పార్టీకి చెందిన పంజాబీ యువకులు దేశభక్తి తమ సొత్తేనని వాదించడం నచ్చలేదు. దేశభక్తి ఎవరికైనా ఉంటుందని, బ్రిటిష్ సేనలో మొదట చేరిన పంజాబీ యువకులు విదేశాల్లో యుద్ధం చేస్తూ దేశభక్తి తమ సొంతమని పొంగి పోనక్కర్లేదని చెంచయ్య భావించేవారు. మొత్తం మీద ఆయనకి గదర్ పార్టీపై గౌరవం పెరిగింది. అమెరికా నుంచి స్వదేశానికి బయలుదేరి వస్తున్న ప్పుడు మార్గమధ్యమంలో బ్రిటిష్ ప్రభుత్వం ఆయన మీద రాజద్రోహి అన్న ముద్రవేసి, అరెస్టు చేసి నాలుగున్నరేళ్లు జైలులో పెట్టింది.

దర్శి చెంచయ్య మార్క్సిస్టు గ్రంథాలు ఎక్కువగా చదివేవారు. మొదట కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలోనూ, ఆ తరవాత కమ్యూనిస్టు పార్టీలోనూ చేరారు. 1936 సెప్టెంబర్‌లో రాజమండ్రిలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ మహాసభకు చెంచయ్యతో పాటు ఆయన భార్య సుభద్రమ్మ కూడా హాజరయ్యారు. చెంచయ్య ఏంగెల్స్ రాసిన గ్రంథాన్ని తెలుగులోకి "సోషలిజం: ఊహాజనితం, శాస్త్రీయం"గా అనువదించారు. సామ్రాజ్యవాద యుద్ధ దశలో చెంచయ్య డిటెన్యూగా నిర్బంధంలో ఉన్నారు. చెంచయ్య ఆత్మకథ "నేనూ-నాదేశం" బాగా ప్రచారంలోకి వచ్చింది. ఆయన రాసిన కాంగ్రెస్ చరిత్ర సాధికారికమైంది. ఆఖరు సారి జైలు నుంచి విడుదలైన తరవాత ఆయన రాజకీయాల నుంచి విరమించుకున్నారు.

తుమ్మల వేంకట్రామయ్య

ఊహ తెలిసిన నాటి నుంచి తుమ్మల రాజకీయ వాతావరణంలోనే పెరిగారు. కాంగ్రెస్ పిలుపు అందుకుని జాతీయ పాఠశాలలో చేరి హిందీ, తెలుగు, సంస్కృతం నేర్చుకున్నారు. అక్కడ తుమ్మల రాట్నం మీద నూలు వడికేవారు. మగ్గం మీద బట్టలు నేశారు. వడ్రంగం నేర్చుకున్నారు. సబ్బులు మొదలైనవి చేయడానికి ప్రయత్నించారు. కొన్నాళ్ల తరవాత ఆ పాఠశాల మూతపడింది. వేరే మార్గం లేక హైస్కూలులో చేరారు. ఉప్పు సత్యాగ్రహం, జాతీయ గీతాలు, నాయకుల అరెస్టులు విద్యార్థులను ఉద్రూత లూగించేవి. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల ఉరి, విప్లవకారుల వీర కృత్యాలు తుమ్మలమీద గాఢమైన ముద్ర వేశాయి. "పాఠ్య గ్రంథాల్లోని బ్రిటిష్ చక్రవర్తుల ఫోటోలు చించేశాం. ఖద్దరు టోపీ ధరించడం ఆ రోజుల్లో శిక్షార్హం. దానికి నిరసనగా క్లాసు విద్యార్థులమంతా ఖద్దరు టోపీలు ధరించి క్లాసుకు హాజరయ్యాం. అందుకు జరిమానా విధించారు. అరెస్టులకు నిరసనగా క్లాసులను బహిష్కరించాం" అని తుమ్మల ఓ వ్యాసంలో రాశారు. తుమ్మలకు సాహిత్యాభి నివేశం ఉండేది. 1934లో గోర్కీ అమ్మ నవల సంక్షిప్తీకరించి "మాతృ హృదయం" పేర ప్రచురించారు. తనకు కమ్యూనిస్టు భావజాల అంకురార్పణ ఈ గ్రంథం ద్వారానే జరిగి ఉండవచ్చుననే వారు తుమ్మల. ఆ తరవాత తుమ్మల శాస్త్రి కోర్స్ చదవడానికి కాశీ విద్యాపీఠ్‌లో చేరారు. కొత్తగా ఏర్పడిన అఖిలభారత కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ నాయ కుల్లో ఒకరైన ఆచార్య నరేంద్ర దేవ్ ఆ కళాశాలకు ప్రిన్సిపాల్. సంపూర్ణానంద, శ్రీ ప్రకాశ్ మొదలైన వారు అక్కడ అధ్యాప కులు. 1934లో విద్యాపీఠ్‌లో కమ్యూనిస్టు సెల్ ఏర్పడింది. అందులో తుమ్మల సభ్యుడు. ఆ సమయంలోనే ఆయనలో ఎర్రజెండా పరువూ, కమ్యూనిస్టులంటే గౌరవం పెరిగాయి. కాశీ విద్యాపీఠ్‌లో చదువు పూర్తి కాకుండానే గుంటూరు జిల్లాకు వచ్చి పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనేవారు. మొట్ట మొదట ఎర్ర జెండా పాట రాసింది తుమ్మల వెంకట్రామయ్యే.

పెండ్యాల లోకనాథం

జొన్నలగడ్డ రామలింగయ్య, ప్రతాప రామసుబ్బయ్య జైలు నుంచి విడుదలై వచ్చిన తరవాత కాంగ్రెస్‌పై వ్యక్తం చేసిన అభిప్రాయాలు లోకనాథంను బాగా ప్రభావితం చేశాయి. "కాంగ్రెస్ ధనికవర్గ సంస్థ అనీ, దాని కార్యక్రమం మితవాద పూరితమనీ, మోసపూరితమనీ, తెల్లవారి స్థానంలో ధనిక నల్లవారి రాజ్య స్థాపనే వారి ఆశయమనీ, పేదల రాజ్యం కావాలంటే కార్మిక, కర్షకులు పోరాడి కమ్యూనిస్టు రాజ్యం స్థాపించుకోవాలని జొన్నలగడ్డ రామలింగయ్య, ప్రతాప రామసుబ్బయ్య వ్యక్తం చేసిన అభిప్రాయాలు లోకనాథంను చాలా ప్రభావితం చేశాయి. దానితో తనంత తాను పేటలలో, మిల్లులలో, బజార్లలో తిరుగుతూ కార్మికులకు వారి కష్టాల గురించి వివరించే వారు. కానీ ఆ మాటలు కార్మికులను అంతగా ఆకర్షించలేదు. చివరకు కార్మికుల కష్టాలను, వర్గ పోరాటాన్ని వివరిస్తూ కార్మికులు, కర్షకులు సులభంగా పాడుకునే రీతిలో "కూలీలందరూ ఏకమైతే కూటికి తరుగేమిరా" పాట రాశారు. ఈ పాట కార్మిక, కర్షక కుటుంబాల వారిని బాగా హత్తుకుంది. కార్మికుల్లో వర్గ చైతన్యం కలిగించి, సంఘాల్లో వారిని సభ్యులుగా చేర్చి పోరాటాలు నడపడానికి ఒక సంస్థ అవసరమనుకున్నారు. కానీ ఆ దశలో కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం ఉండేది. అందువల్ల కూలీ రక్షణ సమితి ఏర్పాటు చేశారు. కూలీ రక్షణ సమితి సభ్యుల్లో కొంత మంది కమ్యూనిస్టులు కూడా ఉండేవారు. సామ్రాజ్యవాద వ్యతిరేక, కాంగ్రెస్ వ్యతిరేక, మత వ్యతిరేక, దైవ భావ వ్యతిరేక భావాలు వ్యాప్తి చేయడానికి పెండ్యాల లోకనాథం విశేషమైన కృషి చేశారు.

విశాలాంధ్ర

5

ఆదివారం

12 జనవరి 2025

మోదీపై 'మహాకావ్యం'



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన సంస్కృత పండితుడు సోమ నాథ్ మహాకావ్యాన్ని రచించారు. సోమనాథ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మోదీ జీవన ప్రయాణం, ఎదుర్కొన్న సవాళ్లు, ఆయన రాసిన రచనలను వివరిస్తూ 12 అధ్యాయాలు, 1200 శ్లోకాలతో 'నరేంద్ర ఆరోహణం' పేరిట ఈ మహాకావ్యాన్ని రాసినట్లు సోమనాథ్ పేర్కొన్నారు. ఈ గ్రంథ రచనకు ప్రతాపరుద్రీయం, కావ్యప్రకాశం వంటి ప్రాచీన, సంస్కృత ఇతిహాసాల శైలిని అనుసరించానన్నారు. దీనిని రాయడానికి నాలుగు ఏళ్లు పట్టిందని అన్నారు. ఇటీవల గుజరాత్‌లోని వెరావల్‌లో జరిగిన యువజనోత్సవంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు సోమనాథ్ పేర్కొన్నారు. ఈ కావ్యాన్ని హిందీ, ఆంగ్ల భాషల్లో అనువదించినట్లు తెలిపారు. సోమనాథ్ ఈ కావ్యం గురించి మాట్లాడుతూ మోదీ జీవన విధానం... రాజకీయ ప్రయాణం ఎల్లప్పుడూ చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. పుస్తక రచన కోసం వివిధ వార్తా పత్రికలు, పుస్తకాలు, మోదీ 'మన్‌కీ బాత్' కార్యక్రమం మొదలైన వాటి నుంచి సమాచారం తీసుకున్నట్లు తెలిపారు.

పొగమంచుతో 200 విమానాలు ఆలస్యం

న్యూఢిల్లీ: ఉత్తరాది రాష్ట్రాలను పొగమంచు వణికిస్తోంది. ఢిల్లీ సహా సమీప రాష్ట్రాలను దట్టమైన పొగమంచు కమ్మే సింది. దీంతో దృశ్యమానత సున్నాకు పడిపోయింది. ఈ కారణంగా రోడ్డు, రైలు, విమాన సర్వీసులకు తీవ్ర అంతరా యం ఏర్పడుతోంది. ఢిల్లీలో ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ రన్‌వేపై శనివారం ఉదయం విజిబిలిటీ సున్నాగా నమోదైంది. ఢిల్లీకి రాకపోకలు సాగించే 220కిపైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. మరోవైపు ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, హర్యానా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో వారణాసి, లక్నో, ఆగ్రా, పాట్నా, బరేలీ విమానాశ్రయాల్లో దృశ్యమానత సున్నాకు పడిపోయింది. ఆయా విమానాశ్రయాల్లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. కోల్‌కతాలోని శుభాష్ చంద్రబోశ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సుమారు 19 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

గుల్మార్గ్‌ను కప్పేసిన మంచు

హిమాలయాలకు అనుకుని ఉన్న జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో జోరుగా మంచు కురుస్తోంది. ఆయా రాష్ట్రాల్లో పర్యాటక ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేసింది. ఒకవైపు ఎండ, మరో వైపు మంచుతో కూడిన విశ్రమ వాతావరణాన్ని యాత్రికులు ఆస్వాదిస్తున్నారు. జమ్ముకశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో మంచు జోరుగా పడుతుండటంతో పరిసర ప్రాంతాలన్నీ ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి.

ఉత్తరాఖండ్ బీజేపీలో పోరు?

డెహ్రాడూన్ : కాషాయ పార్టీ బీజేపీలో అసంతృప్తుల సంఖ్య పెరుగుతోంది. బీజేపీ ఉత్తరాఖండ్ విభాగంలో ఈ పరిస్థితి ఎదురయింది. రాష్ట్రంలో జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ అధికారిక అభ్యర్థులకు వ్యతిరేకంగా స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగిన ఆరుగురు తిరుగుబాటు నాయకులను బహిష్కరించినట్లు బీజేపీ ఉత్తరాఖండ్ విభాగం శనివారం తెలిపింది. బహిష్కరణ ఉత్తర్వులు శుక్రవారం జారీ అయ్యాయి. బీజేపీ ఉత్తరాఖండ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్ర భట్ సిఫార్సు మేరకు ఉత్తరకాశిలో నలుగురు, రుద్రప్రయాగలో ఇద్దరు తిరుగుబాటు నాయకులను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఆరు సంవత్సరాల పాటు పార్టీ నుంచి బహిష్కరించినట్లు బీజేపీ రాష్ట్ర మీడియా ఇంఛార్జ్ మన్వీర్ చౌహాన్ తెలిపారు. బరాహత్‌లో మునిసిపల్ మాజీ చైర్మన్ భూపేంద్ర సింగ్ చౌహాన్, పురోలాలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఉమ్మీద్‌చంద్ షా, నౌగావ్‌లో మాజీ బ్లాక్ అధ్యక్షుడు యశ్వంత్ కుమార్, బార్కోట్‌లో శక్తి కేంద్ర కన్వీనర్ అజయ్ సింగ్ రావత్ తదితరులు బహిష్కరణకు గురయ్యారు.

ఢిల్లీ రాజకీయాల్లో 'కాగ్' చిచ్చు

ఆప్‌పై బీజేపీ, కాంగ్రెస్ ఆరోపణలు

తిప్పికొట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ

న్యూఢిల్లీ: దేశరాజధానిలోని ఆమ్‌ఆద్మీ పార్టీ సర్కారుపై బీజేపీ విమర్శలకు దిగింది. ఢిల్లీ మద్యం పాలసీ కారణంగా ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక లీకైన విషయంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ ఈ నివేదిక ఆప్ నేతల అవినీతిని బట్టబయలు చేసిందని అన్నారు. ఆప్‌నేతల ఉద్దేశపూర్వక తప్పిదాలతో ఖజానాకు రూ.వేల కోట్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. ఢిల్లీ ప్రజలకు ఇంతటి ద్రోహం చేసిన ఆప్ నేతలకు శిక్ష పడే సమయం దగ్గరలోనే ఉందని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. మద్యం పాలసీపై కాగ్ లేవనెత్తిన ప్రశ్నలకు కేజ్రీవాల్ సమాధానం చెప్పాలని బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ డిమాండ్ చేశారు. లీకైన కాగ్ నివేదికపై కాంగ్రెస్ పార్టీ నేత సందీప్ దీక్షిత్ స్పందిస్తూ... కేజ్రీవాల్ అవినీతికి పాల్పడ్డారనే విషయం ఈ నివేదికతో స్పష్టమయిందని అన్నారు. 'మద్యం పాలసీలో రూ.2వేల కోట్లకు పైగా కుంభకోణం జరిగిందని కాగ్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. కేజ్రీవాల్ తప్పు చేశారని.. ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేశారని తేలింది. మద్యం పాలసీ పేరుతో 6 నెలల్లో రూ.2వేల కోట్లు ఖర్చు చేస్తే... ఆ పథకం ఇంకా అమలులో ఉంటే ఢిల్లీకి దాదాపు రూ.12 వేల కోట్ల నష్టం వాటిల్లేది' అని విమర్శించారు.

కాగా, బీజేపీ, కాంగ్రెస్ ఆరోపణలను ఆప్ తిప్పికొట్టింది. కాగ్ నివేదిక ఇంకా సమర్పించలేదని బీజేపీ స్వయంగా అంగీకరించిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. నివేదిక నిజమైతే అది ఎక్కడ ఉందో చూపించాలని బీజేపీ, కాంగ్రెస్ నేతలకు సవాలు విసిరారు. ఎన్నికలకు ముందు బీజేపీ తమపై అసంబద్ధ ఆరోపణలు చేస్తూ... దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఢిల్లీ మద్యం పాలసీపై కాగ్ రూపొందించిన నివేదిక లీకైనట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. మద్యం విధానంపై నిపుణుల కమిటీ సిఫార్సులను నాటి ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా నేతృత్వంలోని మంత్రుల బృందం విస్మరించిందని తెలిపింది. అంతేకాకుండా, ఈ పాలసీపై కీలక నిర్ణయాలు తీసుకునే క్రమంలో మంత్రిమండలి, లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం తీసుకోలేదని వెల్లడించింది. లైసెన్సుల జారీ, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు వెల్లడించింది.

బీజేపీ సీఎం అభ్యర్థి బిదూరీ: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా వివాదాస్పద నేత రమేశ్ బిదూరీని బీజేపీ ప్రకటిస్తుందని, దీనికి సంబంధించిన సమాచారం తన వద్ద ఉందని ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీ సీఎం ఆతిశీ, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన రమేశ్ బిదూరీని బీజేపీ తన సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తుందని కేజ్రీవాల్ వెల్లడించారు. ఒకటి, రెండు రోజుల్లోనే బీజేపీ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నట్టు తమకు సమాచారం ఉన్నదని కేజ్రీవాల్ చెప్పారు. 'బీజేపీ సీఎం అభ్యర్థిగా ప్రకటితం కాబోతున్న రమేశ్ బిదూరీకి నా అభినందనలు. అయితే ఆయన ఒక ఎంపీగా ఢిల్లీ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలి. ఢిల్లీ పట్ల ఆయనకున్న విజన్ ఏమిటో వెల్లడించాలి. ఆయన పేరును బీజేపీ అధికారికంగా ప్రకటించిన తర్వాత ఢిల్లీ ప్రజల ముందు బీజేపీ, ఆప్ సీఎం అభ్యర్థుల మధ్య చర్చ జరగాలి' అని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు.

ఇంజక్షన్ వికటించి బాలింత మృతి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని మిడ్నాపూర్ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో ఇంజక్షన్ వికటించి బాలింత మృతి చెందింది. ప్రసవించిన తర్వాత నామె ప్రాణాలు కోల్పోయింది. అయితే, ఆమె మృతికి వైద్యులు ఇచ్చిన ఇంజక్షనే కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... ఓ మహిళ బుధవారం పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఆమె శుక్రవారం ప్రాణాలు విడిచింది. మరో నలుగురు మహిళల ఆరోగ్యం సైతం డెలివరీ తర్వాత క్షీణించడంతో ఈ వ్యవహారంపై బాధిత కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రసవ సమయంలో మహిళలకు ఇచ్చిన ఇంట్రావీనస్ ఇంజక్షన్ గడువు ముగిసిందని పేర్కొంటున్నారు. అదే బాలింత మృతికి కారణమని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మృతురాలి భర్త కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ ఈ విషయంపై దర్యాప్తు చేపట్టింది. ఇందుకోసం 13 మంది సభ్యుల ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది.

ఐదేళ్లూ సిద్ధరామయ్యే ముఖ్యమంత్రి

మంత్రి పాటిల్

బెంగళూరు: సిద్ధరామయ్య ఐదేళ్ల కాలం సీఎంగా కొనసాగుతారని, మధ్యలో మార్పు ఏమీ ఉండదని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ చెప్పారు. పాటిల్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి మార్పుపై స్పష్టత ఇచ్చారు. రెండేళ్ల తరువాత ముఖ్యమంత్రి మార్పు ఒప్పందం అమలవుతుందా అని విలేకరులు ప్రశ్నించగా... మంత్రి బదులిస్తూ అలాంటి మార్పు ఏమీ లేదని, సిద్ధరామయ్య ఐదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారన్నారు. రాజకీయ కారణాలతో అనేక మార్పులు జరగవచ్చు కానీ సీఎంగా సిద్ధరామయ్య ఉంటారని అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో విందులు, వివాదాస్పద వ్యాఖ్యలు, అధిష్ఠానం హెచ్చరికలు సాగుతున్న తరుణంలోనే మంత్రి పాటిల్ ప్రకటన పార్టీలో కలకలం రేపింది. మంత్రి సతీశ్‌జార్కిహోళి కొందరికి విందు ఏర్పాటు చేయడం, ఆ తర్వాత మంత్రి పరమేశ్వర్ ఆహ్వానించడాన్ని అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. విందులకు అధిష్ఠానం ద్వారా చెక్ పెట్టించిన ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు మరోసారి ఆగ్రహం కలిగించేలా మంత్రి ఎంబీ పాటిల్ వ్యాఖ్యానించారు.

15 మందితో అథవాలే పార్టీ అభ్యర్థుల జాబితా

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేకు చెందిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. ఢిల్లీలోని వివిధ నియోజకవర్గాల నుంచి ఆ పార్టీ తరఫున బరిలో దిగనున్న మొత్తం 15 మంది అభ్యర్థుల జాబితాను ఆర్పీఐ శనివారం విడుదల చేసింది. న్యూఢిల్లీ నుంచి శుభి సక్సేనా, పాలం నుంచి వీరేందర్ తివారీ, మాలవీయనగర్ నుంచి రాంనరేష్ నిషాద్ బరిలో దిగబోతున్నారు. ఢిల్లీలో ఈసారి అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ, ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోరు నెలకొంది. జాతీయంగా ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటనలో మిత్రపక్షాలుగా ఉన్న ఆప్, కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో ప్రత్యర్థులుగా తలపడబోతున్నాయి. గత రెండు ఎన్నికల్లోనూ ఇక్కడ త్రిముఖపోరే జరిగింది. కానీ కాంగ్రెస్ ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది.

కేజ్రీవాల్ 'అద్దాల మేడ'పై బీజేపీ పాటలు



న్యూఢిల్లీ: దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార, విపక్ష పార్టీలైన ఆప్, బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ సమయంలో 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపుతోంది. ఢిల్లీ ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతుంటే కేజ్రీవాల్ తన కోసం 'శీష్ మహల్' (అద్దాల మేడ) నిర్మించుకున్నారని కొద్ది రోజులుగా బీజేపీ ఆరోపిస్తోంది. తాజాగా దీనికి సంబంధించి బీజేపీ ఓ వీడియోలో కేజ్రీవాల్‌ను వ్యంగ్యంగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో బంగ్లాలోని లగ్జరీ సౌకర్యాల కోసం అత్యధికంగా నిధులు ఖర్చు చేశారని ఆరోపించింది. 'ప్రజలకు ఆపద సృష్టించేవారికి అద్దాల మహల్ అడ్డా' అంటూ రూపొందించిన పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఢిల్లీలో మార్పును, అభివృద్ధిని తీసుకువస్తానని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్... సీఎం అయ్యాక తన స్వభావాన్ని మార్చుకు న్నారని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ విమర్శించారు. కేజ్రీవాల్ చేసే అభివృద్ధి కోసం ఢిల్లీ ప్రజలు వేచి చూస్తుంటే ఆయన మాత్రం కోట్లు గుమ్మరించి అద్దాల మేడ కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. దేశాన్ని మొఘలులు పాలించే సమయంలో వారు ఇటువంటి అద్దాల భవనాల్లో నివసించేవారని, అదేస్థాయిలో కేజ్రీవాల్ శీష్ మహల్ నిర్మించారని అన్నారు.

అశ్విన్‌కు అన్నామలై మద్దతు

చెన్నై: హిందీ జాతీయ భాష కాదు... అధికారిక భాష మాత్రమే అని క్రికెటర్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలను తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై సమర్థించారు. అసలేం జరిగిందంటే... చెన్నైలోని ఓ కళాశాల ఈవెంట్‌కు అశ్విన్ హాజరయ్యారు. అక్కడ మాట్లాడుతూ హిందీ జాతీయ భాష కాదని పేర్కొన్నారు. హిందీ కేవలం అధికారిక భాష మాత్రమే అని వ్యాఖ్యానించారు. క్రికెటర్ వ్యాఖ్యలు ప్రస్తుతం ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆయన వ్యాఖ్యలను కొందరు తప్పుపడుతుండగా... మరికొందరు సమర్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో అశ్విన్ చేసిన వ్యాఖ్యలపై స్పందించాలని అన్నామలైని మీడియా కోరగా... 'అశ్విన్ చెప్పింది నిజమే. హిందీ జాతీయ భాష కాదు. హిందీ అనేది కేవలం లింక్ లాంగ్వేజ్ మాత్రమే' అని స్పష్టం చేశారు. హిందీపై అశ్విన్ చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నట్లు అన్నామలై పేర్కొనడం ఇప్పుడు మరింత చర్చకు దారి తీస్తోంది. దీంతో తమిళనాడు రాష్ట్రంలో మరోసారి తమిళ్, హిందీ వివాదం తెరపైకి వచ్చింది.

మోదీకి తత్వం బోధపడింది

జైరాం రమేశ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో ప్రధాని నరేంద్రమోదీ ...'నేనూ మనిషినే.. భగవంతుడిని కాదు కదా' అంటూ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ శనివారం స్పందించారు. ఆ వ్యాఖ్యలు నష్ట నివారణ చర్యలుగా ఉన్నాయన్నారు. ఈమేరకు జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'ఎనిమిది నెలల క్రితం తాను దేవుడు పంపిన ప్రతినిధిని అని మోదీ ప్రకటించుకున్నారు. అందుకే ఇప్పుడు నష్ట నివారణ చర్యలు చేపట్టారు' అని గతంలో మోదీ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. నిఖిల్ కామత్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ వీడియో శుక్రవారం విడుదలైంది. అందులో రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు మీరిచ్చే సూచన ఏమిటని నిఖిల్ ప్రశ్నించారు. దీనికి మోదీ బదులిస్తూ 'రాజనీతి కలిగిన వ్యక్తులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది. ప్రజాసేవే లక్ష్యంగా రావాలి. స్వప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం కాదు' అని స్పష్టంచేశారు. ఈసందర్భంగా తన పాత ప్రసంగాలను ప్రస్తావించారు. 'గుజరాత్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత మోదీ మాట్లాడుతూ... కష్టపడి పనిచేయడానికి వెనకాడను. నా స్వార్థం కోసం పనిచేయను. దురుద్దేశాలతో ఏ తప్పు చేయను. ఇదే నా జీవిత మంత్రం. పొరపాట్లు జరగటం అనివార్యం. నేనూ కొన్ని తప్పులు చేసి ఉండవచ్చు. నేనూ మనిషినే... భగవంతుడిని కాదు కదా' అని తాను చెప్పినట్లు గుర్తు చేసుకున్నారు.

మహిళలను గర్భవతులుగా చేస్తే రూ.10 లక్షలు

సైబర్ నేరగాళ్ల వింత దోపిడీ

పాట్నా: సైబర్ నేరగాళ్ల ఆట కట్టించడానికి అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా... ఏదో ఒక వినూత్న దారుల్లో వారి ఆగడాలు కొనసాగుతూనే ఉన్నాయి. స్టాక్ మార్కెట్‌లో అధిక రాబడులు, అధిక వడ్డీ, డిజిటల్ అరెస్టులు, హనీట్రాప్ ఇలా ఎన్నో రకాలుగా సైబర్ నేరగాళ్ల మోసాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. అయితే తాజాగా బీహార్‌లో ఓ ఘటన వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు 'సంతానం లేని మహిళలను గర్భవతులుగా చేస్తే రూ.10 లక్షలు' అని బీహార్‌లోని ఓ ముఠా యాడ్ ఇచ్చింది. 'ఆల్ ఇండియా ప్రెగ్నెంట్ జాబ్ సర్వీస్', 'ప్లేబారు సర్వీస్' పేరిట ఫేస్‌బుక్‌లో ఈ ముఠా సభ్యులు ప్రకటనలు ఇచ్చారు. పిల్లలు లేని స్త్రీలను గర్భవతులను చేస్తే రూ.10 లక్షలు పొందవచ్చని ప్రకటించారు. ఒకవేళ వారు విఫలమైతే రూ.50 వేల నుంచి రూ.5 లక్షలు సైతం పొందవచ్చని పేర్కొన్నారు. దీంతో ఆకర్షితులైన కొంతమంది ఆ ముఠాను సంప్రదించారు. మొదట ముఠా సభ్యులు బాధితుల నుంచి పాన్ కార్డ్, ఆధార్ కార్డ్, సెల్ఫీ, ఇతర వివరాలు సేకరించారు. అనంతరం రిజిస్ట్రేషన్, హోటల్ గదుల బుకింగ్స్ పేరిట డబ్బు వసూలు చేశారు. ఒకవేళ బాధితులు ఇవ్వకుంటే వారిని బ్లాక్‌మెయిల్ చేసేవారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అనంతరం నిందితులు ప్రిన్స్ రాజ్, భోలా కుమార్, రాహుల్ కుమార్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద బాధితుల వాట్సప్ ఛాట్, కస్టమర్ ఫొటోలు, ఆడియో రికార్డింగ్‌లు, బ్యాంక్ లావాదేవీలను గుర్తించారు. నవడా జిల్లాలో ఈ స్కామ్ బయటపడింది.

రాష్ట్రాభివృద్ధిని జీర్ణించుకోలేకపోతున్నారు

గవర్నరుపై సీఎం స్టాలిన్ విమర్శ

చెన్నై: డీఎంకే నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య కొంతకాలంగా భేదాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే మరోసారి గవర్నర్‌పై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని స్టాలిన్ అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'గవర్నర్ అసెంబ్లీకి వచ్చినా ప్రసంగించకుండానే మధ్యలో వెళ్లిపోయారు. ఆయన తీరు చిన్న పిల్లల చేష్టల మాదిరిగా ఉంది. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ బాధ్యతను నిర్వర్తించలేకపోయారు. తమిళనాడు అభివృద్ధి చూసి ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు' అని సీఎం తీవ్ర విమర్శలు చేశారు. కాగా... ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల ప్రారంభోత్సవం సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించలేదని ఆరోపిస్తూ గవర్నర్ రవి... ప్రసంగం చేయకుండానే వెళ్లిపోయారు.

లైంగిక నేరాల నిరోధక బిల్లులకు ఓకే

క్రిమినల్ చట్టాల (తమిళనాడు సవరణ) బిల్లు 2025, మహిళలపై వేధింపుల నిషేధ (సవరణ) బిల్లు 2025ను తమిళనాడు అసెంబ్లీ శనివారం ఆమోదించింది. ఈ రెండు బిల్లులను ముఖ్యమంత్రి స్టాలిన్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ రెండు బిల్లులను అసెంబ్లీ ఆమోదించింది. కాగా, మహిళలు, చిన్నారులపై లైంగిక నేరాల శిక్షను పెంచడం, డిజిటల్, ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫారంలలో లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని ప్రాసిక్యూట్ చేయడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యం. రాష్ట్రంలో ఇప్పటివరకు అత్యాచారానికి పాల్పడిన దోషికి 10 ఏళ్ల జైలు శిక్ష అమలులో ఉంది. సవరించిన బిల్లు ప్రకారం అత్యాచార దోషికి కనీసం 14 ఏళ్లు జైలు శిక్ష విధించాలని క్రిమినల్ చట్టం ప్రతిపాదించింది. అదే అత్యాచారం చేసిన వ్యక్తి పోలీసు శాఖకు చెందిన వారైతే ఆ వ్యక్తికి కనీసం 20 ఏళ్ల జైలు శిక్ష విధించాలని, అత్యాచార బాధితురాలు 12 ఏళ్లలోపు బాలిక అయితే... అత్యాచార దోషికి జీవిత ఖైదు లేదా మరణశిక్ష విధించాలని క్రిమినల్ చట్టం బిల్లు ప్రతిపాదించింది.

రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు

మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి ఆర్‌ఎస్ఎస్ కారణమని ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్‌పవార్ చేసిన వ్యాఖ్యలపై ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. లోక్‌సభ ఎన్నికల్లో మహావికాస్ అఘాడీ చేసిన తప్పుడు ప్రచారాన్ని ఆర్‌ఎస్ఎస్ విచార్ పరివార్ సమర్థవంతంగా తిప్పికొట్టిందని అన్నారు. రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చన్నారు. 'మహారాష్ట్ర ఎన్నికల్లో అరాచక శక్తులకు వ్యతిరేకంగా జాతీయ శక్తులన్నీ ఒక్కటిగా పనిచేయాల్సి ఉందని మేం ఆర్‌ఎస్ఎస్ విచార్ పరివార్‌ను అభ్యర్థించాం. అది అందించిన సహకారంతో మేం నకిలీ కథనాలను అంతం చేయగలిగాం. దాంతో లోక్‌సభకు భిన్నంగా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సాధించుకున్నాం. తప్పుడు కథనాలతో అధికారంలోకి వస్తామని మహావికాస్ అఘాడీ మితిమీరిన ఆత్మవిశ్వాసంతో వ్యవహరించింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో మేం కూడా అతివిశ్వాసంతో ఉన్నాం. రాజ్యాంగాన్ని మార్చేస్తారంటూ, ఇంకా అనేక అంశాలపై ప్రతిపక్షాలు చేసిన ప్రచారం ప్రభావం చూపదని భావించాం. కానీ దురదృష్టవశాత్తూ ఆ ప్రభావం మాపై పడింది' అని అన్నారు. శరద్ పవార్ పొగడ్త గురించి మాట్లాడుతూ 'పవార్ సాహెబ్ చాలా స్మార్ట్. కొన్నిసార్లు మన పోటీదారుల్ని ప్రశంసించే పరిస్థితి ఉంటుంది. అందుకే ఆయన అలా చేశారేమో' అని ఫడ్నవీస్ అన్నారు. '2019 నుంచి 2024 మధ్య రాష్ట్రంలో జరిగిన పరిణామాల తర్వాత నేను ఒక విషయం గ్రహించాను. ఇక్కడ ఎన్నటికీ జరగదు అనే మాట పనిచేయదు. ఎప్పుడైనా ఏదైనా జరగొచ్చు. అక్కడవాళ్లు ఇక్కడకు, ఇక్కడ వాళ్లు అక్కడకు వెళ్లొచ్చు' అని రాజకీయాల్లో తరచూ చోటుచేసుకునే పరిమాణాలు వెల్లడించారు.

ప్రాంతీయ పార్టీలకు విరాళాల వెల్లువ

- **రూ.200 కోట్లకు పైగానే అందాయని ప్రకటనలు**
- **జేఎంఎందే అత్యధిక మొత్తం**
- **ఏడీఆర్ విశ్లేషణలో వెల్లడి**

న్యూఢిల్లీ : దేశంలోని రాజకీయ పార్టీలకు విరాళాలు పెద్దఎత్తున వచ్చి పడుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి ప్రాంతీయ రాజకీయ పార్టీలు జేఎంఎం, జేజేపీ, టీడీపీ, టీఎంసీ రూ.200 కోట్లకు పైగా విరాళాలను అందుకున్నట్లు ప్రకటించాయి. కొన్ని పార్టీలు విరాళాల నుంచి వచ్చే ఆదాయంలో అత్యధిక పెరుగుదలను నివేదించాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విశ్లేషణ తెలిపింది. అందుకున్న మొత్తం విరాళాలలో కొన్ని పార్టీల ఆధిపత్యం, భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) కి సమర్పణలలో గణనీయమైన జాప్యం, దాతల వివరాలను వెల్లడించడంలో అంతరాలను ఈ నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. విశ్లేషించిన 57 ప్రాంతీయ పార్టీలలో 18 మాత్రమే నిర్ణీత సమయంలో ఈసీఐకి తమ విరాళాల నివేదికలను సమర్పించాయి. 28 ప్రాంతీయ పార్టీలు ప్రకటించిన మొత్తం 2,119 విరాళాలను విశ్లేషించగా, ఆ మొత్తం రూ.216.765 కోట్లుగా ఉంది. రూ.20 వేల కంటే ఎక్కువ విరాళాలు ఇచ్చే వ్యక్తులు తమ గుర్తింపును వెల్లడించాల్సి ఉంటుంది. అయితే మరో 17 పార్టీలు తమ విరాళాల వివరాలను ఆలస్యంగా సమర్పించాయి. ఇది రెండు నుంచి 164 రోజుల వరకు ఆలస్యం జరిగింది. బిజూ జనతాదళ్ (బీజేడీ), జమ్మూకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ (జేకేఎన్‌సీ) సహా ఏడు పార్టీలు ఈ సంవత్సరానికి విరాళాలు అందుకోలేదని ప్రకటించాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే కొన్ని పార్టీలకు విరాళాలలో గణనీయమైన పెరుగుదల ఉందని నివేదిక పేర్కొంది. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) 3,685 శాతం పెరుగుదలను చూసింది. ఆ తరువాత జన్నాయక్ జనతా పార్టీ (జేజేపీ) 1,997 శాతం, టీడీపీ 1,795 శాతం ఉన్నాయి. అయితే, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) పార్టీలు విరాళాలలో గణనీయమైన తగ్గుదల వరుసగా 99.1 శాతం, 89.1 శాతాన్ని నివేదించాయి. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), అత్యధికంగా విరాళాలు అందుకున్నవారి జాబితాలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అగ్ర స్థానంలో ఉంది. కేవలం 47 విరాళాల నుంచి రూ.154.03 కోట్లు ప్రకటించింది, తరువాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదుగురు దాతల నుంచి రూ.16 కోట్లు, తెలుగు దేశం పార్టీ (టీడీపీ) రూ.11.92 కోట్లతో ఉన్నాయి. ముఖ్యంగా, ఐదు పార్టీలు... బీఆర్ఎస్, వైసీపీ, టీడీపీ, ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే), భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మొత్తం ప్రకటించిన విరాళాలలో 90.56 శాతం వాటా కలిగి ఉన్నాయి. విరాళాల నివేదికలో పారదర్శకత గురించి ఏడీఆర్ ఆందోళన వ్యక్తం చేసింది. ఐదు ప్రాంతీయ పార్టీలు దాతల శాశ్వత ఖాతా నంబర్లు (పాన్) ఇవ్వకుండానే రూ.96.2 లక్షల విరాళాలను ప్రకటించగా, రూ.3.36 కోట్ల విలువైన విరాళాల చిరునామా వివరాలు కనిపించలేదు. అంతేకాకుండా, మొత్తం రూ.165.73 కోట్ల 204 విరాళాలకు విరాళం ఇచ్చే విధానం గురించి పూర్తి సమాచారం లేదు. మొత్తం విరాళాలలో నగదు విరాళాలు కేవలం 0.099 శాతం మాత్రమే, 43 విరాళాల నుంచి వచ్చిన రూ.21.45 లక్షలు. రాష్ట్రాల విషయానికొస్తే, కేరళ రూ.9.09 లక్షల నగదు విరాళాలతో అగ్రస్థానంలో ఉండగా, పశ్చిమ బెంగాల్ రూ. 5.91 లక్షలతో రెండవ స్థానంలో ఉంది. కార్పొరేట్, వ్యాపార సంస్థలు రూ.169.2 కోట్లు విరాళంగా ఇచ్చాయి. ఇది మొత్తం విరాళాలలో 78 శాతం. వ్యక్తిగత దాతల విరాళాలు రూ.45.24 కోట్లు. ప్రాంతీయ పార్టీలలో అత్యధికంగా 40 మంది కార్పొరేట్ దాతల నుంచి బీఆర్ఎస్ రూ.138.97 కోట్లు అందుకుంది. రూ.107.09 కోట్లతో ఢిల్లీ అతిపెద్ద దాతల స్థావరంగా అవతరించింది. తరువాత రూ.62.99 కోట్లతో తెలంగాణ, రూ.8.39 కోట్లతో ఆంధ్ర ప్రదేశ్ ఉన్నాయి. దాతల పాన్ వివరాలు, కచ్చితమైన విరాళాల విధానాలతో సహా విరాళాలను రాజకీయ పార్టీలు సకాలంలో నిర్ధారించవలసిన అవసరాన్ని ఏడీఆర్ నివేదిక నొక్కి చెప్పింది. రాజకీయ నిధుల ప్రక్రియలో ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడానికి పారదర్శకత నిబంధనలను కఠినంగా పాటించాలని కూడా ఇది ఈసీఐని కోరింది.

విశాలాంధ్ర హైదరాబాద్

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించ దానికి వచ్చిన సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ ఇంజనీర్ స్టేషన్ డెవలప్మెంట్ మల్లికార్జున ఏ.వి.హెచ్‌ను సబర్బన్ ట్రైన్ ట్రావెల్లెర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, జెడ్ఆర్‌యూసిసి మెంబర్ నూర్ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందచేశారు. అమ్రిత్ భారత్ స్టేషన్ స్కీంను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభిన రోజు మల్కాజిగిరి స్టేషన్ కార్యక్రమానికి మల్లికార్జున అధ్యక్షత వహించి ఈరోజు జరుగుతున్న పనులు చూడ్డానికి రావడం చాలా ఆనందదాయకమని నూర్ తెలిపారు. హైదరాబాద్ డివిజన్ గతి శక్తి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, సాంబశివరావు, బి.వెంకటేశ్వర్‌రావు ఇండ్వెల్ కంపెనీ ఇంజనీర్ జలాలుద్దీన్, తదితరులు తనిఖీలు చేసి పనులు వేగవంతం చేయాలనీ, నాణ్యతలో ఎటువంటి మినహాయింపులు ఉండకూడదన్నారు.

ఎమ్మెల్యే మర్రికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డిని కృపానంద్ అపార్ట్మెంట్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి నూతన సంవత్సరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. దీనిలో వాళ్ళు ఎదుర్కొంటున్న మంచి నీటి సమస్య, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ కోసం అడగడం జరిగింది. దీనికి దీనిపై ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ఈ సమస్యలపైన ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కృపానంద్ అపార్ట్మెంట్స్ అధ్యక్షులు శ్రీనివాస్, అశ్విన్ కుమార్, రవి కిషోర్, వెంకట్, రత్నం, శ్రీనివాస్, సంతోష్, భాస్కర్, నరసింహ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జనార్దన్, నవీన్, చిన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించేవరకు బిటిసి రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కన్నవారి నర్సింహ్మారెడ్డి అన్నారు. గచ్చిబౌలి భవన నిర్మాణ కార్మికుల లేబర్ అడ్డా దగ్గర జరిగిన సమావేశంలో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం గంటల తరబడి ఎదురుచూసే లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాలు మంచినీళ్లు టాయిలెట్స్ లేక చాలా అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన చెందారు. భవన నిర్మాణ కార్మికులు పని ప్రదేశాలలో కిందపడి చనిపోయిన గాయాలైన భవన నిర్మాణ యాజమాన్యాలు ఆదుకోవడంలో విఫలమైతున్నాయని ఆయన విమర్శించారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చి పనిచేస్తున్న కార్మికులతో ఈ పనులు చేయిస్తూ ప్రమాదంలో గాయపడిన చనిపోయిన ఎవరికి తెలియకుండా రాత్రికి రాత్రి పంపించే తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆయన ఆవేదన చెందారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు శంషాబాద్‌లో ఏప్రిల్ 21, 22 తేదీలలో జరుగుతున్నాయని వాటిని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిటిసి శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేసిన మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీ అండ్ టీ కాలనీలో టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ అమర్ సింగ్ హాజరై పోటీలను ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మి, శ్రీధర్ రెడ్డి, కాలనీ వాసులు, టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముగ్గుల పోటీలు మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. మహిళలు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. టీచర్స్ అసోసియేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. టీచర్స్ అసోసియేషన్ కృషిని ప్రశంసించారు. ఈ ముగ్గుల పోటీల్లో పలువురు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల రంగులు, డిజైన్లతో ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. న్యాయ నిర్ణేతలు పోటీలలో విజేతలను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు.

వినియోగదారులకు సత్వర సేవలందించాలి

అధికారులకు ఎండీ అశోక్ రెడ్డి ఆదేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈ వేసవిలో జలమండలి వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. తట్టిఖానా సెక్షన్‌ను ఆయన జలమండలి అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ వెయిటింగ్ పిరియడ్, పెండెన్సీ తగ్గించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వాటిని సమర్థంగా అమలు చేస్తే సకాలంలో వినియోగదారులకు ట్యాంకర్ డెలివరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. కమర్షియల్ విధానంలో ట్యాంకర్లు బుక్ చేసే హాస్టళ్లు, హాస్పిటల్స్, హెూటల్స్, మాల్స్ తదితర వినియోగదారులతో అగ్రిమెంట్ చేసుకోవాలని అధికారులకు సూచించారు. పగటి సమయంలో గృహ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా రాత్రి సమయంలో వీరికి ట్యాంకర్ డెలివరీ చేసేందుకు ఏర్పాటు చేయాలన్నారు. తట్టిఖానా సెక్షన్‌లో ఇప్పటికే 20 ట్యాంకర్లతో దాదాపు 150 ట్రిప్పులను డెలివరీ చేస్తున్నారు. ఇదే డిమాండ్ కొనసాగితే ఏప్రిల్ నాటికి రోజు 400 ట్రిప్పులు కావాలి. ఇప్పుడున్న ఫిల్లింగ్ స్టేషన్‌లోని ఫిల్లింగ్ పాయింట్స్ నిర్మాణ పద్ధతి వల్ల ఒక ట్యాంకర్ నింపడానికి 15 నిమిషాలు పడుతుంది. తగిన ఏర్పాట్లు చేయడం వల్ల ఈ ఫిల్లింగ్ సమయాన్ని 5 నిమిషాలకు తగ్గించుకుంటే అనుకున్నదాని కంటే రెట్టింపు ట్రిప్పులు సరఫరా చేయవచ్చని అంచనా వేశారు. దీని వల్ల వెయిటింగ్ పిరియడ్, పెండెన్సీ తగ్గడంతో పాటు, ప్రజలకు సకాలంలో నీరు సరఫరా చేయవచ్చు. గతేడాది భూగర్భజలాలు అడుగంటడంతో ఫిబ్రవరి నెలలో ట్యాంకర్లకు డిమాండ్ పెరగడం ప్రారంభమైంది. ఏప్రిల్ నెలలో డిమాండ్ తారస్థాయికి చేరి లక్షా 70 వేల ట్యాంకర్లు డెలివరీ చేసే పరిస్థితి వచ్చింది. ఈ సారి అలాంటి సమస్యలు రాకుండా తగిన ఏర్పాట్లు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సీజీఎం ప్రభు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాలకు ఓబన్న వీర గాధను అందించాలి

ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : భవిష్యత్తు తరాలకు వడ్డే ఓబన్న వీర గాథ అందించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వడ్డెర ఓబన్న 218వ జయంతి సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్‌బెల్ట్‌లో వారి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ళలో అధికారికంగా వడ్డే ఓబన్న జయంతి నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది ఆయన గుర్తు చేశారు. బహుజన యుద్ధ వీరుల సహాస గాథలను మనం స్మరించుకోవాలని వారు ప్రజలకోసం చేసిన త్యాగాలను సదా గుర్తుంచుకోవాలి అని ఆయన చెప్పారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్‌లో 5 మంది విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి పునాది రాయి వేసిన వడ్డెర జాతి అభ్యున్నతికి అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు.

మహబూబ్ నగర్ పట్టణం డైట్ కళాశాల జన్ను రాఘవులు ఆశయాలను కొనసాగించండి...

జన్ను రాఘవులు ఆశయాలను కొనసాగించండి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ జన్ను రాఘవులు జ్ఞాపకార్థం వారి సతీమణి ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రిన్సిపాల్ బ్లాక్ పునర్నిర్మాణం చేయించారు. పునర్నిర్మాణం చేసిన ప్రిన్సిపాల్ బ్లాక్ రూంను ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాఘవులు పేరు పదికాలాల పాటు నిలిచే విధంగా, ఆయన విద్యాభివృద్ధికి చేసిన సేవను కొనసాగింపుగా వారి పేరుతో ప్రతి సంవత్సరం కొందరిని గురించి ఉత్తమ ఉపాధ్యాయు లుగా సన్మానిస్తే వారి స్ఫూర్తిని పొంది వారు కూడా విద్యాభివృద్ధికి కృషి చేస్తారని ఆయన చెప్పారు.

రజకులకు అండగా ఉంటా...

రజకులకు అండగా ఉంటానని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రజకుల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ మాడివాల మాచయ్య జయంతి సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాడివాల మాచయ్య ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా అద్భుతంగా మహిళలు ముగ్గులు వేశారన్నారు. నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, సంజీవ్ ముదిరాజ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, డిసిసి కార్యదర్శి టంకర కృష్ణయ్య, పట్టణ క్రిస్టియన్ మైనారిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామ్యూల్ దాసరి, వడ్డెర సంఘం అధ్యక్షులు పిట్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానం అత్యంత ప్రమాదకరం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాజ్యాంగ స్ఫూర్తికి అంత్యంత ప్రమాదకరంగా జాతీయ నూతన విద్యా విధానమని, దీని రద్దుకై విద్యార్థులు ఉద్యమించాలని, ఫిబ్రవరి 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక హైదరాబాద్ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాల కరపత్రాలను ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాస్ రావు, జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ స్టాలిన్‌లు కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం జాతీయ నూతన విద్యావిధానం-2020 పేరుతో విద్యను పూర్తిగా తమ ఆధిపత్యంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తూ విద్య కేంద్రీకరణ, కార్పోరేటీకరణ, వ్యాపారీకరణను, కాషాయికరణను ప్రోత్సహించే నిర్ణయాలు చేస్తున్నదని, నేడు దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తీసే ప్రయత్నం కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వం చేస్తున్నాదని ఆయన విమర్శించారు. యూనివర్సిటీలను మూడు, నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను కార్పోరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేస్తుందని దానికి నిదర్శనం మొన్న విడుదల చేసిన 'యూజీసీ' ప్రతిపాదనలని ఆయన అన్నారు. ఈ విధానాలు ప్రభుత్వం విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని అయన ఆరోపించారు. నూతన విద్యావిధానం, విశ్వవిద్యాలయాల ఫండ్ కట్స్, ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, ఖాళీలు భర్తీ చేయకుండా ఉండడం, యూనివర్సిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడంపై ఉద్యమించాలని ఆయన కోరారు. నూతన జాతీయ విద్యా విధానంలో ఎక్కడ కూడా ఉచిత విద్య అనే పదాన్ని కూడా పొందుపరచకుండా నూతన జాతీయ విద్యా విధానంలో పేదవారికి ఉచిత విద్యా లేనట్టేనని అయన పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలలో ప్రజాస్వామ్యం, సెక్యులర్ పదాలను, డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించి దాని స్థానంలో బ్రిటిష్ ముష్కర్లకు తొత్తగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్, హెడ్గ్వార్, వీర సావర్కర్ మొదలగు వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. విభిన్న జాతులు కలిగిన వారు భారతదేశంలో ఉన్నారని, భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశంలో ఒక కులాన్ని, ఒక మతాన్ని ప్రోత్సహించే బిజెపి భారతదేశ చరిత్రను వక్రీకరిస్తున్నది అయన అన్నారు. తక్షణమే జాతీయ నూతన విద్యా విధానాన్ని ఉపసహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. జాతీయ నూతన విద్యా విధానం రద్దుకై విద్యార్థులు ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ.స్టాలిన్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ముగింపు దశకు వస్తున్న ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా 7850 వేల రూపాయల స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, విద్యా శాఖ మంత్రిని కూడా నియమించలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. దేశ వ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై చర్చించేందుకు ఫిబ్రవరి 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు వేదిక కానున్నాయని, ఈ జాతీయ సమితి సమావేశాలను విజయవంతం చేయడం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంత రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి, రాష్ట్ర నాయకులు వంశీ వర్ధన్ రెడ్డి, ఎండి అన్వర్, చైతన్య యాదవ్, హరీష్, అరుణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ డీఎన్ఏలోనే విద్వేషం

యాదాద్రి - భువనగిరి బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై దాడిని ఖండించిన ఎమ్మెల్సీ కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండిస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏలోనే ద్వేషం, హింస, విధ్వంసం ఉందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ప్రోద్భలంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోతున్నారని విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ నాయకులు ఇలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడడం దుర్మార్గమని స్పష్టం చేశారు. భౌతిక దాడులతో గులాబీ సైనికులను భయపెట్టలేరని తేల్చిచెప్పారు. ఈ దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. రాహుల్ గాంధీ వల్లించే మొహబ్బత్ కి దుకాన్ ఒక బూటకమని తేటతెల్లమైందని, అది విద్వేషం, హింసను ప్రేరేపించే దుకాణమని ధ్వజమెత్తారు. ఇలాంటి హింసా రాజకీయాలను తెలంగాణ తిరస్కరిస్తుందని, హింసకు, విధ్వంసకర చర్యలకు తెలంగాణలో తావు లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన యువజన విభాగాన్ని గూండాల విభాగంగా తీర్చిదిద్దుతోందని మండిపడ్డారు. యాదాద్రి భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ జరిపిన దాడి వారి అసలు రంగును బట్టబయలు చేసిందని, కాంగ్రెస్ విష సంస్కృతికి ఇదొక నిదర్శనమని చెప్పారు. ఇలాంటి సిగ్గుమాలిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధిచెబుతారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

విశాలాంధ్ర - హైదరాబాద్ : యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడి హేయనీయమని మాజి మంత్రి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మోసపు హామీలతో గద్దెనెక్కిన నాటి నుంచి ఇచ్చిన హామీలు అమలు చేయలేక 6 గ్యారెంటీలపై ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యాలయాలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ దాడులకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యన్ని పాతరేస్తూ హింసను ప్రేరేపిస్తుందని ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపుతప్పిందని, హెూంశాఖ తన వద్దే ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హింసను ప్రోత్సహిస్తున్నారా అంటూ ఆయన ప్రశ్నించారు.

మాట్లాడితే ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ మంత్రులు, నాయకులు దాడులకు పాల్పడడమే ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలనా సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్ట్ చేయాలనీ ఎమ్మెల్యే వేముల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూమిని కాపాడాలి...

విశాలాంధ్ర - మేడిపల్లి : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్లో బిస్కెట్ గోడౌన్ అనుకోని ప్రభుత్వ భూమిని స్థానిక కార్పొరేటర్ ఆధ్వర్యంలో కబ్జా చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనారిటీ అధ్యక్షులు అఫ్జల్ ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కబ్జా కోరల నుండి ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మైనారిటీ సోదరి సోదరీమణులతో కలిసి జిల్లా కలెక్టర్, రాష్ట్ర ముఖ్యమంత్రికి పిర్యాదు చేస్తామని అన్నారు.

స్వాతంత్ర పోరాటంలో వడ్డే ఓబన్న పాత్ర చిరస్మరణీయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారిపై వడ్డే ఓబన్న జరిపిన పోరాటం వీరోచితమని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరవన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడ్డె ఓబన్న, ఒక గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు అని అయన చరిత్ర చిరస్మరణీయమని, ఓబన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి వ్యక్తిగత సైనికునిగా ఉండి, బ్రిటీషు వారిపై జరిపిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చెప్పారు. అలాంటి మహనీయుని చరిత్ర పుస్తక రూపంలో రావడం ఎంతో హర్షణీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆర్.కోటజీ, బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఆశన్న, నర్సింలు, సంజీవులు, కృష్ణమాచారీ, నీరజ రెడ్డి, సహాయ బీసీ సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత అభయ హస్తం పథకం అమలు హర్షణీయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగా నైనా సరే చేనేత అభయహస్తం పథకం అమలుకు విధివిధానాలు రూపొందించి ఉత్తర్వులు జారీ చేయడం పట్ల తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హర్షం వ్యక్తం చేశారు. నిర్వీర్యం అవుతున్న సహకార వ్యవస్థను కాపాడేందుకు తక్షణమే చేనేత సహకార సంఘాలకు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేతన్నల అభివృద్ధికి సంక్షేమానికి తగిన చర్యలు చేపట్టాలని నేతన్న పొదుపు (త్రిఫ్ట్) పథకాన్ని, నూలు సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించాలని, నేతన్న బీమా, తదితర సంక్షేమ పథకాలను అమలు చేయాలని చేనేత కార్మిక సంఘాలు ప్రభుత్వంపై చేసిన ఒత్తిడి ఫలితంగా ఎట్టకేలకు ప్రభుత్వం అమలుకు ఉత్తర్వులు చేసిందన్నారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి కార్మికుల సంక్షేమానికి వేయి కోట్ల రూపాయలతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, నేతన్నలు ఉత్పత్తి చేసిన వస్త్రాలన్నింటినీ టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని, నేతన్నల అన్ని రకాల రుణాలు మాఫీ చేయాలని, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలకు అనుగుణంగా నేతన్నల కూలి రేట్లు పెంచాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నేతన్నలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సహకార వ్యవస్థను పటిష్టం చేసేందుకు చేనేత సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించేందుకు కాలయాపన చేయకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకున్న కొలను

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: శ్రీ సీతారామచంద్రస్వామి వారి కృప కటక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులు, ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని దర్శించుకుని, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు. అదేవిధంగా 11వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలూరు సత్య పుట్టినరోజు సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పిఎస్.రావు, రాజు, శ్రీనివాసరాజు, ప్రశాంత్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌కు సర్వం సిద్ధం

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో 13 నుంచి 15 వరకు నిర్వహణ

పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంతర్జాతీయ వేడుకకు హైదరాబాద్ సిద్ధమవుతోంది. సంక్రాంతి పండగ సందర్భంగా జనవరి 13, 14, 15 తేదీల్లో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 7వ అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను నిర్వహించేందుకు పర్యాటక, సాంస్కృతిక శాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఈ సందర్భంగా బేగంపేట్ హరిత ప్లాజాలో పర్యాటక, సాంస్కృతిక శాఖ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటర్నేషన్ కైట్, స్వీట్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు స్వీట్ స్టాల్స్‌ను మంత్రి సందర్శించి, వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు తమ ఇంట్లోనే తయారు చేసిన సాంప్రదాయ మిఠాయిల రుచి చూశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేలా అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తామని అన్నారు. హైదరాబాద్ ఓ మినీ ఇండియా అని, దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా కాస్మోపాలిటన్ సిటీలో స్థిరపడ్డారని వెల్లడించారు. 3 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో 16 దేశాల నుంచి 47 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్, 14 రాష్ట్రాల నుంచి 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు, పాల్గొని పలు డిజైన్లలో రూపొందించిన పతంగులను ఎగుర వేస్తారని తెలిపారు. వీటితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్వీట్లను, తెలంగాణ పిండి వంటలను స్టాళ్లలో అందుబాటులో ఉంచుతారని పేర్కొన్నారు. తెలంగాణలోని చారిత్రక ప్రదేశాలు, వారసత్వ కట్టడాలు, ప్రాచీన దేవాలయాలను సందర్శించాలని కోరారు. తెలంగాణ టూరిజం శాఖ అందుకు తోడ్పాటును అందిస్తుందని అన్నారు. పర్యాటక ప్రదేశాలను సందర్శించడం వల్ల ఆ ప్రాంత చరిత్ర సంస్కృతి, సాంప్రదాయాలు తెలుసుకోవడం పాటు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. వీక్షకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. రాబోయే రోజుల్లో కైట్ స్వీట్ ఫెస్టివల్‌ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామని పేర్కొన్నారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడుతూ... భారతదేశంలోనే కాదు, ప్రపంచంలో కూడా ఇలాంటి ఫెస్టివల్ ఎక్కడ నిర్వహించరని, అదే తెలంగాణ ప్రత్యేకతని అన్నారు. కైట్ ఫెస్టివల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు హస్తకళలు, చేనేత వస్త్రాల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ సంవత్సరం కైట్ ఫెస్టివల్‌కు మూడు రోజుల్లో 15 లక్షల మంది దాకా వస్తారని అంచనా ఉంది. ప్రదర్శన తిలకించటానికి వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జీహెచ్ఎంసీ, పోలీసు, ఇతర శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు కొండిబా, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్. డి.సోలంకి, క్లిక్ కన్వీనర్ లిబి బెంజిమన్, దేశీయ, అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యాస ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ మెగా థియేటర్ ప్లే

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : అభ్యాస ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్, 28వ బటిక్ బోర్డింగ్ స్కూల్ వార్షిక పాఠశాల హేమంత్ ఉత్సవ్‌లో భాగంగా కళా వేదికలో మెగా థియేటర్ ప్లే (నాటిక) సంవిధాన్‌ఏ 75 నిర్వహించారు. సీఈఓ, ఫౌండర్ డైరెక్టర్ వినాయక కళ్లెట్ల తన ప్రారంభ ప్రసంగంలో మాట్లాడుతూ విద్య అనేది కేవలం పాఠశాలలు, కళాశాలలకే పరిమితం కాదని, ఇది జీవితకాలం అభ్యసమని, కోవిడ్ అనంతరం రెసిడెన్షియల్ స్కూల్ విద్య క్షీణిస్తోందని ఆయన విచారంగా వెలిబుచ్చాడు. సమయాన్ని ఆదా చేయడం, బాగా చదువుకోవడానికి సమయాన్ని పొందడం వంటివి రెసిడెన్షియల్ విద్యలో నున్న ప్రయోజనాలు ముఖ్యంగా బాల్య సైబర్ నేరాలు పెరుగుతున్నప్పుడు రెసిడెన్షియల్ పాఠశాలల్లో వారు మరింత సురక్షితంగా ఉంటారన్నారు. పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ ప్రసంగిస్తూ, 'మార్కులు' ముఖ్యం కాదని, సమాజంలో తమ 'మార్క్'ను వదిలివేసే విద్యార్థులు మనకు అవసరమన్నారు. విద్యార్థులు మార్కులు తెచ్చే యంత్రాలు కాదు. వారికి మానవీయ విలువలు, సంబంధాల పట్ల గౌరవం నేర్పాలి. వారు మన ప్రాచీన విలువలు, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను అలవర్చుకోవాలన్నారు.

ఏఐవైఎఫ్ నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో నూతన సంవత్సర 2025 కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్రలు మాట్లాడుతూ యువజన, విద్యార్థి సమస్యల పరిష్కార అజెండానే ఏఐవైఎఫ్ ప్రధాన కర్తవ్యమని వారు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువజన అభివృద్ధి కోసం, ఉపాధి అవకాశాలు కల్పన కోసం నిర్దిష్టమైన విధానాలు అవలంబించాలని వారు కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతం ద్వారానే దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని వారు ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ టి.సత్య ప్రసాద్, శ్రీమాన్, పేరబోయిన మహేందర్ కార్యవర్గ సభ్యులు సల్మాన్ బేగ్, మస్కు సుధీర్, శివ కుమార్, నవీన్, జగదీష్, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గుర్తించడానికి సర్వే

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంది రమ్మ ఇళ్ల సర్వేని, జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్‌గూడా డివిజన్లోని శ్రీకృష్ణనగర్, వెంకటగిరిలో లబ్ధిదారులను గుర్తించడానికి శనివారం జీహెచ్ఎంసి సర్కిల్ 19 సిబ్బందితో పాటు, యూసఫ్ గూడా డివిజన్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఫెరోజ్ ఖాన్‌తో కలిసి ఇంటింటికి తిరిగి సుమారు 200 మందిని కలసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే బస్తీల్లో ఎలాంటి సమస్య వచ్చినా తనను సంప్రదించాలని కోరారు.

మోకుదెబ్బ నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన టీపీసీసీ అధ్యక్షులు

విశాలాంధ్ర- బషీర్ బాగ్: గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జాతీయ కమిటీ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ టీపీసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా రవీంద్ర భారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులకు కాంగ్రెస్ పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాలను విడుదల చేసి భాదిత కుటుంబాలకు అందజేస్తామన్నారు. అనంతరం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ది రాములు గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి హైకోర్ట్ న్యాయవాది బాలసాని సురేష్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం నర్సింలు గౌడ్ రాష్ట్ర నాయకులు వేంపల్లి సంతోష్ గౌడ్, అంబాల వేణు గౌడ్ బొజ్జా చిన్న గౌడ్, సూదుల భూమేష్ గౌడ్, బండకింది రామ గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీలో రూ.2 కోట్ల 2 లక్షల అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ వజ్రేష్ యాదవ్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి తదితరులతో కలిసి మున్సిపాలిటీలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎప్పుడు లేని విధంగా ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెడుతుందని చెప్పారు. సీఎం అమలుపరుస్తున్న 6 గ్యారంటీలు దేశంలో ఎక్కడ లేవని చెప్పారు. జనవరి 26 నుండి రైతు భరోసా అందిస్తున్నట్లు వెల్లడించారు.

గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలలోనూ మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం ఎన్ని నిధులైన ఇస్తుందని మహేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలని అన్నారు. ఘట్కేసర్‌లో త్వరలో మరిన్ని నిధులతో మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చేస్తున్నట్లు మహేందర్ రెడ్డి వెల్లడించారు.

అధికారికంగా జయపాల్‌రెడ్డి జయంతి వేడుకల నిర్వహణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : మాజీ కేంద్ర మంత్రి ఎస్.జయపాల్ రెడ్డి జయంతి వేడుకలను అధికారికంగా ప్రభుత్వం చేపట్టనున్నట్లు హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఇలాంబర్తి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంత్ అన్నారు. ఈనెల 16 జయంతి వేడుకల నేపథ్యంలో నెక్లెస్ రోడ్‌లో గల జయపాల్ రెడ్డి స్మార్తి స్థల్‌లో చేపట్టే జయంతి వేడుకల ఏర్పాట్లపై శనివారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రోటోకాల్ తప్పక పాటించాలని, సమాధిని పూలతో సుందరికరణ చేయాలని అలాగే అతిథులు, ముఖ్యతిథులకు ఎక్కడకూడా ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. వేడుకల నేపథ్యంలో స్మార్తి స్థల్‌లో నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలని అలాగే సౌండ్ ప్రూఫ్ జనరేటర్‌ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. జనవరి 14 సాయంత్రం వరకు లైటింగ్ ఏర్పాటు చేయాలని, పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలని, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే వచ్చే అతిథులు, మీడియా పాయింట్ వద్ద వాటర్ ప్రూఫ్ టెంట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. త్రాగునీరుతో పాటు మెడికల్ స్టాల్, అంబులెన్సును అందుబాటులో ఉంచాలని అన్నారు. ఎంట్రీ అండ్ ఎగ్జిట్ గేట్లలో ఇబ్బంది కలగకుండా పోలీసులను ఉంచాలని, వచ్చే వాహనాలను పార్కింగ్‌లోకి పంపాలని సూచించారు.

జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ రఘు వీర్, విద్యుత్ శాఖ ఎస్.ఈ వెంకన్న, డిఎంహెచ్ఓ డా.వెంకటి, ఆర్‌డిఓ సాయిరామ్, డి.ఈ ఆర్ అండ్ బి శాఖ సంతోష్, తహసీల్దార్ నయీముద్దీన్, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో కింగ్ ఫిషర్ బీర్లను నిషేధించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలుగు రాష్ట్రాల్లో కింగ్ ఫిషర్ బీర్లపై నిషేధం విధించి ప్రజల ఆరోగ్యం, ఆర్థిక సంక్షేమం ప్రాచీన సంప్రదాయాలను కాపాడటానికి కల్లు, నీరా ఉత్పత్తులను ప్రోత్సహించాలని బిసి పొలిటికల్ జెఏసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచాల మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కింగ్ ఫిషర్ సంస్థకి అనుకూలంగా తీసుకున్న నిర్ణయాల వల్ల మోనోపలి ఏర్పడిందని, దీనివల్ల స్థానికంగా నాణ్యమైన బీర్లను ఉత్పత్తి చేసే చిన్న కంపెనీలకు మార్కెట్లో నిలదొక్కుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ తల బిరుసుతోనే ఏకంగా ప్రభుత్వాన్ని బెదిరించే స్థాయికి యూబీ గ్రూపు వచ్చిందన్నారు. తమకు మిగలడం లేదని కంపెనీ గగ్గోలు పెడుతుందని, ఎక్కువ ఖర్చు లేకుండా తయారయ్యే బీరుకు 18 శాతం సరిపోవడం లేదా అని ప్రశ్నించారు. బ్లాక్ మెయిల్ చేసి.. ధరలు పెంచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుందని, మార్కెట్ లో అంతకంటే తక్కువ ధరకు.. ఎక్కువ నాణ్యమైన బీర్లు సరఫరా చేసే కంపెనీలు బోలెడు ఉన్నాయని, మోనోపలి ఏర్పడటం వల్ల చాలా కంపెనీలు తెలంగాణలో అమ్మకాలు చేయలేకపోతున్నాయన్నారు. ప్రభుత్వ రాయితీలపై నడిచే కంపెనీలు ప్రభుత్వాలను బెదిరిస్తే చూస్తూ ఊరుకోబోమని, కంపెనీ ఒత్తిడితో ధరలు పెంచి.. ప్రజలపై భారం మోపవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో మద్యం దుకాణాల సిండికేటుతో కొన్ని బ్రాండ్లతో మాత్రమే మద్యం అమ్మకాలు జరిపారని, దీనివల్లనే కింగ్ ఫిషర్ కృత్రిమ కొరత సృష్టించి మార్కెట్లో మోనోపలికి కారణమైందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ ఛైర్మెన్ గాలిగల్ల సాయిబాబా బిసి పొలిటికల్ జెఏసి నాయకులు వనం తిరుపతయ్య యాదవ్, గుర్రం రాఘవేందర్ గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాలతోనే దాడి: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాలతోనే కాంగ్రెస్ నేతలు ఈ భౌతిక దాడులకు తెగబడుతున్నారని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హెూంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి ఆదేశాలతోనే కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోయి, ఇలాంటి దాడులకు తెగబడుతున్నారు. కాంగ్రెస్ చేసిన మోసాలపై జిల్లాపార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేకే ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడ్డారన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను నమ్మించి నయవంచన చేసిన మీ పాలనను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం.. పాలనా వైఫల్యాలను ఎత్తిచూపిన ప్రధాన ప్రతిపక్షంపై దాడులు చేయడమే ఇందిరమ్మ రాజ్యమా అన్నారు. పదేళ్లపాటు ప్రశాంతంగా కొనసాగిన తెలంగాణ రాష్ట్రం, ఈరోజు అరాచకాలకు చిరునామాగా మారిందని, దాడులు, గుండాగిరి తమ మార్కు పాలన అని కాంగ్రెస్ పార్టీ మరోసారి నిరూపించుకుంటుందన్నారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపైన దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ అలవాటుగా మారిందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అరాచక శక్తులకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందనీ, ఇందిరా రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో గూండారాజ్యం చలాస్తుందన్నారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుని ఫోజులు కొట్టే రాహుల్ గాంధీకి, రేవంత్ సర్కారు పాలనలో సాగుతున్న ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు కనిపించడం లేదా అన్న కేటీఆర్, రాహుల్ గాంధీ ఇప్పటికైనా తమ హిపోక్రసీని కట్టిపెట్టి, గుండాల చేతిలో చిక్కిన తెలంగాణ కాంగ్రెస్ సర్కారును సరిదిద్దాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలన్నారు. ఎన్నుకున్న ప్రజలతోపాటు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ కార్యకర్తలపై, నాయకులపై, పార్టీ కార్యాలయాల పైన దాడులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కార్యాలయానికే రక్షణ లేకపోతే ఇక రాష్ట్రంలో పరిశ్రమలకు, పెట్టుబడులకు, మారుమూల పల్లెల్లో నివసిస్తున్న పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందన్నారు. ఇలాంటి దాడులతో బీఆర్ఎస్ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయాలని చూడటం ముఖ్యమంత్రి అవివేకం అన్న కేటీఆర్, సమైక్యరాష్ట్రంలో ఇంతకన్నా వందరెట్ల అణచివేతను, నిర్బంధాన్ని, దాడులను తట్టుకుని నిలబడిన తెలంగాణ ప్రజల గుండెచప్పుడుగా బీఆర్ఎస్ నిలిచిందన్నారు. మా పార్టీ కార్యకర్తల జోలికి, కార్యాలయాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. వెంటనే బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలతో పాటు, వారి వెనుక ఉన్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించుకున్న రాష్ట్రాన్ని కంటికి రెప్పలా కాపాడుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉంటామని కేటీఆర్ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యం : కొలను

విశాలాంధ్ర-దుండిగల్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 డివిజన్ సుభాష్ నగర్ పరిధిలోని కృషి కాలనీ సాయి బాబా నగర్ నందు కమ్యూనిటీ హాల్ కొరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చొరవతో ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా 10లక్షల మంజూరు అయిన సందర్భంగా శనివారం కమ్యూనిటీ హాల్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కృషి కాలనీ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ కొలను హన్మంత్ రెడ్డిని శాలువాలతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్ రెడ్డి, మాజీ ప్రెసిడెంట్ మాజిద్ పాషా, రాజి రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆనంద్, అంజి రెడ్డి, నర్స గౌడ్, సత్తి రెడ్డి, శాంతయ్య స్వామి, ప్రభాకర్, రామ్ రెడ్డి, మురళి, గోపాల్, సిద్ది రాములు, 130 డివిజన్ అధ్యక్షులు సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, హరి కిరణ్, ద్వారంపూడి నాగిరెడ్డి, నగేష్ రెడ్డి, గురువ రెడ్డి, కరణ్, రాజు చారి, యూసుఫ్, నాగేంద్ర, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్ వేడుకలను ప్రారంభించిన నెమలి

విశాలాంధ్ర - కాప్రా : కాప్రా సర్కిల్ హెచ్‌బి కాలనీ డివిజన్ అన్నపూర్ణ కాలనీలోని శ్రీ నికేతన్ హైస్కూల్‌లో విద్యార్థులు నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ వేడుకలను గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ముఖ్యఅతిధిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు తనలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, స్కూల్ కరెస్పాండెంట్ చిక్క నర్సింహా, ఇంచార్జి టీచర్స్ ఎం.రేణుక, లావణ్య వర్మ, మంజుల, మల్లాపూర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి టి.శ్రీకాంత్ రెడ్డి, పిఆర్ ప్రవీణ్, రవి, హరికృష్ణ, సంపత్, స్కూల్ యాజమాన్యం కాలనీ స్థానికులు పాల్గొన్నారు.

బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కండమూరి బ్రహ్మయ్య

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కండమూరి బ్రహ్మయ్యను నియమిస్తూ నియామక పత్రాన్ని మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మెట్టుకాడి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ కుల వృత్తులలో ఇతర కుల మతాల జోక్యం సబబు కాదని, కులవృత్తుల కాపాడేందుకు సామాజిక ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ మహాసభ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి రామచంద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మెట్టుకాడి శ్రీనివాస్ రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీసీల సాధికారత కు అభివృద్ధికోసం బీసీ సామాజిక వర్గాల కుల వృత్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందన్నారు. బీసీల కులవృత్తులో ఇతర కుల మతాల జోక్యం సబబు కాదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షులు మెట్టుకాడి శ్రీనివాస్‌కు కండమూరి బ్రహ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు గజగౌని కురుమయ్య గౌడ్, సిద్ధి రామప్ప హరిప్రకాష్ గౌడ్, మేదర ఆంజనేయులు, రాములు మెట్టుకాడి, శ్యాం, సుబ్రహ్మణ్యం, యాదగిరి, లక్ష్మయ్య రజక, విష్ణు, పిల్లి శ్రీహరి, దత్తు, రమేష్, గౌలి ఆనంద్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు గాంధీ బహుమతుల ప్రదానం



విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకే ఎన్‌క్లేవ్ కాలనీలో కేకే డిజిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బలగం మూవీ ఫేమ్ సంజయ్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముగ్గులను తిలకించి, మహిళ సోదరీమణులను అభినదించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలలో మహిళ సోదరీమణులు భాగస్వాములు కావడం అభినందనీయం అని, మన సంస్కృతీ సంప్రదాయాలను, సంక్రాంతి పండుగ విశిష్టతను నేటి తరం వారికి తెలియచేయడం ఈ ముగ్గుల పోటీ ప్రత్యేకత అని, దీనిని నిర్వహించిన కేకే డిజిటల్ సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించడం చాలా అభినందనీయమని తెలియచేసారు. సంక్రాంతి వాతావరణం ముందే వచ్చినట్టు కనిపిస్తుందని, సంక్రాంతి పండుగను పల్లె వాతావరణంను ప్రతిబింబించేలా ఈ ముగ్గులు ఎంతగానో గొప్పగా వర్ణించారని, సంక్రాంతి పర్వదినంను ప్రతిబింబించేలా చిత్రపటంతో వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి అని, వాటిని వేసిన వారిని ప్రత్యేకంగా అభినదించడం జరిగింది. అదేవిధంగా చూడచక్కని ముగ్గులు వేయడం చాలా గొప్ప విషయం అని, ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించిన కేకే డిజిటల్, మహిళ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చంద్రిక ప్రసాద్ గౌడ్, నరేందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సుప్రజ, నరేష్, శివ, శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్, చందు, కల్పన, లత, లక్ష్మీ మహిళలు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై వ్యాఖ్యలు అమానుషం

- అమిత్‌షా క్షమాపణ చెప్పాల్సిందే
- వక్తల డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అమానుషమని వక్తలు మండిపడ్డారు. బాధ్యతగల పదవిలో ఉండి నీతిమాలిన అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని, ఇలాంటి నాయకులు దేశ ప్రజలకు ఏమి మేలు చేస్తారని ప్రశ్నించారు. అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి...కేంద్ర హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే రాజ్యాంగానికి రక్షణ ఉంటుందని చెప్పారు. అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి అధ్యక్షత వహించారు. షర్మిల మాట్లాడుతూ అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలపై అధికార టీడీపీ, జనసేన, ప్రతిపక్ష వైసీపీ స్పందించకపోవడం

దారుణమని విమర్శించారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలందరూ బీజేపీకి మద్దతు పలుకుతున్నారని చెప్పారు. చివరకు వైసీపీ కూడా బీజేపీవైపు ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా బీజేపీకి ఎందుకు మద్దతిస్తున్నారని రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలను షర్మిల ప్రశ్నించారు. బీజేపీ మతతత్వ పార్టీ అని విమర్శించారు. మతం, కులం పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని, మసీదులను, చర్చిలను ధ్వంసం చేయడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. దేశ సంపదను అదానీ లాంటి వ్యాపారవేత్తలకు దోచిపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ బీజేపీ తమ గుప్పెట్లో పెట్టుకుందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను దేశ ద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. గాంధీ హంతకులకు గుడులు కడుతోందన్నారు. రాష్ట్రంలో బీజేపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లోనే ఉందని వ్యాఖ్యానించారు. తిరుపతిలో తొక్కిసలాటలో మృతిచెందిన కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే భక్తులు చనిపోయారని ఆమె ఆరోపించారు.

బీజేపీ అంటే బాబు, పవన్, జగన్‌కు భయం: రామకృష్ణ

భారత రాజ్యాంగంపై బీజేపీకి గౌరవం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బీజేపీకి కావలసింది మనుస్మృతి రాజ్యాంగమని, ఈ విషయాన్ని బీజేపీ నేతలు బహిరంగంగా చెబుతున్నారని, అందుకే అంబేద్కర్‌ను అవమానిస్తున్నారని రామకృష్ణ మండిపడ్డారు. బీజేపీకి స్వాతంత్ర్య సమరయోధులంటే లెక్క లేదని, స్వాతంత్ర్య పోరాటంతో కాషాయపార్టీకి సంబంధమే లేదన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాల అమలే బీజేపీ లక్ష్యమన్నారు. పార్లమెంట్ వేదికగా అంబేద్కర్‌కు ఘోర అవమానం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబానీ, అదానీకి దేశాన్ని దోచిపెట్టి రాజకీయాలను భ్రష్టు పట్టించారన్నారు. చంద్రబాబు, పవన్, జగన్... మోదీ తొత్తులేనని రామకష్ణ విమర్శించారు. బీజేపీకి బాబు, పవన్, జగన్ భయపడుతున్నారన్నారు. సమావేశంలో సీపీఎం నేత సీహెచ్ బాబురావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కాంగ్రెస్, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

విభజనతో ఆంధ్రాకు అన్యాయం

అభివృద్ధి బాధ్యత కూటమిదే: కిరణ్‌కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): రాష్ట్ర విభజనతో ఆంధ్రకు అన్యాయం జరిగిందని, కూటమి ప్రభుత్వం అభివద్ధికి కృషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రముఖ సోషలిస్టు నాయకులు, సమతా పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు వీవీ కృష్ణారావు అధ్వర్యంలో రిటైర్డ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ ఏబీ వెంకటేశ్వరరావు అధ్యక్షతన 10వ ఆదర్శ సంక్రాంతి ఆత్మీయ కలయిక పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో శనివారం జరిగింది. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కృష్ణా డెల్టా గోదావరి జలాలకు వరల్డ్ బ్యాంకు ద్వారా రూ.1200 కోట్లు మంజూరు చేయించారని గుర్తు చేశారు. బ్రిజేష్ కుమార్ కమిటీ... రైతులకు లాభనష్టాలు, సమైక్యాంధ్ర ఉద్యమం తదితర అంశాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. 1969 ఉద్యమ సమయంలో ఆంధ్ర ప్రజలు 7శాతం కాగా ప్రస్తుతం 30 శాతం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన తనను ఎంతో బాధకు గురిచేసిందని పేర్కొన్నారు. కృష్ణారావు ఆశయ సాధనకు ఆత్మీయ కలయిక వేదికతో ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ కృష్ణారావు అందరికీ స్ఫూర్తినిచ్చారని, కృష్ణా డెల్టా ఉద్యమ విజయానికి ముందు ఉండి నడిపించారని, ఆయన పట్ల ఆత్మీయ భావం, గురు సంబంధం ఉందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఐక్య ఉద్యమాలు అవశ్యం: రామకృష్ణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ఐక్య ఉద్యమాలు అవసరమని అన్నారు. కృష్ణారావు ఇండియన్ పీపుల్స్ పార్టీ జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్నా... సామాన్య వ్యక్తిగా ప్రజల మధ్య నిలిచారని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధికి అమరావతితో పాటుగా పోలవరాన్ని నిర్మించి బహుళ ప్రయోజనాలకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆత్మీయ కలయిక బాధ్యతలను సంతోషంగా స్వీకరిస్తానని హామీ ఇచ్చారు. తొలుత హైకోర్టు న్యాయవాది రవితేజ పదిరి మాట్లాడుతూ విభజన తరువాత ఇప్పటికీ ఏపీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, ఆంధ్రుల భవిష్యత్తు కోసం అభివృద్ధితో కూడిన అభ్యుదయ ప్రణాళికలు సిద్ధం చేసుకునేందుకు సన్నద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు డి.హరి నాథ్, కాంగ్రెస్ నాయకులు కొలనుకొండ శివాజీ, వైసీపీ నేత ఎన్.రాజారెడ్డి, పౌర హక్కుల సంఘం నేత వి.ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు అక్కినేని భవాని ప్రసాద్, ప్రముఖ ప్రవాసాంధ్రులు కోమటి జయరామ్, నల్లమోతు చక్రవర్తి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు, బలరామయ్య, తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ ప్రసంగించారు. నిర్వాహకులు టి.దామోదర్, గెజిటెడ్ అధికారుల సంఘం నేత కేవీ కృష్ణయ్య, విశాలాంధ్ర మహాసభ శ్రీనివాసరెడ్డి, బీజేపీ నాయకులు నందిగం కిషోర్, సామాజిక కార్యకర్తలు ఎన్‌పీ సురేశ్, గొల్లమూడి కిషోర్, రాజకీయ పార్టీలు, అస్తిత్వ ఉద్యమాల ప్రతినిధులు, కార్మిక కర్షక నాయకులు, సామాజిక కార్యకర్తలు, పౌర హక్కుల ఉద్యమకారులు ఆలోచనలను పంచుకున్నారు. అనంతరం ఇటాలియన్స్‌కు చెందిన దావా బృందం ముద్రించిన పుస్తకాన్ని కిరణ్‌కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. రంగం రాజేశ్ అధ్వర్యంలో జరిగిన జానపద, అభ్యుదయ గీతాలు, నృత్యాలు ఆహూతులను అలరించాయి. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

'మ్యాన్స్ సెర్చ్ ఫర్ మీనింగ్' పుస్తకం ఎంతో ఇష్టం

ఉప ముఖ్యమంత్రి పవన్ బుక్ ఫెస్టివల్ సందర్శన

విశాలాంధ్ర-విజయవాడ: తనకు 'మ్యాన్స్ సెర్చ్ ఫర్ మీనింగ్' పుస్తకం తనకు ఎంతో నచ్చుతుందని, డాక్టర్ విక్టర్ ఈ.ఫ్రాంకిల్ రాసిన ఈ పుస్తకం చదివితే నిరాశానిస్పృహలు అధిగమించి ఆశావాద భావన కలుగుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో నాజీల నిర్బంధాల్లో ఉన్న ఫ్రాంకిల్ ... ఎలా భవిష్యత్ జీవితాన్ని నిలుపుకున్నాడో ఆ రచన తెలుపుతుందని ఆయన తెలిపారు. బహుమతిగా ఇవ్వడానికి ఉంటాయని ఎక్కువ సంఖ్యలో ఈ పుస్తకాలు కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. పుస్తక ప్రియులైన పవన్... విజయవాడ బుక్ ఫెస్టివల్‌ను శనివారం ఉదయం సందర్శించారు. దాదాపు రెండున్నర గంటలపాటు వివిధ స్టాల్స్‌ను సందర్శించి తెలుగు సాహిత్యానికి సంబంధించి వివిధ పుస్తకాలు పరిశీలించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పుస్తకాలు కొనుగోలు చేశారు. ప్రాచీన సాహిత్యంపై వెలువరించిన విశ్లేషణలు, పరిశీలన పుస్తకాలను ఎంచుకున్నారు. వీటితో అనువాద సాహిత్య పుస్తకాలు, నిఘంటువులు, ఆధ్యాతిక సంబంధిత రచనలు పరిశీలించి కొనుగోలు చేశారు. చట్టాలు, చరిత్ర, రాజకీయ, పబ్లిక్ పాలసీ, శాస్త్ర సాంకేతిక, వ్యవసాయ, వృక్ష సంబంధిత పుస్తకాలపై ప్రత్యేక ఆసక్తి చూపారు. తెలుగు సాహిత్యం, అనువాద సాహిత్యం, నిఘంటువులు, ఆధ్యాత్మిక సంబంధిత రచనలపై అమితాసక్తి కనబరిచారు. అదే విధంగా భారతీయ చట్టాలు, చరిత్ర, రాజకీయ, పబ్లిక్ పాలసీ, శాస్త్ర సాంకేతిక, వ్యవసాయ, వృక్ష, పర్యావరణ సంబంధిత పుస్తకాలపై శ్రద్ధచూపారు. విజయవాడ నగర కమిషనర్ రాజశేఖర్ బాబు, బుక్ ఫెస్టివల్ నిర్వాహకులు, ఎమెస్కో విజయ్ కుమార్, టీ.మనోహరనాయుడు, లక్ష్మయ్య, బాబ్జీ, గొల్ల నారాయణరావు ఆయన వెంట ఉన్నారు.

దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టు గ్రీన్‌కో

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టు గ్రీన్‌కో అని, దేశంలో రూ.లక్ష కోట్లు, రాష్ట్రంలో రూ.30 వేల కోట్ల పెట్టుబడులు పెట్టారని, సాగుకు పనికి రాని భూముల్లో అద్భుతమైన ప్రాజెక్టులు చేపట్టారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. శనివారం గ్రీన్‌కో గాలి, నీటి, సౌర, విద్యుత్ తయారు చేస్తున్న ప్రాజెక్టును, భూములను పరిశీలించారు. అనంతరం ఆర్‌అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ నవ్య, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, కంపెనీ వ్యవస్థాపకులు అనిల్ చలమశెట్టి, మహేష్‌కొల్లితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ఇటు కర్నూలు, అటు నంద్యాల పరిధిలో ఉందన్నారు. గ్రీన్‌కో ప్రాజెక్టు 2021లో ప్రారంభమైందని, ఇప్పటి వరకు రూ.10 వేల కోట్లు ఖర్చు చేశారని, మొత్తం రూ.30 వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు 10 వేల మందికి ప్రత్యక్షంగా, 40 వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటీ తరువాత గ్రీన్ ఎనర్జీపై దృష్టి పెట్టారన్నారు. గ్రీన్‌కోకు ప్రభుత్వం కేటాయించిన భూముల్లో 45 హెక్టార్లలో అటవీ, రెవెన్యూ శాఖ మధ్య చిన్న వివాదం ఉందని. క్షేత్ర స్థాయిలో దీనిని పరిశీలించాలనే తాను వచ్చినట్లు చెప్పారు. ఇది భవిష్యత్‌లో గొప్ప పర్యాటక ప్రాంతం అవుతుందని అన్నారు. ఏపీలో మూడవ వంతు విద్యుత్ అవసరాలను ఈ ప్రాజెక్టు అందిస్తుందన్నారు. నెలకు 200 యూనిట్ల మేర 43 లక్షల ఇళ్లకు విద్యుత్ అందించే ఉత్పత్తి ఇక్కడ జరుగుతుందన్నారు. ఈ వివాదం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని, అవసరమైతే క్యాబినెట్‌లో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో రెవెన్యూ, పోరంబోకు, అటవీ భూములు గత ప్రభుత్వం హయాంలో దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్ పెట్టి ఆక్రమణకు గురైన భూములను గుర్తించి స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

ఎంవీఏలో ఐక్యత కొనసాగేనా?

స్థానిక ఎన్నికల్లో ఉద్ధవ్ పార్టీ ఒంటరి పోరు?

నాగ్‌పూర్: మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) లో నెలకొన్న విభేదాలు సమసిపోతాయా అనేది ప్రశార్థకంగా మారింది. మహారాష్ట్రలోని ఈ కూటమి ప్రధాన పార్టీలయిన ఎన్‌సీపీ (ఎస్‌పీ), శివసేన (యూబీటీ), కాంగ్రెస్ మధ్య లోక్‌సభ ఎన్నికల అనంతరం స్వల్ప విభేదాలు పొడచూపాయి. అయితే వాటిని సర్దుబాటు చేసేందుకు ఆయా పార్టీల నేతలు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎంవీఏ ఓటమిపై నిందల నడుమ... కూటమి సభ్యుడు ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) శనివారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. ఇది ప్రతిపక్ష కూటమి ఐక్యతపై ప్రశ్నార్థకమైన చర్యగా కనిపిస్తోంది. శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్... కూటమిలోని సంబంధిత పార్టీల కార్యకర్తలకు అవకాశాలు లేకపోవడం, సంస్థాగత వృద్ధి హక్కును ఒంటరిగా పోటీ చేయడానికి ప్రధాన పరిగణనలుగా పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం, ఠాక్రే నేతృత్వంలోని పార్టీ ఫిబ్రవరి 5న జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్‌కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఇది కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బగా ఉంది. రౌత్ ప్రకటనపై కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఒకరు స్పందిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తుందా లేదా అనే దానిపై పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయిస్తుందని చెప్పారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను ఇంకా

ప్రకటించలేదు. కాగా, శివసేన (యూబీటీ) నిర్ణయం ఎంవీఏ సంకీర్ణంలోని మూడు నియోజకవర్గాల ఎన్నికల అవకాశాలను ప్రభావితం చేస్తుందని శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ (ఎస్‌పీ) పేర్కొంది. అయితే శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) తో కూడిన ఇండియా ఐక్య సంఘటన, మహా వికాస్ అఘాడి పొత్తులు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోసం ఉద్దేశించబడినవని రౌత్ అన్నారు. 'కూటమిలో వ్యక్తిగతంగా పార్టీల కార్యకర్తలకు అవకాశాలు లభించవు. ఇది సంస్థాగత వృద్ధిని దెబ్బతీస్తుంది. మేము ముంబై, థానే, నాగ్‌పూర్, ఇతర మునిసిపల్ కార్పొరేషన్లు, జిల్లా పరిషత్‌లు, పంచాయతీలకు మా బలంతో ఎన్నికల్లో పోటీ చేస్తాం' అని ఆయన విలేకరులతో అన్నారు. ఉద్ధవ్ ఠాక్రే ఒంటరిగా పోటీ చేయాలనే సంకేతాలను పార్టీకి ఇచ్చారని రౌత్ అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన, ఎన్‌సీపీతో కూడిన మహాయుతి కూటమి రాష్ట్రంలోని 288 సీట్లలో 230 గెలుచుకుంది. ఎంవీఏ సంఖ్యను 46 సీట్లకు కుదించింది. శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) వరుసగా 20, 16, 10 సీట్లను దక్కించుకున్నాయి. ఎంవీఏలో సమన్వయం లేకపోవడానికి కాంగ్రెస్ పార్టీనే కారణమని రౌత్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ఇండియా ఐక్య సంఘటన ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదని ఆయన పేర్కొన్నారు. శివసేన (యూబీటీ) ఒంటరిగా వెళ్లాలనుకుంటే దాన్ని ఆపలేమని శాసనసభలో ఎన్‌సీపీ (ఎస్‌పీ) పక్ష నాయకుడు జితేంద్ర అవాద్ అన్నారు. 'వారు ఒంటరిగా వెళ్లాలనుకుంటే వారిని ఆపడానికి మనం ఎవరు? మనం ఎవరినీ బలవంతంగా తీసుకువెళ్లలేం. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత మనం కలిసి ఉండాలి. అది సరైన నిర్ణయం అని నేను అనుకోను. మూడు పార్టీల ఎన్నికల అవకాశాలు ప్రభావితమవుతాయి' అని ఆయన చెప్పారు. ఇదిలాఉండగా, స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీలు ఎప్పుడూ ఒంటరిగా పోటీ చేస్తాయని ఎన్‌సీపీ (ఎస్‌పీ) కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలే అన్నారు. నాగ్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వికాస్ ఠాక్రే మాట్లాడుతూ శివసేన (యూబీటీ) ఒంటరి మార్గాన్ని ఎంచుకుంటే, కాంగ్రెస్ కూడా అలా చేయడానికి సిద్ధంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ సీనియర్, ఏఐసీసీ గోవా ఇంఛార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే స్పందిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. మాణిక్ రావ్ ఠాక్రే విలేకరులతో మాట్లాడుతూ 'ఎంవీఏ చెక్కుచెదరకుండా ఉందా లేదా అనేది మాకు ఆందోళన లేదు. మహారాష్ట్ర పురోగతి, అభివృద్ధిని నిర్ధారించడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాబోయే అన్ని ఎన్నికలలో ప్రజల మద్దతు ఉంటుందని నాకు నమ్మకం ఉంది' అని అన్నారు.

భారత వృద్ధి రేటు అంతంతే!

తేల్చేసిన ఐఎంఎఫ్

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా స్థిరంగా అభివృద్ధి కొనసాగుతున్నా 2024-25లో భారత వృద్ధి రేటు స్వల్పంగా బలహీన పడవచ్చునని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య విధానం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రాంతీయంగా విభేదాలు ఉన్నప్పటికీ... ప్రపంచ వృద్ధి రేటు నికరంగా ఉంటుదన్నారు. భారత వృద్ధి రేటు బలహీన పడటానికి కారణాలేమీ చెప్పలేదు. ఐఎంఎఫ్ వరల్డ్ ఎకానమీ ఔట్‌లుక్ ప్రకారం అమెరికా వృద్ధి రేటు అంచనాలకన్నా మెరుగ్గా ఉంటుందని చెప్పారు. ఈయూ అభివృద్ధి నిలిచిపోతుందన్నారు. బ్రెజిల్ ఆర్థిక వ్యవస్థపై అధిక ద్రవ్యోల్బణం ప్రభావం చూపుతుందని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా అన్నారు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద రెండో ఆర్థిక వ్యవస్థ చైనాలో ప్రతికూల ద్రవ్యోల్బణం నెలకొందన్నారు. దేశీయంగా డిమాండ్లకు సవాళ్లు ఎదురవుతాయని అన్నారు. అన్ని రకాల చర్యలు తీసుకున్నా తక్కువ ఆదాయ దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయిన డొనాల్ట్ ట్రంప్ ప్రభుత్వం అమలు చేసే సుంకాలు, పన్నులు, నియంత్రణ నిబంధనలను అమలులోకి తెచ్చినా ప్రతికూల ప్రభావం ఉంటుందని తెలిపారు. ఈ నెల 20న అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టనున్నారు. ద్రవ్యోల్బణంపై పోరుకు వడ్డీ రేట్లు కూడా తగ్గించాల్సి ఉంటుంది. కాగా ట్రంప్... మెక్సికో, చైనా, కెనడాపై అదనపు సుంకాలు, పన్నులు ఉంటాయని హెచ్చరించారు.

ప్రతి హామీ అమలు చేయాలి: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: ప్రజలకిచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వామపక్షాలు, ప్రజాసంఘాల అధ్వర్యంలో మరిన్ని పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. మల్లయ్యలింగంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని చెప్పిన చంద్రబాబుకు ఆ హామీని గుర్తుచేస్తూ సీపీఐ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుపేదలతో స్థానిక సచివాలయాల్లో అర్జీలు అందజేయడం జరిగిందన్నారు. మలివిడతలో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి అర్జీలు అందజేయడం జరిగిందన్నారు. తక్షణమే ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక, రాజకీయ రంగాలు కలుషితం అయ్యాయని జంగాల ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థ కోలుకోలేనంతగా ఉందన్నారు. రైతుకి గిట్టుబాటు ధర ఇవ్వాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడాలని పంజాబ్‌లో 46 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకులు దల్లైవాల్‌ను పరామర్శించే ఆలోచన చేయకపోవడం మోదీ రాక్షసత్వానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్... మోదీ జపం చేస్తున్నారని, ప్రశ్నిస్తే జైలుకు పంపుతారేమోనన్న భయంతో ఏమీ మాట్లాడలేకపోతున్నారని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

కన్నౌజ్ రైల్వేస్టేషన్‌లో కూలిన పైకప్పు

శిథిలాల కింద కూలీలు

కన్నౌజ్: ఉత్తర ప్రదేశ్‌లోని కన్నౌజ్ రైల్వే స్టేషన్‌లో శనివారం నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోవడంతో శిథిలాల కింద డజన్ల కొద్దీ కూలీలు సమాధి అయ్యారు. స్టేషన్‌లో సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా రెండు అంతస్తుల భవనంపై పనులు జరుగుతుండగా ఈ సంఘటన జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో దాదాపు 35 మంది కూలీలు అక్కడే ఉన్నారు. రైల్వే, పోలీసులు, పరిపాలనా అధికారుల నేతృత్వంలోని సహాయక చర్యల్లో ఇప్పటివరకు 23 మంది కూలీలను శిథిలాల నుంచి రక్షించారు. 'ప్రాథమిక సమాచారం ప్రకారం, నిర్మాణంలో ఉన్న పైకప్పు షట్టరింగ్ కూలిపోవడంతో ఈ సంఘటన జరిగింది' అని జిల్లా మేజిస్ట్రేట్ (డీఎం) శుభంత్ కుమార్ శుక్ల్ అన్నారు. 'చిక్కుకుపోయిన కూలీలను రక్షించడమే మా మొదటి ప్రాధాన్యత. సహాయక చర్యల కోసం మా వద్ద ఉన్న అన్ని వనరులను ఉపయోగిస్తున్నాం' అని తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేలు స్వల్పంగా గాయపడిన వారికి రూ.5 వేల పరిహారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సహాయ చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని ఈశాన్య రైల్వే తెలిపింది. సహాయ చర్యల్లో పాల్గొనేందుకు లక్నో నుంచి రాష్ట్ర విపత్తు సహాయ దళం (ఎస్‌డీఆర్ఎఫ్)ను పిలిపించారు. ఈ ఘటనపై యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ... తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి తక్షణమే అవసరమైన వైద్య సహాయాన్ని సమకూర్చాలని సూచించారు. బాధితులంతా త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు.

వేదాల ప్రాసంగికతను కాదనలేం

రెంటాల వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ రూరల్: వేల సంవత్సరాల క్రితం నాటివైనప్పటికీ వేదాలు నేటికీ చర్చనీయాంశాలేనని ప్రముఖ రచయిత డా.రెంటాల వెంకటేశ్వరరావు అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో 10వ రోజు రామోజీరావు సాహిత్యవేదికపై జరిగిన సభకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పుస్తకాలను రెంటాల వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రుగ్వేద 'యథార్థ దర్శనం', 'వెలుతురు', 'స్వప్నసాగరం', 'ఈ గులాబీకి ముళ్లు లేవు' పుస్తకాలను ఆవిష్కరించిన డా. రెంటాల మాట్లాడుతూ వేదాలు అపౌరుషేయాలు కానప్పటికీ వాటిలోని సౌందర్యాన్నీ, ప్రకృతికి సంబంధించిన అవగాహననూ కాదనలేమన్నారు. సామాజిక శాస్త్ర అధ్యయనానికి కావాల్సిన సమాచారమంతా వేదాల్లో పుష్కలంగా ఉందన్నారు. నేడు పూజిస్తున్న దేవతలెవరూ వేదాలలో లేరన్నారు.

వేదాలు అధ్యయనం చేస్తున్నవారిలో, గౌరవిస్తున్నవారిలో చాలామందికి వాటి అర్థం తెలియదన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు గుమ్మా సాంబశివరావు 'వెలుతురు' పుస్తకాన్ని సమీక్షించారు. విశ్రాంత ఐఏయస్ అధికారి ఎండీ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ కథా సౌందర్యానికి సంబంధించిన నియమాలను వివరిస్తూ రసరాజుగారి కథాసంపుటిలో ఆ లక్షణాలున్నాయన్నారు. కవి, రచయిత రసరాజు మాట్లాడుతూ తన కథాసంపుటిలోని కథల విశేషాలను వర్ణించారు. డా.గుజ్జు చెన్నారెడ్డి మాట్లాడుతూ ఆంగ్ల సాహిత్య వికాస క్రమాన్ని వివరించారు. స్వప్నసాగరం అనేది భారతదేశంలోనే మధ్యమపురుష(ద్వితీయపురుష)లోనే రాసిన మొదటి రచన అన్నారు. డా.తాటి శ్రీకృష్ణ మాట్లాడుతూ సాహితీకారులు ఎల్లప్పుడూ తమ కాలం నాటి బాధితుల స్వరాన్ని ప్రతిఫలించారన్నారు. విశాలాంధ్ర డిప్యూటీ జనరల్ మేనేజరు మనోహర్ నాయుడు వందన సమర్పణ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.